



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం : ఒక్కరూ మనవెనుక రాలే!

లోపలి పేజీల్లో

యుద్ధం.. ప్రపంచానికి భారమే!


సంపుటి 08, సంచిక: 163 | మంగళవారం | 13-05-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# పాకిస్థాన్‌పై చర్యలు నిలిపివేత తాత్కాలికమే

## వారి ప్రవర్తన ఆధారంగానే భవిష్యత్తు చర్యలు

### ఇది యుద్ధాల యుగం కాదు... ఉగ్రవాద యుగం కాదు

- అణు బెదిరింపును భారత్ సహించబోదు
- చర్చలంటూ జరిగితే అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే
- ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా జాతినుద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగం

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఆపరేషన్ సిందూర్ భారత దేశ నూతన విధానమని, పాకిస్థాన్ పై చర్యలు తాత్కాలికంగా నిలిపివేశామని, వారి ప్రవర్తనను బట్టి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇది యుద్ధాల యుగం కాదని, అలాగే ఉగ్రవాద యుగం కూడా కాదని స్పష్టం చేశారు. భారతదేశం ఎలాంటి 'అణు బెదిరింపు'ను సహించబోదని తెలిపారు. చర్చలంటూ జరిగితే అది ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) గురించే ఉంటాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా జాతిని ఉద్దేశించి ప్రధాని మోదీ సోమవారం నాడు టివి ద్వారా 22 నిమిషాల పాటు ప్రసంగించారు. పాకిస్థాన్ సైనిక దాడిని ఆపబోమని భారతదేశాన్ని వేడుకున్నప్పటికీ, తమ దుస్సాహసాన్ని ఆపుతామని వారు హామీ ఇచ్చిన తర్వాత మాత్రమే న్యూఢిల్లీ దానిని పరిగణనలోకి తీసుకుందని చెప్పారు. పహల్గాం దాడిని 'ఉగ్రవాదం అత్యంత క్రూరమైన ముఖం'గా ప్రధానమంత్రి అన్నారు. ఇది తనను వ్యక్తిగతంగా బాధించిందని పేర్కొన్నారు. మన మహిళల నుదుటి నుండి సిందూరం తొలగించిన పర్యవసానాలను శత్రువు ఇప్పుడు గ్రహించాడని అన్నారు. దేశ ప్రజలను ఉద్దేశించి మోదీ తరువాయి 2లో

ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ మౌనమేలా?:కాంగ్రెస్ 02



"పాకిస్థాన్ సైన్యం, ప్రభుత్వం నిరంతరం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాయి. ఇలాంటి చర్యలు చివరికి పాకిస్తాన్ పతనానికి దారితీస్తాయి.పాకిస్థాన్ మనుగడ సాగించాలంటే, దాని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేయాలి. శాంతికి మరో మార్గం లేదు. ఉగ్రవాదం, చర్చలు సహజీవనం చేయలేవు. ఉగ్రవాదం, వ్యాపారం సమాంతరంగా సాగలేవు. రక్తం నీరు కలిసి ప్రవహించలేవు. గౌతమ బుద్ధుని బోధనలను గుర్తు చేసుకుంటూ, శాంతి మార్గం బలం ద్వారా మార్గనిర్దేశం చేయబడాలి. శాంతిని కాపాడాలంటే భారతదేశం బలంగా ఉండాలి. అవసరమైనప్పుడు ఆ బలాన్ని ప్రయోగించాలి.

\- ప్రధాని నరేంద్ర మోదీ

# హైదరాబాద్ జిసిసి హబ్



- సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, ఎఐ-రెడీ డేటా సెంటర్లలో ప్రముఖంగా నిలుస్తోంది
- హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సిఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి గ్లోబల్ ఐటి కంపెనీలు విస్తరించాయి
- సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవం సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్థికవృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనతో పాటే సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని సమతుల్యం చేసుకుంటూ సమగ్రమైన సమ్మిళితమైన అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. 'తెలంగాణ రైజింగ్' అనే ఆలోచనలో ఈ దార్శనికత ఇమిడి ఉందని అన్నారు. హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జిసిసి) హబ్‌గా మారిందని, ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, ఎఐరెడీ డేటా సెంటర్లలో ప్రముఖంగా నిలుస్తోందని, మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సిఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి గ్లోబల్ ఐటి కంపెనీలు హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరించాయని సిఎం చెప్పారు. నానక్‌రామ్ గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన ఫెసిలిటీ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సోనాటా సాఫ్ట్‌వేర్ మేనేజింగ్ డైరెక్టర్, సిఈఓ సమీర్ ధీర్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, హైదరాబాద్‌ను ప్రపంచంలోని అద్భుత నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రణాళికలను సిఎం ఈ వేదికగా వివరించారు. అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దడంలో, తెలంగాణ అభివృద్ధిని ప్రపంచం తరువాయి 2లో



భారత్‌-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు, దేశంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గవర్నర్ జిష్టుదేవ్ వర్మతో సోమవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

# యుద్ధాన్ని మేమే ఆపాం



### అనేక కారణాలు ఉన్నా... వ్యాపారం ఒక పెద్ద కారణం

ఆపితే మరింత వ్యాపారం చేస్తామని చెప్పా : ట్రంప్ వివాదాస్పద వ్యాఖలు

**వాషింగ్టన్ డి.సి. :** భారతదేశం, పాకిస్తాన్ మధ్య 'అణ్వాయుధ సంఘర్షణ'ను తమ ప్రభుత్వం ఆపిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. శత్రుత్వాలను ముగింపు పలికితే దక్షిణ ఆసియా పొరుగు దేశాలతో అమెరికా 'మరింత వ్యాపారం' చేస్తుందని చెప్పారు. 'భారతదేశం , పాకిస్తాన్ మధ్య పూర్తి, తక్షణ కాల్పుల విరమణకు శనివారం మా ప్రభుత్వం సహాయపడింది. మా అభిప్రాయం ప్రకారం, పెద్ద సంఖ్యలో అణ్వాయుధాలు కలిగిన రెండు దేశాల ప్రమాదకరమైన సంఘర్షణను ముగించే శాశ్వతమైన కాల్పుల తరువాయి 2లో

# రెండు వైపుల నుండీ ఒక్కతూటా పేలకూడదు

### కాల్పుల విరమణ కొనసాగిద్దాం సరిహద్దుల్లో సైన్యాన్ని తగ్గిద్దాం

భారత్‌-పాక్ డిజిఎంఒల నిర్ణయం

**న్యూఢిల్లీ :** కాల్పుల విరమణను కొనసాగించాలనీ, భారత్‌-పాకిస్థాన్‌లు ఏ ఒక్కవైపు నుండీ ఒక్క తూటా కూడా పేలకుండా నివారించాలని రెండు దేశాల మిలిటరీ డైరెక్టర్ జనరల్స్ (డిజిఎంఓ) నిర్ణయించారు. నిర్ణీత ప్రకారం నిర్దేశించిన సైనిక డైరెక్టర్ జనరల్స్ సమావేశం ఐదు గంటలు ఆలస్యంగా సోమవారం సాయంత్రం జరిగింది. భారత ఆర్మీ ఒక ప్రకటన చేస్తూ, కాల్పుల విరమణకు కట్టుబడి ఉండాలనీ, ఒక్క తూటాను కూడా ఏ ఒక్కరూ పేల్చకూడదనీ లేదా ఒక్క తూటా కూడా పేల్చేందుకు ఎలాంటి చొరవా చెయ్యకూడదనీ సంభాషణల్లో డిజిఎంఓలు నిర్ణయించినట్లు పేర్కొంది. అదేవిధంగా రెండు దేశాలూ సరిహద్దుల నుండి సైన్యం సంఖ్యను తగ్గించేందుకు భరోసా ఇచ్చేలా తక్షణం చర్యలను పరిశీలించాలని కూడా రెండు తరువాయి 2లో

# టెర్రరిస్టులను మట్టుబెట్టాలి

- మతాన్ని హింసకు వాడుకోవడం ఆటవిక సాంప్రదాయం
- ఉగ్రవాదానికి శాశ్వత పరిష్కారం చూపాలి
- మత ప్రాతిపదికన చంపడం దారుణం
- పశ్య కన్నమ్మ సంతాప సభలో వక్తల ఉద్ఘాటన




ప్రజాపక్షం/హుజూర్‌నగర్

ప్రపంచంలో ఏ దేశంలోనైనా టెర్రరిస్టులను మట్టు పెట్టాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో సిపిఐ సీనియర్ నేత ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన స్వాతంత్ర్య సమర యోధురాలు, మహిళ సమాఖ్య నాయకురాలు దివంగత పశ్య కన్నమ్మ సంతాప తరువాయి 12లో



# వాణిజ్య పన్నుల శాఖలో 6 శాతం ప్రగతి

- రాష్ట్ర ఖజానాకు రూ.500 కోట్లు ఆదాయం
- భవిష్యత్తులోనూ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలి
- అధికారులకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

గత సంవత్సరంతో పోలిస్తే వాణిజ్య పన్నుల శాఖలో మొత్తంగా 6 శాతం ప్రగతి కనిపించిందని, ఇదొక మంచి పరిణామం అని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మార్చి మాసంలో సిఎస్‌టి,వ్యాట్ మొత్తంగా వృద్ధి రూ 600ల కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంటే, సుమారు రూ. 500ల కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకు సమకూరిందన్నారు. భవిష్యత్తులో కూడా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన 'రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ 'సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్స్ విక్రయాల్లో మంచి ప్రగతి కనిపిస్తున్నప్పటికీ, వ్యవసాయ భూములు, ఓపెన్ ఫ్లాట్స్ విక్రయాల్లో తరువాయి 2లో



బోరెడ్డి అయోధ్యరెడ్డి



పివి శ్రీనివాసరావు



దేశాల భూపాల్



మొహసినా పర్వీన్

# నలుగురు ఆర్‌టిఐ కమిషనర్ల నియామకం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నియామకాలు చేపట్టింది. రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కమిషనర్లుగా నలుగురిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొంత కాలంగా ఈ పదవులు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.నూతనంగా నియమితులైన వారిలో పివి శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, తరువాయి 2లో


# యుఎస్, చైనా వాణిజ్య యుద్ధానికి 90 రోజుల విరామం

- వాణిజ్య యుద్ధానికి 90 రోజుల విరామం
- సుంకాలు తగ్గించుకున్న అమెరికా, చైనా
- జెనీవాలో శనివారం ఇరుదేశాల చర్చల్లో ఒప్పందం
- పరస్పరం 115 శాతం తగ్గింపు
- చైనా సరుకులపై 30 శాతం, అమెరికా సరుకులపై 10 సుంకం
- 90 రోజుల్లో వివాదాల పరిష్కారానికి సంప్రదింపులు



**జెనీవా :** ఇటీవల పరస్పరం పెంచుకున్న టారిఫ్‌లను దాదాపుగా తగ్గించుకునేందుకు అమెరికా, చైనా దేశాలు అంగీకారానికి వచ్చాయి. అలాగే, వాణిజ్య వివాదాల పరిష్కారానికి మరిన్ని చర్చలకు వీలుగా వాణిజ్య యుద్ధానికి 90 రోజుల పాటు విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. చైనా సరుకులపై అమెరికా ప్రతిగా సుంకాన్ని 145 శాతం నుంచి 30 శాతానికి, అమెరికా సరుకులపై చైనా విధించిన సుంకాన్ని 125 శాతం తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## సాయుధ పోరాటానికి కుర్దుల పార్టీ నిర్ణయం
### ప్రజాస్వామ్య రాజకీయాల్లోకి ప్రవేశించాలని నిర్ణయం

**ఇస్తాంబుల్ :** టర్కీ ప్రభుత్వం గతంలో ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన కుర్దిష్ వర్కర్స్ పార్టీ(పికెకె) కీలక నిర్ణయం తీసుకుంది. సాయుధ పోరాటానికి స్వస్తి పలకాలని, తమ సంస్థను రద్దు చేసి, ప్రజాస్వామ్య రాజకీయాల లోకి ప్రవేశించాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ నాయకులు సోమవారం ప్రకటించారు. స్వతంత్ర్య కుర్దిష్ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో 1984లో పికెకె ఏర్పాటైంది. నాలుగు దశాబ్దాలుగా సాయుధపోరాటాన్ని కొనసాగించింది. ఇందులో వేలాది కుర్దులు, టర్కీ ప్రజలు మరణించారు. గత వారం ఉత్తర ఇరాక్‌లో జరిగిన పికెకె 12వ కాంగ్రెస్‌లో పికెకె సంస్థాగత నిర్మాణాన్ని రద్దు చేయాలని, సాయుధ పోరాటాన్ని నిలిపివేయాలని నిర్ణయించిందని ఫిరాత్ వార్తా సంస్థ పేర్కొంది. పికెకె అధికార ప్రతినిధి ఒకరు తమ నిర్ణయాన్ని నిర్ధారించడంతో పాటు, సాయుధ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. పికెకెను రద్దు చేయాలని టర్కీ జైలులో యావజ్జీవ శిక్షను అనుభవిస్తున్న ఆ సంస్థ నాయకుడు అబ్దుల్లా ఒకలాన్ ఫిబ్రవరిలో ఇచ్చిన పిలుపుకు స్పందనగా పికెకె కాంగ్రెస్ నిర్వహించి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## నిర్భందంలో ఉన్న జర్నలిస్టులను విడుదల చేయాలి
### వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ విలువైన బహుమతులు
### మౌఢ్యం, విద్వేషాలకు మీడియా చోటు ఇవ్వొద్దు
### నూతన పోప్ లియో 14 విజ్ఞప్తి



**వాటికన్ సిటీ :** నిర్భందంలో ఉన్న జర్నలిస్టులను విడుదల చేయాలని పోప్ లియో 14 విజ్ఞప్తి చేశారు. ఈ చర్య వాక్, పత్రికా స్వేచ్ఛకు బహుమతి వంటిదని పేర్కొన్నారు. పోప్ ఎన్నిక ప్రక్రియను కవర్ చేసేందుకు రోమ్‌కు వెళ్ళిన 6 వేల మంది జర్నలిస్టులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. సాధారణ పౌరుల ప్రతినిధులతో మొదటిసారి సమావేశమయ్యేందుకు వాటికన్ ఆడిటోరియంలోకి నూతన పోప్ ప్రవేశించగానే అందరూ లేచి నిలబడి చప్పట్లతో స్వాగతం పలికారు. మొదటిసారి అమెరికా నుంచి ఎన్నికైన 69 ఏళ్ల పోప్ ప్రసంగిస్తూ శాంతి , యుద్ధ తిరస్కరణ, గొంతు లేని వారికి గొంతు కోసం తమ పదాలను ఉపయోగించాలని వాడాలని జర్నలిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. నిజాన్ని తెలుసుకునేందుకు, రాసేందుకు చేసిన ప్రయత్నంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా జైలు పాలైన జర్నలిస్టుల పట్ల ఆయన సంఘీభావం వ్యక్తం చేశారు. వారిని విడుదల చేయాలని కోరారు. యుద్ధ సమయంలో తమ జీవితాన్ని సైతం పణంగా పెట్టి వార్తలు రాసేందుకు వెళ్లే వారి గురించి తాను ఆలోచిస్తున్నానని, గౌరవం, న్యాయం, ప్రజల హక్కుల పరిరక్షణ గురించి వారికి తెలియజేసేందుకు చూపుతున్న సాహసాన్ని ఆయన కొనియాడారు. కేవలం విషయం తెలిసిన వ్యక్తులే స్వేచ్ఛగా ఎంపిక చేసుకుంటారని అన్నారు. నిర్భందంలో ఉన్న జర్నలిస్టుల బాధలు దేశాలు, ప్రపంచ సమాజం అంతర్మాతలకు సవాలు విసురుతున్నాయని, మనమంతా వాక్‌స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛకు అనే విలువైన బహుమతిని పరిరక్షించాలని అన్నారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో జాగ్రత్త :** పక్షపాత వైఖరితో కాకుండా నిజాలు రాయడంపై దృష్టి సారించాలని, ''మౌఢ్యం, విద్వేషాల''లకు స్థానం ఇవ్వవద్దని మీడియాను పోప్ కోరినట్లు బిబిసి తెలిపింది. ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ పట్ల పోప్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని బాధ్యతగా, వివేచనతో వినియోగించాలని సూచించారు. మానవాళి ప్రయోజనం కోసమే ఎఐని వాడుకునేలా చూడాలని అన్నారు.

## 15న రష్యా, ఉక్రేన్‌ల చర్చలపై పీటముడి
### బేషరతుగా ప్రత్యక్ష చర్చలు
### పునఃప్రారంభానికి పుతిన్ ప్రతిపాదన
### పుతిన్‌తో నేనే చర్చిస్తానని జెలెన్‌స్కీ తిరకాసు



**క్యీవ్ :** రష్యా, ఉక్రేన్‌ల మధ్య చర్చలు జరిగే పరిస్థితి కనపడడం లేదు. టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో మే 15న బేషరతుగా ప్రత్యక్ష చర్చలను తిరిగి ప్రారంభించాలని(గతంలో 2022లో ఇరు దేశాల మధ్య చర్చలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి) ఉక్రేన్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించారు. అయితే, ఈ చర్చల్లో పుతిన్ తనతో ముఖాముఖి చర్చించాలని ఉక్రేన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తిరకాసు పెట్టారు. దీంతో మే 15న ఉభయ దేశాల చర్చలపై ప్రతిష్టంభన నెలకొంది. 30 రోజుల పాటు కాల్పులు విరమించాలని అమెరికా, యూరోపియన్ యూనియన్ నాయకులు గత గురువారం చేసిన ప్రతిపాదన చేశారు. అదే రోజు దానిని తిరస్కరించిన రష్యా, నేరుగా బేషరతుగా ఉక్రేన్‌తో చర్చలను కొనసాగించేందుకు ప్రతిపాదించింది. రష్యా ప్రతిపాదనను ఆమోదించాలని ఉక్రేన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. అయితే, టర్కీలో పుతిన్‌తో వ్యక్తిగతంగా చర్చించేందుకు సిద్ధమని జెలెన్‌స్కీ తిరకాసు పెట్టారు. ఉక్రేన్ యుద్ధానికి అంతం పలకాలని కోరుకుంటుందని, అందుకు అవసరమైన ప్రతి పనిని చేస్తామని, రష్యా నుంచి కూడా అందుకు అనుగుణమైన చర్యలు ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన టెలిగ్రామ్‌లో అన్నారు. నూతన పోప్ లియో 14తో మొదటి సంభాషణలో శాంతి ప్రయత్నాల గురించి వివరించినట్లు ఆయన తెలిపారు. పోప్‌ను ఉక్రేన్ సందర్శించాలని ఈ సందర్భంగా కోరినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్‌పై వందకు పైగా డ్రోన్‌లను రష్యా ప్రయోగించిందని ఉక్రేన్ ఎయిర్‌ఫోర్స్ సోమవారం నాడు ఆరోపించింది. ఇటీవల విక్టరీ డే సందర్భంగా రష్యా బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ, రష్యాపై ఉక్రేన్ డ్రోన్‌ల దాడిని కొనసాగించింది. జెలెన్‌స్కీ మాటలకు చర్యలకు పొంతనలేకుండా పోతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ మౌనమేలా?
### జైరామ్ రమేశ్ : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, మధ్యవర్తిత్వం చేసినట్లు ప్రకటనలపై ప్రధానమంత్రి తన ప్రసంగంలో పూర్తిగా మౌనం వహించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. ప్రధాని ప్రసంగంపై ఆయన తన 'ఎక్స్' ఖాతాలో స్పందించారు. ఆయన స్పందన ఇలా ఉంది.''ప్రధానమంత్రి చాలా ఆలస్యంగా చేసిన దేశ ప్రజల ప్రసంగాన్ని, కొద్ది నిమిషాల ముందు అధ్యక్షుడు ట్రంప్ బైటపెట్టిన అంశాలు పూర్తిగా నీరుగార్చాయి. వాటి గురించి ప్రధాని పూర్తిగా మౌనంగా ఉన్నారు. అమెరికా మధ్యవర్తిత్వానికి భారతదేశం అంగీకరించిందా? పాకిస్తాన్‌తో చర్చల కోసం 'తటస్థ స్థలానికి' భారతదేశం అంగీకరించిందా? ఆటోలు, వ్యవసాయం, ఇతర రంగాలలో భా రతీయ మార్కెట్లను తెరవాలని అమెరికా డిమాండ్లకు భారతదేశం ఇప్పుడు లొంగిపోతుందా? ప్రధాని ఇంకా చాలా ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంది.'' అని జైరామ్ రమేశ్ అన్నారు. మన సాయుధ దళాలను తాము నిస్సంకోచంగా అభినందిస్తున్నామని, వారికి సెల్యూట్ చేస్తున్నామని అన్నారు. మరో కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చౌహాన్ ముంబైలో 'పిటిఐ'తో మాట్లాడు తూ ప్రధాని ప్రసంగంలో కశ్మీర్ సమస్య అంతర్జాతీయమైందా అనే గురించి, సిమ్లా ఒప్పందం గురించి ఎటువంటి ప్రస్తావన లేదని అన్నారు. డొనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని పాకిస్థాన్‌తో సమానంగా పరిగణించారని, ఈ స్థానాన్ని అంగీకరించడానికి భారతదేశం సిద్ధంగా ఉందా' అని ఆయన ప్రశ్నించారు.

## మిస్రీ కుటుంబంపై సోషల్ మీడియాలో ట్రోలింగ్
### ఎఐడి,ఎన్‌సిడబ్ల్యు ఖండన
### కఠిన చర్యలకు డిమాండ్

**న్యూఢిల్లీ:** భారత్‌-పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకపాత్ర వహించిన కేంద్ర ప్రభుత్వ ఉన్నతశ్రేణి వృత్తి నిపుణుడు విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబంపైన, ప్రత్యేకించి ఆయన కుమార్తెకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకునేందుకు, వారికి సమస్యలు సృష్టించేందుకు సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేస్థాయిలో ట్రోలింగ్స్ చేయడాన్ని భారత దౌత్యవేత్తల సంఘం (ఎఐడి), జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) తీవ్రంగా ఖండించాయి. నిష్కళంకమైన చరిత్రగల, సరోత్కృష్టమైన ప్రభుత్వ సేవల్లో ఉన్న మిస్రి కుటుంబంపై ఈ విధంగా ట్రోలింగ్‌లు భయంకరమైన విషయమని, పూర్తిగా ఎట్టిపరిస్థితుల్లోనూ సమ్మతింపరానిదని వారు పేర్కొన్నారు. ఈ విధమైన ట్రోలింగ్‌లకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రముఖ మహిళా మాజీ దౌత్యవేత్త నిరుపమా మీనన్ రావు, ఎఐఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాదీపార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ వంటివారు మిస్రి కుటుంబానికి అండగా నిలిచారు. ట్రోలింగ్‌కు వ్యతిరేకంగా గట్టి మద్దతు తెలియజేశారు. మిస్రి నిష్కళంకమైన వ్యక్తి, మర్యాద,మన్ననగల అధికారి అని పేర్కొన్నారు.భారత్‌-పాకిస్థాన్ దేశాల సైనిక డైరెక్టర్ జనరల్స్ మధ్య ఒక అవగాహన కుదిరిందని ఆయన ప్రకటన చేసిన మరునాటి నుండి ఆయనపై తీవ్ర పదజాలంతో దూషణ ప్రారంభమైంది. ఆయన కుటుంబం లక్ష్యంగా ట్రోలింగ్ మొదలైంది. మిస్రి కుమార్తెపై తీవ్ర పదజాలంతో దూషణలు చేశారు. ఐతే ప్రభుత్వంగానీ, మంత్రులుగానీ ఆయనకు రక్షణకల్పించేవిధంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని సమాజ్‌వాదీ లాంటి పార్టీలు విమర్శించాయి.

**ఆన్‌లైన్‌-ఆఫ్‌లైన్‌లో హుందాగా వ్యవహరించండి :** భారత్‌-పాకిస్థాన్ దేశాల మధ్య ఈనెల పదో తేదీన ఉద్రిక్తతలు సడలిపోవడానికి, సైనిక చర్యల ఉపసంహరణకు వీలుగా ఒక అవగాహన కుదరడంలో కీలకపాత్ర వ హించిన భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబం లక్ష్యంగా రెచ్చగొట్టేపద్ధతుల్లో ట్రోలింగ్ చేయడాన్ని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ డిప్లొమాట్స్ తీవ్రంగా ఖండించింది. ఎన్‌సిడబ్ల్యు ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ సోమవారం ఒక ప్రకటన చేస్తూ, మిస్రి కుమార్తె వ్యక్తిగత సమాచారం, ఆమెను సంప్రదించే నంబర్లను సోషల్ మీడియాలో షేరింగ్ చేయడాన్ని ఖండించారు. ఈ విధమైన షేరింగ్ పూర్తిగా బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఈ విధంగా వ్యక్తిగతంగా దాడిచేయడం నైతికంగా వారి కుటుంబానికి రక్షణ లేకుండా చేయడమేనన్నారు. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో అందరూ సంయమనంతో వ్యవహరించాలని కోరారు. ఈ విధమైన చర్యలకు దూరంగా ఉండాలని ఆమె పౌరులకు విజ్ఞప్తి చేశారు. హుందాగా,బాధ్యతాయుతమైన ప్రవర్తనతో సోషల్ మీడియాలో,బయట వ్యవహరించాలని ఆమె కోరారు. 2024 జులై 15వ తేదీన విక్రమ్ మిస్రి భారత విదేశాంగశాఖ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. ఇండియన్ ఫారిన్ సర్వీస్ 1989వ బ్యాచ్‌కు చెందిన దౌత్యవేత్త మిస్రి ప్రధానమంత్రి కార్యాలయంలో, భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలో అనేక బాధ్యతలు నిర్వహించారు. యూరప్, ఆఫ్రికా, ఆసియా, ఉత్తర అమెరికా సహా అనేక దేశాలలో దౌత్యవ్యవహారాలు నడిపారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెబ్‌సైటులో ఈ అధికారిక సమాచారం లభ్యమైంది. విదేశీ వ్యవహారాల్లో పాకిస్థాన్‌కు సంబంధించిన విషయాలను, ఆ బాధ్యతలను ఆయన నిర్వహించారు. ఒకనాటి విదేశాంగమంత్రులు ఐ.కె.గుజ్రాల్, ప్రణబ్ ముఖర్జీలున్నప్పుడు వారికి ముఖ్యమైన సిబ్బందిలో ఒకరిగా బాధ్యతలు పంచుకున్నారు. గడచిన కొద్ది రోజులుగా భారత్‌-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకున్న పరిణామాల పూర్వరంగంలో ఆయన అనేక పత్రికాగోష్ఠులలో పాల్గొన్నారు. ముఖ్యంగా మే పదో తేదీన భారత్‌-పాకిస్థాన్ మధ్య సైనిక చర్యల విరమణ, ఉద్రిక్తతల సడలింపునకు సంబంధించిన అవగాహనా ఒప్పందంలో ఆయన కీలకపాత్ర వహించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్ మీడియాలో మొట్టమొదట కాల్పుల విరమణ అవగాహన గురించి పోస్టింగ్ చేశారు. ఈ మధ్యవర్తిత్వం తామే చేశామనీ, అమెరికా విజయమనీ ట్రంప్ పోస్టింగ్ పెట్టి కొద్దిసేపటికి విక్రమ్ మిస్రి భారత్ తరపున కాల్పుల విరమణ అవగాహనపై ప్రకటన చేశారు. రెండు దేశాలకు చెందిన మిలిటరీ డైరెక్టర్ జనరల్స్ శనివారంనాడు (మే 10) మధ్యాహ్నం 3.35 గంటలకు ఒక అవగాహనకు వచ్చారనీ, తదుపరి చర్చలు మే 12వ తేదీ మధ్యాహ్నం జరుగుతాయని ప్రకటించిన మరునాటి నుండి ట్రోలింగ్ ప్రారంభమైంది.

**ప్రభుత్వం పట్టించుకోలేదు:** మిస్రికి మద్దతుగా అఖిలేశ్ యాదవ్ ఎక్స్ వేదికగా హిందీలో ఆదివారంనాడు సుదీర్ఘమైన పోస్టింగ్ పెట్టారు. మిస్రి కుటుంబానికి కళంకం తెచ్చేవిధంగా ట్రోలింగ్ ఎంతో నిజాయతీగల అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఆయన దేశంకోసం రాత్రిపగలూ కష్టపడి అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. ''నిర్ణయాలు తీసుకునే బాధ్యత ప్రభుత్వానిదేగానీ, వ్యక్తిగత అధికారులది కాదు, కొన్ని సంఘవ్యతిరేక నేరశక్తులు బాహాటంగా పరిధులు దాటి క్రూరమైన దూషణలతో మిస్రి, మిస్రి కుటుంబంపైన ట్రోలింగ్ చేస్తున్నారు, బిజెపి ప్రభుత్వంగానీ ఏ ఇతర మంత్రులుగానీ ముందుకు వచ్చి ఆయనను ఆయన గౌరవాన్ని కాపాడే ప్రయత్నం చేయలేదు. వారి మర్యాద కాపాడేవిధంగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పలేదు'' అని అఖిలేశ్ యాదవ్ పోస్టింగ్ పెట్టారు. ఒక సీనియర్ దౌత్యవేత్తపై ట్రోలింగ్ సిగ్గుచేటు అని నిరుపమారావు అన్నారు. మిస్రి కుమార్తెపై తీవ్రపదజాలంతో దూషణలు చేశారన్నారు.

### బిజెపి ఎందుకు మౌనం వహించింది?
### తక్షణ విచారణకు వామపక్షాల డిమాండ్

భారతవిదేశాంగ కార్యదర్శి మిస్రి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడాన్ని వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఆయనకు మద్దతు ప్రకటించాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎందుకు మౌనం వహించిందని వామపక్షాలు ప్రశ్నించాయి. మతప్రాతిపదికపై భారతదేశాన్ని విభజించాలని ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారనీ, భారత ప్రజలు ఐక్యంగా ఈ ప్రయత్నాలను ఓడించారనీ మిస్రి ప్రకటించినందుకే ఆయనను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ఎక్స్ వేదికగా విమర్శించింది. మనదేశ ఐక్యతను, ప్రజాస్వామ్యాన్ని ఎవరు ద్వేషిస్తున్నారో చాలా స్పష్టమైన విషయమని కూడా సిపిఐ పేర్కొంది. తక్షణం దీనిపై విచారణ జరిపించాలని, హోంమంత్రి చర్యలు తీసుకోవాలని కోరాయి. రాజ్యసభలో సిపిఐ(ఎం) పార్లమెంటరీ పార్టీ నాయకుడు బ్రిట్టస్ ఈ ట్రోలింగ్‌ను ఖండించారు. ఆన్‌లైన్‌లో వరద ప్రవాహంలా ఆయన కుటుంబానికి వ్యతిరేకంగా ఎందుకు ట్రోలింగ్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో ఎంతో సమన్వయంతో ఆయనపై దాడి జరుగుతోందన్నారు. హోంమంత్రి అమిత్ షా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా సిపిఐ(ఎం) పోస్టింగ్ పెడుతూ, మిస్రి కుమార్తెపై ట్రోలింగ్ జరుగుతోందని పేర్కొంది. వాటి ఇమేజస్‌ను షేర్ చేసింది. ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? ఇది సిగ్గుచేటు కాదా? అని ప్రశ్నించింది. అధికారపార్టీ నిర్ణయాలు తీసుకుంటుందని, వాటికి వ్యక్తిగతంగా ఉన్నతాధికారుఉ ఎలాంటి బాధ్యతా వహించలేరని పేర్కొంది. ఆయనపై వ్యక్తిగత దాడి చేస్తున్నారనీ, ఆయనను ఒంటరిని చేసి ట్రోలింగ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. అదేవిధంగా పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన నావికాధికారి లెఫ్టినెంట వినయ్ నర్వాల్ భార్య హిమాంశి నర్వాల్‌కు వ్యతిరేకంగా కూడా సైబర్‌మార్గంలో విద్వేష ప్రచారం చేస్తున్నారని బ్రిట్టస్ విమర్శించారు. సిపిఐ (మార్క్సిస్ట్‌-లెనినిస్టు) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా ఖండించారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే మిస్రిపై ట్రోలింగ్ చేస్తున్నారని విమర్శించారు. ప్రధానమంత్రి నిర్ణయం తీసుకుంటే మిస్రికి వ్యతిరేకంగా ఎందుకు ట్రోలింగ్ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఉగ్రవాదులు చేసిన మతోన్మాద కుట్రలను భారతదేశ ప్రజలు విఫలం చేశారంటూ మిస్రి కృతజ్ఞతలు చెప్పినందుకే ఆయనకు వ్యతిరేకంగా ట్రోలింగ్ జరుగుతోందా? అని ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు.

## ఒక్కతూటా పేలకూడదు
(మొదటి పేజీ తరువాయి)

దేశాల సైనిక జనరల్స్ అంగీకరించారు.రెండు దేశాల డిజిఎంఓలమధ్యా మే 10వ తేదీ శనివారం మధ్యాహ్నం మొదటి సమావేశం జరిగింది. పాకిస్థాన్ డిజిఎంఓ స్వయంగా భారత డిజిఎంఓకు ఫోన్‌చేసి కాల్పుల విరమణ అంగీకారం గురించి చెప్పారు. అమెరికా మధ్యవర్తిత్వం తర్వాత ఆ ఫోన్‌కాల్ వచ్చింది. ఐతే వారి మొదటి సమావేశంలోనే మరోసారి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మాట్లాడుకోవాలని నిర్ణయించారు. ఐతే కాస్త ఆలస్యంగా సాయంత్రం ఐదు గంటలకు ఈ సమావేశం పూర్తయిందని భారత గగనతల సైనిక కార్యకలాపాల ఎయిర్ మార్షల్ ఎ.కె.భారతి చెప్పారు.

## 6 శాతం ప్రగతి
(మొదటి పేజీ తరువాయి)

ఆశించినంత వేగం కనిపించలేదని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రుల బృందం అధికారులను ఆదేశించింది. ఎక్సైజ్ శాఖ ద్వారా ఆదాయం పెంచుకునే క్రమంలో ఎక్కడైనా లీకేజీలు ఉంటే వాటిని గుర్తించి సరి చేయాలని తెలిపింది. రవాణా శాఖలో కొత్తగా తీసుకొచ్చిన ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికోగ్నైజేషన్ (ఎఎన్‌పిఆర్) వివిధ శాఖల్లోనూ విస్తృతంగా వినియోగించుకుని, పెద్ద మొత్తంలో తనిఖీలు చేపట్టాలని మంత్రుల బృందం ఆదేశించింది.

**విలువైన భూములను సంరక్షించండి:** జిల్లా కేంద్రాల్లో ఉన్న విలువైన భూములను గుర్తించి, వాటిని సంరక్షించే బాధ్యతలు వెంటనే చేపట్టాలని రెవెన్యూ అధికారులను మంత్రుల బృందం ఆదేశించింది. నిర్మాణాల అనుమతుల విషయంలో హెచ్‌ఎండిఎ వేగాన్ని పెంచాలని సూచించింది. గిరిజన ప్రాంతాల్లో ఉన్న సొసైటీల ద్వారా ఇసుక అమ్మకాలు జరపాలని, నిజమైన వారిని గుర్తించి గిరిజన సొసైటీ లో సభ్యులుగా చేర్చాలని, గిరిజన సంక్షేమ శాఖ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి పకడ్బందీగా అమలు చేసి, అసలైన గిరిజనులకు ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, రోడ్లు,భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, సిసిఎల్‌ఎ కమిషనర్ నవీన్ మిట్టల్, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ, మైన్స్ అండ్ జియాలజీ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్ కుమార్, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత, రవాణ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, రిజిస్ట్రేషన్ కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి , డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నిలిపివేత తాత్కాలికమే
(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూర్ కేవలం ఒక పేరు మాత్రమే కాదని, దాని ద్వారా భారతదేశ సంకల్పం.. చర్యగా మారడాన్ని ప్రపంచమంతా చూసిందని, 100 మందికి పైగా భయంకరమైన ఉగ్రవాదులు హతమయ్యారని అన్నారు.'భారతదేశం ఎలాంటి అణు బెదిరింపును సహించబోదు. పాకిస్థాన్ పై మా చర్యలను తాత్కాలికంగా నిలిపివేశాము. వారి ప్రవర్తనను బట్టి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ ఇప్పుడు ఉగ్రవాదంపై భారతదేశం కొత్త విధానం, ఒక కొత్త గీత గీయబడింది' అని ఆయన అన్నారు.ఉగ్రవాదులను, వారిని సహాయం అందించే దేశాలను భారతదేశం వేరువేరుగా చూడదని ప్రధాని మోదీ అన్నారు. 'ఇది యుద్ధాల యుగం కాదు, అలాగే ఇది ఉగ్రవాద యుగం కూడా కాదు' అని ఆయన అన్నారు. 'పాకిస్థాన్ తన ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేయాలి. శాంతికి మరో మార్గం లేదు అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. 'పహల్గాం దాడి ఉగ్రవాదపు అత్యంత క్రూరమైన ముఖం, అది నన్ను వ్యక్తిగతంగా బాధించింది. ఉగ్రవాదులను మట్టి కరిపించేందుకు మేము సాయుధ దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాము. మన మహిళల నుదుటి నుండి 'సిందూరం' తొలగించిన పర్యావసానాలను శత్రువు ఇప్పుడు గ్రహించాడు. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక పేరు మాత్రమే కాదు... మే 7న,మన సంకల్పం చర్యగా మారడాన్ని ప్రపంచమంతా చూసింది' అని ఆయన అన్నారు.'మన క్షిపణులు, డ్రోన్లు పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసినప్పుడు, వారి భవనాలు మాత్రమే కాదు, వారి ఆత్మ కూడా ధ్వంసమైంది. 'దేశమే ముందు' అనే సంకల్పం మనకు ఉన్నప్పుడు, గట్టి నిర్ణయాలు తీసుకోబడతాయి' అని ఆయన అన్నారు.భద్రతా దళాలకు సెల్యూట్ చేస్తూ, వారి ధైర్యాన్ని ఈ దేశంలోని తల్లులు, సోదరీమణులు, కుమార్తెలకు అంకితం చేస్తున్నానని అన్నారు. ఉగ్రవాద శిబిరాలపై భారత దాడి తర్వాత పాకిస్థాన్ నిరాశలోకి కూరుకుపోయింది, వారు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి సహాయం చేయడానికి బదులుగా మనపైనే దాడి చేయడానికి ధైర్యం చేశారని, భారత దాడిలో 100 మందికి పైగా భయంకరమైన ఉగ్రవాదులు హతమయ్యారని మోదీ చెప్పారు. 'పాకిస్థాన్ డ్రోన్లు మన సైనిక శక్తి చేత ఏ విధంగా కూల్చివేయబడ్డాయో ప్రపంచమంతా చూసింది. పాకిస్థాన్ గుండెల్లోకి భారతదేశం చొచ్చుకుపోయింది, వారి వైమానిక స్థావరాలను దెబ్బతీసేందుకు మన క్షిపణులు ఖచ్చితత్వంతో దాడి చేశాయి' అని ఆయన అన్నారు. పాకిస్థాన్ మన సరిహద్దుల్లోకి చొచ్చుకురావాలని ప్రణాళికలు రచిస్తే, మనం వారి ఎదపైనే దాడి చేశామన్నారు.

## యుద్ధాన్ని మేమే ఆపాం
(మొదటి పేజీ తరువాయి)

విరమణకు సహాయం చేసింది' అని ట్రంప్ వైట్ హౌస్‌లో విలేకరుల సమావేశం ప్రారంభంలో చెప్పారు. భారత ఉపఖండంలో 'గత కొన్ని రోజులుగా జరిగిన చారిత్రాత్మక సంఘటనలను'' అంటూ ఆయన విలేకరుల సమావేశాన్ని ప్రారంభించారు.నాలుగు రోజుల తీవ్రమైన సరిహద్దు డ్రోన్ మరియు క్షిపణి దాడుల తర్వాత సంఘర్షణను ముగించడానికి భారతదేశం, పాకిస్తాన్ శనివారం ఒక అవగాహనకు వచ్చాయి. భారత్, పాకిస్తాన్ దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒ) భూమి, గాలి , సముద్రంలో అన్ని కాల్పులు సైనిక చర్యలను తక్షణమే నిలిపివేయడానికి ఒక అవగాహనకు వచ్చారని న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో తృతీయ పక్షం ప్రమేయం లేదని వారు చెప్పారు. భారతదేశం,పాకిస్తాన్ తీవ్రంగా పోరాడుతున్నాయని, అవి ఆగేలా కనిపించడం లేదని ట్రంప్ అన్నారు. తాము చాలా సహాయం చేశామని, వ్యాపారంలో కూడా సహాయం చేసామని, ''రండి, మేము మీతో మరింత వ్యాపారం చేయబోతున్నాము. దీన్ని ఆపేద్దాం. మీరు ఆపితే, మేము వ్యాపారం చేస్తాము. మీరు ఆపకపోతే, మేము ఏ వ్యాపారం చేయం'' అని ఇరువురికి చెప్పినట్లు అని ట్రంప్ అన్నారు.'''నేను ఉపయోగించినట్లుగా ప్రజలు వాణిజ్యాన్ని ఎన్నడూ ఉపయోగించలేదు, అంత వరకు నేను చెప్పగలను. అంతే అకస్మాత్తుగా వారు (భారతదేశం, పాకిస్థాన్) 'మేము ఆపేస్తామని అనుకుంటున్నాము' అని చెప్పారు.' అని ట్రంప్ తెలిపారు.'వారు చాలా కారణాల వల్ల ఆ పని చేశారు. కానీ వ్యాపారం ఒక పెద్ద కారణం. మేము పాకిస్తాన్‌తో చాలా వ్యాపారం చేయబోతున్నాము. మేము భారతదేశంతో చాలా వ్యాపారం చేయబోతున్నాము. మేము ప్రస్తుతం భారతదేశంతో చర్చలు జరుపుతున్నాము. మేము త్వరలో పాకిస్తాన్ తో చర్చలు జరుపుతాము. మేము అణ్వాయుధ సంఘర్షణను ఆపాము' అని ట్రంప్ అన్నారు.'నా అభిప్రాయం ప్రకారం... ఇది ఒక ఘోరమైన అణ్వాయుధ యుద్ధం అయి ఉండేది. మిలియన్ల మంది ప్రజలు చనిపోయి ఉండేవారు. కాబట్టి నేను దాని గురించి చాలా గర్వపడుతున్నాను. వైస్ ప్రెసిడెంట్ వాన్స్, విదేశాంగ కార్యదర్శి రూబియో చేసిన పనికి, ప్రయత్నాలకు కూడా నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను, వారు దానిపై చాలా కష్టపడ్డారు' అని ట్రంప్ అన్నారు.'అమెరికా మధ్యవర్తిత్వంలో జరిగిన సుదీర్ఘ రాత్రి చర్చల తర్వాత భారతదేశం, పాకిస్తాన్ 'పూర్తి , తక్షణ కాల్పుల విరమణ'కు అంగీకరించాయని ట్రంప్ శనివారం ప్రకటించారు.

## హైదరాబాద్ జిసిసి హబ్
(మొదటి పేజీ తరువాయి)

ముందు చాటడానికి ప్రతి ఒక్కరి సహకారం కావాలని, హైదరాబాద్ బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలని కోరారు. హైదరాబాద్ అంతర్జాతీయ ప్రాముఖ్యత పెరిగిందని, ప్రస్తుతం మిస్ వరల్డ్ పోటీలకు ఈ నగరం ఆతిథ్యమిస్తోందని, రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ ఈవెంట్లు హైదరాబాద్‌లో నిర్వహిస్తామన్నారు. తెలంగాణ అనేక కీలక రంగాల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం పోలీసింగ్‌లో గానీ, చట్టాలను సక్రమంగా అమలు చేయడంలోగానీ, ద్రవ్యోల్బణ నియంత్రణ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ కల్పన, పన్నుల వసూళ్లలో తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు. స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జి) ద్వారా 66 లక్షల మందికి పైగా మహిళలకు సాధికారత కల్పిస్తూ, దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఫండింగ్, మెంటరింగ్ కార్యక్రమాన్ని తెలంగాణ అమలు చేస్తోందన్నారు. భారతదేశంలోనే అత్యంత శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణాన్ని చేపట్టామని, ఇందులో ప్రత్యేకంగా 'ఎఐ సిటీ' కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించడం వంటి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. 2023 డిసెంబర్ నుండి ఇప్పటివరకు తెలంగాణ రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, దాదాపు 1 లక్షకు పైగా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించామని, దావోస్ వరల్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశం, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ వంటి దేశాల్లో పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశాల ద్వారా పెట్టుబడుల ఆకర్షణలో భారతదేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ నిలిచిందని, దావోస్ సమావేశంలోనే రూ1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు లభించాయని సిఎం వివరించారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎఐ మెషిన్ లెర్నింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ప్రపంచంలోనే తెలంగాణను లీడర్‌గా తీర్చి దిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణను ఎఐ లీడర్‌గా మార్చేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించామని, 'ఎఐ సిటీ'కి శ్రీకారం చుట్టామని, ఈ సిటీలో భాగస్వామయ్యేందుకు మైక్రోసాఫ్ట్ లాంటి టెక్ దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపించాయి. ఎఐలో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసేందుకు త్వరలోనే ఎఐ యూనివర్సిటీని ప్రారంభించనున్నామన్నారు.

**గవర్నర్‌తో సిఎం భేటీ**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయ్యారు. భారత్‌-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు, దేశంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో వారిరువురూ సోమవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులపై వారిద్దరు మాట్లాడుకున్నారు. రాష్ట్రంలో పరిస్థితులను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ముఖ్యమంత్రి వివరించారు. ఈ భేటీలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ అమలు చేస్తున్న సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం తదితర కార్యక్రమాల తాజా వివరాలను గవర్నర్‌కు సిఎం వివరించినట్లు సమాచారం. మరోవైపు ఇటీవల జరిగిన ఎంఎల్‌సిల నియామకం, తాజాగా రాష్ట్ర చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్, ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ల నియామకం తదితర అంశాలపై కూడా వారిరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.

## 90 రోజుల విరామం
(మొదటి పేజీ తరువాయి)

నుంచి 10 శాతానికి తగ్గించుకున్నాయి. ఇరు దేశాలు పెంచిన సుంకాలలో 115 శాతం తగ్గించుకున్నాయి. ఇరు దేశాల మధ్య జెనీవాలో శనివారం జరిగిన చర్చల వివరాలను సోమవారం ఏర్పాటు మీడియా సమావేశంలో అమెరికా వాణిజ్య ప్రతినిధి జామైసన్ గ్రీర్, ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్‌లు సుంకాల తగ్గింపు గురించి ప్రకటించారు. చైనా సరుకులపై విధించిన సుంకంపై 115 శాతం తగ్గించడంతో, ప్రస్తుతం ఉన్న 145 శాతం తో 30 శాతానికి తగ్గించినట్లు గ్రీర్ వెల్లడించారు. అదే సమయంలో, అమెరికా సరుకులపై చైనా విధించిన టారిఫ్‌ను 10 శాతానికి తగ్గించేందుకు అంగీకరించిందన్నారు. వాణిజ్య అంశాలపై చర్చలు కొనసాగేందుకు ఇరు పక్షాలు సంప్రదింపుల వ్యవస్థకు ఏర్పాట్లు చేశాయని తెలిపారు. ఇరు దేశాల ప్రతినిధులు గత వారాంతంలో సమావేశం అయ్యామని, ఇరుపక్షాలు కూడా ప్రతిష్టంభన వీడాలనే విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని బెస్సెంట్ అన్నారు. అత్యంత అధిక సుంకాల ఫలితంగా ఆంక్షల తరహాలో దిగుమతుల నిషేదం వంటి పరిస్థితి నెలకొన్నదని, ఇరు పక్షాలు కూడా అలా కావాలని కోరుకోవడం లేదని చెప్పారు. తమకు కూడా వాణిజ్యం జరగాలని ఉన్నదని, తమకు మరింత సంతులిత వాణిజ్యం కావాలని, ఉభయ పక్షాలు కూడా దానిని సాధించేందుకు కట్టుబడి ఉన్నట్లు భావిస్తున్నానని చెప్పారు. ఈ ఒప్పందం ఇరుదేశాల విభేదాల పరిష్కారానికి ముఖ్యమైన చర్య అని, ఇది ముమ్మందు సహకారానికి పునాదులు వేస్తుందని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ అభివర్ణించింది. ఈ చొరవ ఇరు దేశాల ఉత్పత్తిదారులు, వినియోగదారుల ఆకాంక్షలను ఒకే దగ్గరకు చేర్చుతాయని, ఇరు దేశాల ప్రయోజనాలను, ప్రపంచ ఉమ్మడి ప్రయోజనాలను చేకూరుస్తుందని పేర్కొంది. అమెరికా ''ఏకపక్ష వాణిజ్య పెంపుదల వంటి అసంబద్ధ విధానాన్ని'' నిలిపివేస్తుందని చైనా ఆశిస్తుందని, చైనాతో కలిసి పని చేయడం ద్వారా ఆర్థిక, వాణిజ్య సంబంధాల అభివృద్ధికి రక్షణ కల్పిస్తూ, ప్రపంచ ఆర్థికవ్యవస్థలో మరింత నిశ్చితి, సిరత్వాన్ని అందిస్తారని భావిస్తున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. వాషింగ్టన్, బీజింగ్ విధించిన క్లిష్టమైన సుంకాలు, ఇతర వాణిజ్య దండనల పూర్తి ప్రభావం ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. తొంభై రోజుల విరామంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న అంతరాలను తొలగించుకునేందుకు మార్గాలను ఎంత వరకు కనుగొంటారనే అంశంపై ఇది ఆధారపడింది. అయితే, రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలకు చెందిన వాణిజ్య రాయబారులు వెనక్కి తగ్గడంతో ప్రపంచ మార్కెట్‌లు కోలుకోవడంతో, ఇన్వెస్టర్‌లకు ఊపునిచ్చింది. ఎస్ అండ్ పి ఫ్యూచర్స్ 500 2.6 శాతానికి పెరగగా, డో జోన్స్ పారిశ్రామిక సగటు 2 శాతానికి పెరిగింది. చమురు ధరలు బ్యారెల్‌పై 1.60 అమెరికన్ డాలర్‌లకు పైగా పెరగగా, యూరో, జపానీస్ యెన్‌తో పోల్చినప్పుడు అమెరికా డాలర్ విలువ పెరిగింది. చైనాలోని యూరోపియన్ యూనియన్ ఆఫ్ ఛాంబర్ అధ్యక్షుడు జెన్ ఎస్కెలండ్ ఈ పరిణామాన్ని స్వాగతిస్తూనే, 90 రోజుల్లో ఏమి జరుగుతోందోననే పెద్ద అనిశ్చితి కొనసాగుతుందని హెచ్చరించారు. గత నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా సరుకులపై 145 శాతం సుంకాలు పెంచగా, ప్రతిగా ఆ దేశ సరుకులపై సుంకాలను చైనా 125 శాతానికి పెంచింది. సుంకాలు అత్యధిక స్థాయిలో ఉండడంతో పరస్పరం ఉత్పత్తులను బహిష్కరించుకునే పరిస్థితికి చేరుకొని, వాణిజ్యం దెబ్బతిన్నది.గత ఏడాది ఇరు దేశాల మధ్య 660 బిలియన్‌ల అమెరికన్ డాలర్ల విలువైన వాణిజ్యం జరిగింది. కాగా, చైనా తరుపున జెనీవా చర్చల్లో స్టేట్ కౌన్సిల్ వైస్ ప్రీమియర్ హీ లైఫెంగ్ పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రపంచ సుందరి పోటీదారులు నీరా కేఫ్‌ను సందర్శించడం హర్షణీయం

తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ సుందరి పోటీల సందర్భంగా ఈ పోటీల్లో పాల్గొంటున్న ప్రపంచ దేశాల సుందరీమణులు నెక్లెస్ రోడ్‌లోని నీరా కేఫ్‌ను సందర్శించి నీరా, తాటి ముంజలు సేవించే అవకాశం కల్పించడం పట్ల తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో ప్రాచీన వృత్తులలో ఒకటైన కల్లు గీత వృత్తిదారులు ప్రకృతి నుండి స్వీకరించే నీరా, కల్లు ముంజలు, గేగులు, తాటి పండ్లు తదితర ఆహార ఉత్పత్తులు, ఖనిజాలు, అత్యంత పోషక విలువలతో కూడిన ఇవన్నీ ఎంతో ఆరోగ్యకరమైనవన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ దేశాలకు మరోసారి వెలుగులోకి తీసుకొచ్చినందుకు ప్రభుత్వానికి బొమ్మగాని ప్రభాకర్ అభినందనలు తెలిపారు.

## ప్రజలకు మరింత చేరువగా..
# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెండవ దశలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' విధానం సోమవారం ప్రారంభమైంది. స్లాట్ బుకింగ్ విధానం పని తీరును రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. ఆయా జిల్లాల్లో స్లాట్ బుకింగ్ పనితీరును, రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చిన వారి స్పందనను అడిగి తెలుసుకున్నారు. అలాగే మొదటి దశలో ప్రారంభమైన 22 రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలులో ఉన్న స్లాట్‌బుకింగ్ పనితీరును కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలన్న లక్ష్యంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రజలకు మరింత చేరువచేస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 47 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్‌బుకింగ్ విధానం అమలులోకి వచ్చిందని, వచ్చే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చి గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించి క్యూ లైన్లలో నిల్చునే పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు, సమయాన్ని ఆదా చేసేందుకు, పారదర్శకతను తీసుకురావడానికి ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టామని మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలో క్యూలైన్లకు గుడ్‌బై చెప్పే రోజులు వస్తాయని, దళారుల ప్రమేయం కూడా ఉండబోదన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా కేవలం 15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్‌సైట్ registration.telangana.gov.in స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏరోజు వీలుంటే ఆరోజు, ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు స్లాట్ బుకింగ్ ఉపయోగపడుతుందన్నారు. సేవలల్లో జాప్యం, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం అవసరమైన ప్రాంతాల్లో రిజిస్ట్రార్ల సంఖ్య కూడా పెంచుతున్నామని మంత్రి వివరించారు.





**10 నిముషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి**
**సంతోష్ కుమార్ ( ఉప్పల్ ఎస్ఆర్ఓ ఆఫీస్)**

ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో శుక్రవారం ఇంటి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకున్నాను. ఐఐసిటి కాలనీ, బోడుప్పల్‌లో ఉంటున్నా.. రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లినంత సమయంలో కేవలం 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తయింది. అరగంట వ్యవధిలోనే డాక్యుమెంటు తీసుకొని బయటికి వచ్చాం. ఈ విధానం చాలా బాగుంది. దీనివల్ల ఎక్కడా ఇబ్బంది పడలేదు, సమయం కూడా చాలా ఆదా అయింది.

**అరగంటలో రిజిస్ట్రేషన్ పూర్తి.. చేతికి డాక్యుమెంట్లు**
**ఎ.శ్రీలత (కాప్రా- ఎస్.ఆర్.ఒఆఫీస్)**

రెండు, మూడు రోజుల సమయం పట్టే రిజిస్ట్రేషన్ ప్రక్రియ 15 నిమిషాల్లోనే పూర్తయింది. సోమవారం కాప్రా ఎస్.ఆర్.ఒ ఆఫీస్‌లో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. గతంలో రిజిస్ట్రేషన్‌కు ఒక రోజంతా ఉండేవాళ్లం. తరువాత 2 నుంచి 3 రోజుల తర్వాత మాకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇచ్చేవారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ 15 నిముషాల్లో పూర్తయింది. మరో 15 నిమిషాల్లో డాక్యుమెంట్లు సిద్ధమయ్యాయి. రద్దీ లేకుండా ప్రశాంత వాతావరణంలో పని పూర్తయింది. దీనినే కొనసాగించడం ఎంతో ఉత్తమం

**ఒకే రోజు స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తి :**
**ఎన్.సరళ (హనుమకొండ-ఎస్.ఆర్.ఒ ఆఫీస్)**

హనుమకొండ ఎస్.ఆర్.ఒ ఆఫీస్‌లో సోమవారం ఒకే రోజు స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తవ్వడం చాలా సౌకర్యంగా ఉన్నది. గతంలో రిజిస్ట్రేషన్ ఒక తంతు అయితే మ్యుటేషన్ మరో తంతుగా మూడు రోజులకు మించి జరిగేది. ఈ కొత్త స్లాట్ విధానంతో మా ప్లాట్ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిపోయింది. డాక్యుమెంట్ రైటర్ సాయంతో మేం స్లాట్ బుక్ చేసుకున్నాం. మాకు ఎక్కడా అదనపు ఖర్చులు లేవు. ఇదొక సూపర్ సిస్టమ్.

**రిజిస్ట్రేషన్ తొందరగా పూర్తయింది :**
**ఎ.భారతమ్మ (కల్వకుర్తి ఎస్.ఆర్.ఒ ఆఫీస్)**

కల్వకుర్తి ఎస్.ఆర్.ఒ ఆఫీస్‌లో సోమవారం మా ఇంటి స్థలం కొనుగోలుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పూర్తయింది. నిన్ననే స్లాట్‌ను బుక్ చేయించాం. గతంలో తరహా డాక్యుమెంట్ రైటర్ల హవా కనిపించలేదు. అధికారులు చాలా బాగా సహకరించారు. పని చాలా తొందరగా పూర్తయింది. మొదటి నుంచి స్లాట్ బుకింగ్‌కు అవసరమైన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడంతో హడావుడి లేకుండా రిజిస్ట్రేషన్ జరిగింది. ఇటువంటి విధానాలు ప్రజలకు ఉంటే ఉపయోగం. మాతో పాటు రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## 50ఏళ్ల ఉద్యమ ప్రస్థానం, చరిత్ర కలిగిన ..
# 'అరుణోదయ' మరింత బలోపేతం కావాలి

సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మట్టి మనుషులను జ్ఞానం వైపు నడిపిన గొప్ప సాంస్కృతికోద్యమ సంస్థ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అని పలువురు వక్తలు కొనియాడారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల స్ఫూర్తి సభ సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జెండాను సంస్థ రాష్ట్ర నాయకులు అరుణోదయ రామన్న ఆవిష్కరించారు. అనంతరం విమలక్క అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథులుగా సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, రచయిత బుర్ర రాములు, మానవ హక్కుల నేత జీవన్‌కుమార్, రచయితలు, కవులు, సంస్థ ప్రతినిధులు డాక్టర్.ఎ.కె. ప్రభాకర్, కొల్లాపురం విమల, రాంసత్తయ్య, ఎనిశెట్టి శంకర్, అంబిక హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 50 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం, చరిత్ర కలిగిన అరుణోదయ సాంస్కృతిక సంస్థ మరింత బలోపేతం కావాలన్నారు. ఇందుకు జార్జిరెడ్డి, రాజన్న, జంపాల, ప్రసాద్, చంద్రశేఖర్ చౌరవతో ఏర్పడిన పిడిఎస్‌యు, పిఒడబ్ల్యు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలు ఏకం కావాలన్నారు. విమల మాట్లాడుతూ సాంస్కృతికోద్యమం భవిష్యత్ తరాలకు ఆయుధంలాంటిదని, ఇందుకు అరుణోదయ సాంస్కృతిక సంస్థ నాయకత్వం వహించాలన్నారు. ప్రపంచ దేశాల్లో మహిళలు నిర్వహిస్తున్న ఉద్యమ సంస్థలు ఒకటి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కాగా, మరోటి లాటిన్ అమెరికాలోని జపతిష్ట్ ఉద్యమ సంస్థ అన్నారు. ఎలిశెట్టి శంకర్ మాట్లాడుతూ 100 ఏళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో అన్ని రకాల పీడనలకు వ్యతిరేకంగా పోరాడుతున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 ఏళ్ల ప్రజా ఉద్యమ చరిత్ర మాత్రం పూర్తి స్థాయిలో రికార్డు కాలేకపోయిందన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు తమ సౌహార్ధ సందేశాలను ఇచ్చారు. ప్రారంభ సభ అనంతరం అరుణోదయ సావనీర్‌ను ఎలిశెట్టి శంకర్ ఆవిష్కరించగా, మూడు విప్లవ సంస్థల 50 ఏళ్ల పాటను అంబిక ఆవిష్కరించారు. అనంతరం ప్రజాసంస్కృతి సాంస్కృతికోద్యమ నిర్మాణ ఆవశ్యకత అనే అంశంపై మోత్కూర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రొఫెసర్ కాసిం, ప్రొఫెసర్ లక్ష్మి, రచయితలు బి.ఎస్.రాములు, జిలుకర శ్రీనివాస్, జూపాక సుభద్ర సహా పలువురు వక్తలు ప్రసంగించారు. అనంతరం సాయంత్ర 7 గంటల నుంచి 9.30 గంటల వరకు అరుణోదయ కళాకారులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలు సభికులను ఆకట్టుకున్నాయి. సభ ప్రారంభానికి ముందు సుందరయ్య విజ్ఞాన కేంద్రం చుట్టూ అరుణోదయ కళాకారులు కళా ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుదు మల్సూర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాకేశ్, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిత తదితరులు పాల్గొన్నారు.

## సవివరమైన నివేదికకు తెలంగాణ బిసి కమిషన్ ఆమోదం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తిట్టు పదాలుగా ఉన్న పేర్లను మార్చాలని కోరిన దొమ్మర, పిచ్చకుంట్ల, తమ్మలి, బుడబుక్కల, వీరముష్టి, పర్యాయపదాలు చేర్చాలని కోరిన కుమ్మర, రజక, మేర కులాల విషయంలో నిర్దిష్ట సిఫారసులతో కూడిన ఒక సవివరమైన నివేదికను తెలంగాణ బిసి కమిషన్ ఆమోదించింది. ఈ నివేదికను కమిషన్ ప్రభుత్వానికి అందజేయనుంది. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ కార్యాలయంలో సోమవారం కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, సభ్య కార్యదర్శి బాల మాయాదేవి, ఉపసంచాలకులు యు.శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి జి. సతీష్ కుమార్, పరిశోధన అధికారి జి.లక్ష్మీ నారాయణలు పాల్గొన్నారు. సుమారు 3 గంటలపాటు వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, కమిషన్ పలు నిర్ణయాలను తీసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రానికి వెనుకబడిన తరగతుల జాబితాను రూపొందించే క్రమంలో తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చే విషయమై బహిరంగ విచారణ జరిపి, ఈ విషయంలో వినతులు, అభ్యంతరాలను స్వీకరించాలని కమిషన్ నిర్ణయించింది. ఇందుకోసం ఈనెల 15వ తేదిన ఒక నోటిఫికేషన్‌ను జారీ చేయాలని సభ్యులు నిర్ణయించారు. వచ్చే నెల 9, 10, 11 తేదీలలో ఈ బహిరంగ విచారణ నిర్వహణతో పాటు ఈనెల 31వ తేదీ నుండి వచ్చే నెల 13వ తేది వరకు పోస్టు ద్వారా, స్వయంగా కమిషన్ కార్యాలయంలో వినతులు, అభ్యంతరాలను సమర్పించవచ్చు.

## కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను
# ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి





గుర్తింపు కార్డులు జారీ చేయాలి

కౌలు రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన 2011 భూ అధీకృత సాగుదారుల చట్టం ప్రకారం కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని వివిధ రైతు సంఘాల నాయకులు, పలువురు రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని వ్యవసాయం, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో సోమవారం కౌలు రైతుల సమస్యలపై రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు, కౌలు రైతుల నుంచి కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, భవాని రెడ్డిలు అభిప్రాయాలను సేకరించారు.

ఈ సందర్భంగా కౌలు రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రైతు సంఘాల నాయకులు , కౌలు రైతులు కమిషన్‌కు విన్నవించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తమకు సంబంధమే లేదంటూ కౌలు రైతులను పూర్తిగా నడిరోడ్డుపైకి నెట్టివేసిందని, కాంగ్రెస్ వస్తే తమ బతుకులు బాగుపడుతాయని ఎంతో ఆశపడిన కౌలు రైతులకు నిరాశ మిగులుతోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కౌలు రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని, తక్షణం 2025 ఖరీఫ్ సీజన్ నుంచి కౌలు రైతుల గుర్తింపు కోసం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కౌలు రైతులు కురువ మంజుల( వికారాబాద్), రమాకాంత్ (ఆదిలాబాదు), మాదాసు మాధవి( కరీంనగర్), చాపల సుజాత, (మహబూబాబాద్), ఎడ్ల మానస (జయశంకర్), ముదస్తు సుమలత(జయశంకర్), శ్రీనివాస్( ఆదిలాబాదు), రాందాస్ (యాదాద్రి భువనగిరి), రమేష్ (ఆదిలాబాదు), రైతు స్వరాజ్య వేదిక నాయకులు బి. కొండల్, కన్నెగంటి రవి, విస్సా కిరణ్ కుమార్, ఎస్. ఆశాలత పాల్గొన్నారు.

**కౌలు రైతుల మీడియా సమావేశం :** కౌలు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పలువురు కౌలు రైతులు ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్దిని చూపాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం కౌలు రైతులతో కలిసి రైతు స్వరాజ్య వేదిక నాయకులు బి. కొండల్, కన్నెగంటి రవి, విస్సా కిరణ్ కుమార్, ఎస్. ఆశాలత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ తమ వరంగల్ డిక్లరేషన్‌లోనూ, ఆరు గ్యారంటీలలోనూ కౌలు రైతులకి పథకాలు అందిస్తామని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన 16 నెలలు అవుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం పూర్తి అన్యాయం వారు అవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు ఆత్మహత్యలలో 75 శాతం కౌలు రైతులవే అని, కౌలు రైతులను గుర్తించి వారికి పూర్తి మద్దతు అందిస్తేనే రైతు ఆత్మహత్యలు లేని తెలంగాణను సాధించగలమని నాయకులు పేర్కొన్నారు.. వరి పంట కొనుగోలులో ఇస్తున్న రూ.500 బోనస్‌ను కౌలు రైతులకి కూడా అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, చాలా తక్కువ శాతం కౌలు రైతులకి మాత్రమే అది అందిందని, అందరికీ అందించాలని వారు డిమాండ్ చేశారు.

**రాష్ట్రంలో 2011 మనీ లెండింగ్ యాక్ట్‌ను తక్షణమే అమలు చేయాలి : రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**

రాష్ట్రంలో 2011 మనీ లెండింగ్ యాక్ట్, రూల్స్‌ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు విజ్ఞప్తి చేసింది. సోమవారం రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, భవానిరెడ్డిలు సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిశారు. ఈసందర్భంగా వారు గత 10ఏళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన రైతు ఆత్మహత్యలకు గల కారణాలపై కమిషన్ రూపొందించిన నివేదికను అందజేశారు. ఈ సందర్భగా గడిచిన 10ఏళ్లలో రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణం ప్రైవేట్ అప్పులేనని చైర్మన్ కోదండరెడ్డి వివరించారు. ప్రైవేట్ అప్పులు, వడ్డీరేట్లు ఎక్కువగా ఉండడం వల్ల ప్రధానంగా కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోవిందు, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా వాట్సప్ గ్రూపులో పోస్టు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్ :** ఆర్థిక ఇబ్బందులతో ఓ యువ రైతు ఇంట్లోనే ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడపలో గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. రెండు రోజుల ముందుగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా వాట్సప్ గ్రూపులో విడియో పోస్టు షేర్ చేసి ఆత్మ హత్య చేసుకోవడంతో గ్రామంలో చర్చనీయాంశమైంది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తుప్ప సంజీవులు(38) అనే రైతు తనకున్న రెండు ఎకరాలలో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గత రెండు సంవత్సరాలుగా వ్యవసాయ సాగు కోసం చేసిన అప్పులు, తన కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురికావడంతో మరిన్ని అప్పులు అధికం కావడంతో ఇటీవల కొంత వ్యవసాయ భూమి అమ్మినట్లు తెలిపారు. అయినప్పటికీ అప్పులు పూర్తిగా తీరకపోవడంతో మానసిక వేదనకు గురైన యువకుడు శనివారం సాయంత్రం తాను క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు చేసుకుంటున్నట్లుగా తాను విడియో తీసుకోని గ్రామ వాట్సప్ గ్రూపులో షేర్ చేశాడు. అయితే అప్పుడప్పుడు మద్యం సేవించి అలాగే ప్రవర్తిస్తాడాన్న నేపంతో గ్రామస్థులు ఎవరూ పట్టించుకోలేదు. కాగా గత వారం రోజుల క్రితం భార్యతో గొడవ పడటంతో తన పిల్లలతో ఆమె పుట్టింటికి వెళ్లిపోగా ఒక్కడే గ్రామంలో ఉటుంటున్నారు. సోమవారం ఉదయం తాళం వేసి ఉన్న తన ఇంట్లో నుండి దుర్వాసన వస్తుండటంతో ఇరుగుపొరుగు వారు తలుపులు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో రెండు రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడినట్లుగా గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ చంద్రమోహన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకోని, శవ పంచనామా నిర్వహించిన అనంతరం మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని, పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కేసు విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతునికి వృద్ధ తల్లితో పాటు ముగ్గురు కూమార్తెలు ఉన్నారు.

## దేశ సరిహద్దు ప్రాంతాల నుండి తిరిగి వస్తున్న తెలంగాణ పౌరులకు
# రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత్—పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తల మధ్య దేశ సరిహద్దు ప్రాంతాల నుండి తిరిగి వస్తున్న తెలంగాణ పౌరులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ నోడల్ ఆఫీస్‌గా పనిచేస్తోంది. సోమవారం మధ్యాహ్నం వరకు 162 మంది పౌరులు తెలంగాణ భవన్‌కు చేరుకోగా, వీరిలో జమ్మూకశ్మీర్‌లోని వివిధ విద్యాసంస్థల నుండి 56 మంది, పంజాబ్ రాష్ట్రం నుండి 106 మంది విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటివరకు 133 మంది తమ స్వగ్రామాలకు బయలుదేరగా, మిగిలినవారికి తెలంగాణ భవన్‌లో తాత్కాలిక వసతి, భోజనం, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ సోమవారం తెలంగాణ భవన్ అధికారులతో సమీక్ష జరిపి, అక్కడ ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ''పరిస్థితి నెమ్మదిగా సాధారణమవుతుండటంతో మా విద్యాసంస్థలు తిరిగి క్లాసులకు హాజరు కావాలని సూచిస్తున్నాయి. అయితే మేము ముందుగా ఇంటికెళ్లి, పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరుకున్న తర్వాతే మళ్లీ క్యాంపస్‌కు వెళ్లాలనుకుంటున్నాం'' అని తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు డాక్టర్ గౌరవ్ ఉప్పల్ సంబంధిత యూనివర్సిటీల అధికారులతో మాట్లాడి, విద్యార్థులకు తాత్కాలికంగా ఆన్‌లైన్ తరగతులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీలు అందుకు సానుకూలంగా స్పందించాయి. కాగా కొంతమంది చివరి సంవత్సరం విద్యార్థులు పరిస్థితి మెరుగుపడే వరకు ఢిల్లీలోనే వేచి చూసి తిరిగి క్యాంపస్‌కు వెళ్ళాలనుకుంటున్నట్టు తెలపగా వారు తిరిగి వెళ్లేవరకు తెలంగాణ భవన్‌లో ఉండేందుకు అన్ని వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వెల్లడించారు. ఇక, గడిచిన 24 గంటలుగా సహాయం కోసం చేసే అత్యవసర ఫోన్ కాల్స్ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, చాలా తక్కువ మంది విద్యార్థులు మాత్రమే తెలంగాణ భవన్‌కు వచ్చే అవకాశం ఉందని తమ అంచనా అని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎవరు సహాయం కోసం వస్తే వారికి అన్ని విధాలా అండగా ఉంటామని డాక్టర్ గౌరవ్ ఉప్పల్ స్పష్టం చేశారు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ఆగం చేశారు

నిజాన్నే సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల ముందుంచారు

మున్నేరు బాధితులందరికీ రివర్‌ఫ్రంట్ కాలనీలో చోటు

మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** బిజెపి, బిఆర్‌ఎస్ ఒకే తాను ముక్కలని..ఒకరు స్క్రిప్ట్ రాసిస్తే మరొకరు డెలివరీ చేస్తారని ఢిల్లీ స్థాయిలోనే మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని తెలంగాణ రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం వేకువ జామున మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో జరుగుతున్న రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జి పనులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ధనిక రాష్ట్రం అంటూ గత పాలకులు షో చేశారని కాంగ్రెస్ పార్టీ అధికారంతోకి రాగానే లోగుట్టు మొత్తం బైటపడిందన్నారు. తినడానికి తిండి లేకున్నా మీసాలకు సంపెంగ నూనె రాసి ప్రజలను మభ్య పెట్టారని యద్దేవ చేశారు. సాక్షాత్తు సిఎం రేవంత్‌రెడ్డి చెప్పందే నిజం అయ్యిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల చిట్టా చూసి బాదేసిందన్నారు. దాదాపు రూ.8లక్షల19కోట్ల అప్పు ఉందని వెల్లడించారు. ఆ విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారన్నారు. ఇంటి పెద్దగా కుటుంబాన్ని సక్రమంగా నడిపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. క్యాన్సర్ సోకితే ఒప్పుకోవాలని బైటకు తెలియకపోతే రోగం ముదురుతుందన్నారు. ఇదే నిజాన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా ఒప్పుకోవాలని సూచించారు. చివరకు గాలిని, నీటిని, ప్రజలు తినే ఆహారాన్ని మేమే కొనుగొన్నామని అంటే ఎలా అని ప్రశ్నించారు. విమర్శలు చేయడం తప్పు కాదని, సోయిలేకుండా చేయవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి క్రెడిట్ రావద్దని విపక్షాలు కుట్రలకు పాల్పడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెరవెనుక ఉండి కొందరు రైతులను ఉసిగొల్పుతున్నారని ప్రతిపక్ష నాయకులపై విమర్శలు గుప్పించారు.


**పురపాలక కార్యాలయము : బెల్లంపల్లి : జిల్లా :: మంచిర్యాల**

ఈ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీస్

ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ నెం.ఇ1/01/టెండర్/2025-26/BPL/MPTLY తేది : 09-05-2025

ఈ కార్యాలయములో అంచనా విలువ రూ.51.00 లక్షల విలువ గల (12) పనులకు పట్టణ ప్రగతి మరియు 15వ ఆర్థిక సంఘ నిధులకు గాను సివిల్ రిజిస్ట్రేషన్ కాంట్రాక్టర్/ఫర్మ్ వారి నుండి ఈ కార్యాలయం ఈ – ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వాటి వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి. **టెండర్ తేదీల వివరములు : 01. డౌన్‌లోడ్ మొదలు తేదీ మరియు సమయం : 12.05.2025 నుండి మధ్యాహ్నం 4 గం.ల వరకు 02. డౌన్ లోడ్ చివరి తేదీ మరియు సమయం 19.05.2025 మధ్యాహ్నం 4 గం.ల వరకు.** ఇట్టి విషయములో తదుపరి సమాచార నిమిత్తము ఆఫీసు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయము నందు సంప్రదించగలరు. పూర్తి వివరములకు website www.tender.telangana.gov.in నందు చూడవచ్చును.

DIPR R.O. No: 1693-PP/CL/ADVT/1/2025-26 Date:12.05.2025 Sd/- కమిషనర్, బెల్లంపల్లి మున్సిపాలిటి

**మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, నల్లగొండ**
(ఎన్ఏఏసి ద్వారా 'బి+' గ్రేడ్‌తో గుర్తింపు పొందింది)

నాలుగవ స్నాతకోత్సవం ప్రకటన

NOT.NO.01/MGU/NLG/2025-26 తేదీ 12-05-2025

నల్లగొండలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవం 2025 జులైలో తాత్కాలికంగా జరుగనుంది. 2021-22, 2022-23 మరియు 2023-24 విద్యా సంవత్సరాల కాలంలో డాక్టోరల్ డిగ్రీ / పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ / అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులైన లేదా ప్రదానం చేయబడిన అభ్యర్థులు ఎవరైతే ఉన్నారో వారు తేదీ 16.06.2025 లోపు కాన్వకేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి సంబంధించి ఇంకా ఏమైనా అదనపు వివరాలు తెలుసుకోదల్చిన వారు www.mguniversity.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

DIPR R.O. No: 1725-PP/CL/ADVT/1/2025-26 Date:12.05.2025 Sd/- రిజిస్ట్రార్

ప్రజాపక్షం
మంగళవారం, మే 13

# సరిహద్దుల్లో ప్రశాంతత

మూడురోజులపాటు అర్ధరాత్రి మిలటరీ దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లిన భారత్ – పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతాలు, విభజిత కశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్‌ఒసి) వెంబడి జనావాసాలు ఆదివారం రాత్రి ప్రశాంతతకు నోచుకున్నాయి, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం సాయంత్రం 5గంటలనుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. పాక్ వైపునుంచి కొన్ని ఉల్లంఘనలు కొనసాగాయి. అయితే సైనిక బలగాల అప్రమత్తత కొనసాగుతోంది. సాంప్రదాయ యుద్ధం కన్నా సాంకేతిక విజ్ఞానం అత్యంత ప్రాధాన్యం వహించిన ప్రస్తుత సంఘర్షణలో భారత్ మిలటరీదే పైచేయి. జమ్మూ–కశ్మీర్‌లోని పహల్గాంలోని బైసారన్ పచ్చిక బయళ్లలో పాక్ ప్రేరేపిత టెర్రరిస్టు ముష్కరులు ఏప్రిల్ 22 మిట్టమధ్యాహ్నం విచక్షణారహితంగా కాల్పులు జరిపి 26 మంది భారత టూరిస్టులు, ఒక నేపాలీని నిష్కారణంగా హతమార్చిన ఘోరకలికి ప్రతీకారంగా భారత వైమానిక దళం మే 7న పాకిస్థాన్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 టెర్రరిస్టు స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేసిన తదుపరి ప్రజ్వరిల్లిన పరస్పర సైనిక చర్యలకు కొద్దిరోజుల్లోనే ముగింపు పలకడం హర్షించదగింది. అయితే ఇది తాత్కాలికమా, శాశ్వతమా అన్నది సోమవారం సాయంత్రం మొదలైన ఇరు దేశాల ఉన్నత సైనికాధికారుల స్థాయి (డిజిఎంఒ) హాట్‌లైన్ చర్చల ఫలితాలు నిర్ణయిస్తాయి. పాకిస్థాన్ లోపలి ప్రాంతాల్లో – కరాచీ, లాహోర్, రావల్పిండి వగైరా ప్రదేశాల్లో ఎయిర్‌బేస్‌లను, రన్‌వేలను ధ్వంసం చేసిన భారత్ రక్షణపాటవం ప్రపంచానికి వెల్లడైంది. పాక్ ప్రయోగించిన వందలాది డ్రోన్‌లను, క్షిపణులను భారత్ గగనతల రక్షణ వ్యవస్థ గాలిలోనే ధ్వంసం చేసింది. అయితే ఇది పాకిస్థాన్‌తో భారత్ పూర్తిస్థాయి యుద్ధం కాదు. టెర్రరిస్టుల మౌలిక వసతులను ధ్వంసం చేయటమే ధ్యేయంగా సాగింది. పాకిస్థాన్ సైన్యం ఎదురుదాడులకు దిగటం వల్ల ఈ సంఘర్షణ ఒకింత తీవ్రరూపం దాల్చింది. భారత్ యుద్ధ విమానాలను కూల్చినట్లు, సైనిక వసతులకు తీవ్రనష్టం కలుగజేసినట్లు పాకిస్థాన్ సైన్యం చేసిన నిరాధార క్లెయింలు తమ మిలటరీ వసతులకు జరిగిన నష్టం నుంచి తమ ప్రజల కన్నుగప్పటానికే అని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. అయితే వారి సైన్యం కశ్మీర్‌లో ఎల్‌ఒసి వెంట జనావాసాలపై రోజూ ఫిరంగి దాడులు చేసి ఆస్తులకు నష్టం కలుగజేయటంతోపాటు స్త్రీలు, పిల్లలు సహా 16 మంది పౌరుల ప్రాణాలు తీశారు.

ఎటువంటి ముఖాముఖీ చర్చలు లేకుండా ఆకస్మికంగా కాల్పుల విరమణ ప్రకటనలు రావటం ఆశ్చర్యకరం. భారత్ సానుకూలంగా స్పందించే పక్షంలో కాల్పుల విరమణకు తాము సిద్ధమని పాకిస్థాన్ ప్రభుత్వం శనివారం మధ్యాహ్నం ప్రకటించింది. ఇంతలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'ఇరు దేశాల మధ్య తమ మధ్యవర్తిత్వంతో (ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగమంత్రి రూబియో) కాల్పుల విరమణ సాధించామని, ఇరుదేశాల నాయకులు వివేకం, విజ్ఞత ప్రదర్శించినందుకు వారికి ధన్యవాదాలు' అంటూ ఆశ్చర్యకరమైన ప్రకటన చేశారు. ఆ తర్వాత భారత ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించింది. అయితే శనివారం రాత్రి పాకిస్థాన్ అనేక ఉల్లంఘనలకు పాల్పడింది. మన దళాలు తిప్పికొట్టాయి. భారత్ హెచ్చరిక తదుపరి ఆదివారం ఉదయం నుంచి రణగొణ ధ్వనులు సద్దుమణిగాయి.

అయితే ఎవరి మధ్యవర్తిత్వంలేదని, పాకిస్థాన్ ప్రతిపాదనను అంగీకరించామని భారత ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ట్రంప్ ప్రకటన విశ్వసనీయత కొట్టివేయదగింది కాదు. తమ 'ప్రియమిత్రుడు' ట్రంప్ ఒత్తిడికి ప్రధాని నరేంద్రమోదీ లొంగిపోయారనే మాటలు వినిపిస్తున్నాయి. అమెరికా మధ్యవర్తిత్వం వహిస్తే అంగీకారం కుదిరిన షరతులేమిటని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ ముగియలేదని, పాకిస్థాన్ తూటా పేల్చితే క్షిపణులతో జవాబు చెప్పాలని మోదీ సైనికాధికారులకు చెప్పినట్లు, వచ్చిన వార్త ఆయన పెంచుకున్న ప్రతిష్టకు తగిలిన దెబ్బను కప్పిపుచ్చుకోవటానికే కావచ్చు. అయితే మోదీ భావజాల అనుచరగణంలో చాలామంది కాల్పుల విరమణపట్ల అసంతృప్తితో ఉన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుని పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలన్నది వారి ఆకాంక్ష. పాకిస్థాన్ మరిన్ని ముక్కలు కావాలన్నది వారి కల. అది వారి తప్పుకాదు. అది ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు ప్రచారం చేసే 'అఖండ భారత్' నినాదం, నేతలు మత ద్వేషంతోచేసే ప్రకటనల ఫలితం. ప్రస్తుత సంఘర్షణ సందర్భంలో భారతీయ ముస్లింలంతా ముక్తకంఠంతో భారత ప్రభుత్వం వెనుక నిలబడటం మత విభజన తెచ్చే దుష్టశక్తుల పన్నాగాలను భగ్నం చేసింది. అయితే భారత్–పాకిస్థాన్‌ల మధ్య యుద్ధమే సంభవిస్తే అది ఇరుదేశాలకు అపారనష్టమేగాక భారత్ అభివృద్ధి ఆకాంక్షలకు తీవ్రమైన విఘాతం అవుతుంది. కాబట్టి ప్రస్తుత కాల్పుల విరమణ అంగీకారం ఇరుదేశాలకు ప్రయోజనకారి. టెర్రరిస్టు సమస్యతోపాటు ఇరుదేశాల మధ్య వివాదాలను సిమ్లా ఒప్పందం ప్రకారం ముఖాముఖీ చర్చల ద్వారా పరిష్కరించుకోవటమే ఉత్తమమార్గం.

## తెలుగు వెనకబడి.. సంస్కృతం ముందుకు

భాష అనేది ఒక జాతికి జీవస్వరూపం. భాష ఆధారంగా సంస్కృతి, సాంప్రదాయం, ఆత్మగౌరవం నిలుస్తాయి. కానీ మన దేశంలో, ప్రత్యేకం గా తెలుగు రాష్ట్రాలలో, గత కొన్ని దశాబ్దాలుగా కనిపిస్తున్నదేమిటంటే మన సొంత భాష అయిన తెలుగు కొనసాగిస్తూ, శాసన వ్యవస్థలు, పాలక వర్గాలు సంస్కృతాన్ని ముందుకు నెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యా విధానాల్లో సంస్కృత భాష కు అప్రతిహత ప్రాధాన్యం లభిస్తోంది. ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశాలలో, కొన్ని రాష్ట్రాల సిలబస్ పునఃసంఘటనలలో సంస్కృతం తప్పనిసరి భాషగా ప్రవేశపెట్టబడుతోంది. ఇది మాతృభాషా అభివృద్ధికి విఘాతం కలిగించేదిగా అభిప్రాయపడాల్సి వస్తోంది. తెలుగు విద్యార్థికి తొలుత తన మాతృభాష మీద పట్టుండాలి. పాఠశాల స్థాయి నుంచే తెలుగులో విషయాలను నేర్పితే అభివృద్ధి దిశగా ప్రయాణం జరుగుతుంది. కానీ, సంస్కృతం మా సంస్కృతి భాష అంటూ దానిని మరింతగా ప్రోత్సహించడం, తెలుగు చదవడం, అభివృద్ధి చెందడాన్ని నీరసపరిచేలా మారుతోంది.


తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యా శాఖలు కొన్ని పాఠశాలల పేర్లను 'సంస్కృత విద్యాలయాలు'గా మార్చడమేకాక, వాటిలో సంస్కృ తం చదివేందుకు ప్రత్యేక విద్యార్థుల ఎంపిక చేస్తున్న పరిస్థితి చూస్తే, ఇది వర్గీకరణ వైఖరికి దారితీస్తోంది. ప్రభుత్వ నిధులతో నడిచే విద్యా వ్యవస్థలో సంస్కృతానికి మాత్రమే అధిక ప్రాధాన్యం ఇవ్వడం, తెలుగు భాషను అణచివేతకు గురిచేస్తోంది. సంస్కృతాన్ని విద్యా విధానంలో ముందుకు నెట్టే ప్రయత్నం వెనుక ఉన్నది. భాష అభివృద్ధి కాదు. ఇది ఒక రాజకీయ వైఖరి. ఓ నిర్దిష్ట వర్గ సంస్కృతి ఆధిపత్యాన్ని బలపరచే ప్రయత్నం. ఎందుకంటే సంస్కృత భాష ఆధారంగా బ్రాహ్మణిక సాంప్రదాయాన్ని, వేదాధికారాన్ని, పురాణ సంప్రదాయాలను పెంపొందించాలన్న దృక్కోణమే ఇందుకు మూలం. తెలుగు వంటి ప్రాచీన, ప్రజలతో మమేకమైన భాషను పక్కనపెట్టి, 'అభిజాతమైన సంస్కృతి' అనే ముసుగులో సంస్కృతాన్ని ముందుకు తేవడం, సామాన్య ప్రజల అక్షర జ్ఞానాన్ని కూడా కల్తీ చేసే ప్రమాదం కలిగి ఉంది.

ఇప్పుడు మన భవిష్యత్తు తరాలకు మన భాషను అందించాలంటే:

1. పాఠశాల స్థాయి నుంచే తెలుగు మాధ్యమంలో బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి.
2. తెలుగు భాషాభివృద్ధికి వాడుక భాష విద్యా భాష ప్రభుత్వ భాషలో సమాన స్థానం కల్పించాలి.
3.భాషా విధానాలను రాజకీయ ప్రయోజనాలకోసం వాడకూడదు. 4.తెలుగు ఉపాధ్యాయులు తమ పాత్రను నిబద్ధతతో నిర్వహించాలి. తెలుగు వెనుకపడడం అనేది సహజమైన ప్రక్రియ కాదు. అది మానవీయ ప్రమేయంతో, వ్యవస్థాపిత విధానాలతో జరిగిన తర్క సహితం. సంస్కృతాన్ని భవిష్యత్ భాషగా ఊహించటం ఒక ఉద్దేశ్యపూరిత ప్రయోగం. మన సంస్కృతి, మన భాష కోసం, మన భావి తరాల కోసం స్పందించాల్సిన సమయం ఇదే.

కె. కృష్ణమూర్తి,
తెలుగు భాషా నిపుణులు, హన్మకొండ, 9705196097.

# పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ రుణం : ఒక్కరూ మనవెనుక రాలే!


ఎం. కోటేశ్వరరావు

పాకిస్తాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) రెండు ఖాతాలలో 350 కోట్ల డాలర్లు ఇచ్చేందుకు అంగీకరించింది. దీన్లో తక్షణమే వందకోట్ల డాలర్లు ఇస్తారు. వాషింగ్టన్ డిసిలో శుక్రవారం నాడు జరిగిన బోర్డు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ మంజూరును అడ్డుకొనేందుకు సర్వ ప్రయత్నాలు చేస్తామని భారత్ ప్రకటనలు చేసినా వాటిని ఖాతరు చేయకుండా రుణం ఖరారైంది. మనకు మద్దతుగా ఒక్కరంటే ఒక్క ఇతర డైరెక్టర్‌లు రాలేదు.

తమకు రుణం ఇవ్వకుండా చూసేందుకు భారత్ ప్రయత్నించినప్పటికీ ఐఎంఎఫ్ అంగీకరించటం పట్ల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంతృప్తి వెల్లడించినట్లు పిటిఐ వార్తా సంస్థ పేర్కొన్నది. మన ప్రధాని నరేంద్రమోదీ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. అయితే ఆర్థికశాఖ ఒక ప్రకటన చేస్తూ ఉగ్రవాదానికి ఊతమిస్తున్నందుకు రుణాన్ని బహుమతిగా ఇచ్చారని, ప్రపంచ మానవాళికి ప్రమాదకర సంకేతా న్ని పంపారని, ఇది నిధులు ఇచ్చే సంస్థలు, దాతలకు గౌరవాలకు భంగకరమని, ప్రపంచ విలువలను తక్కువగా చూసిందని విమర్శించింది. పాకిస్తాన్‌కు రుణమిస్తే ఆ మొత్తాన్ని సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేందుకు ఉపయోగిస్తుందని, గతంలో ఇచ్చిన రుణాలను దుర్వినియోగం చేసిందని మన ప్రభుత్వం గట్టి అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఓటింగ్ సందర్భంగా మన నిరసన నమోదు చేసి ఓటింగ్‌ను బహిష్కరించింది.

పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న మాట వాస్తవం. దేశ విదేశీ రుణభారం 2024 నాటికి 130 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రపంచ బ్యాంకు 48 బిలియన్ డాలర్లు ఇచ్చింది, 2025 మార్చి నెలాఖరుకు ఐఎంఎఫ్ ఇచ్చిన రుణాలు 6.2బిలియన్ డాలర్లు ఉన్నా యి. అనేక దేశాల నుంచి చేబదులు మాదిరి సాయం పొందుతున్నది. తిరిగి కోలుకొనేందుకు, నిర్వహణకు అవసరమైన నిధి(ఆర్ఎస్ఎఫ్) పేరుతో 140 కోట్ల డాలర్లు, మరో ఖాతా కింద 210 కోట్ల డాలర్లను ఇచ్చేందుకు సూత్రప్రాయంగా 2024, సెప్టెంబరు 25న ఐఎంఎఫ్ ఆమోదించింది. మార్చి నెల 25న అధికారుల స్థాయిలో ఐఎంఎఫ్, పాకిస్తాన్ రుణం గురించి ఒప్పందానికి వచ్చాయి. ఏడువందల కోట్ల డాలర్లను వంతుల వారీగా ఇస్తారు. 2025 మే నెల తొమ్మిదిన వాటి గురించి సమీక్షించి రానున్న 37నెలల్లో వాటిని విడుదల చేసేందుకు అంగీకరించింది. మొత్తం 700 కోట్ల డాలర్ల రుణం కావాలని పాకిస్తాన్ కోరింది. గతేడాది ఆగస్టు నాటికి 9.4బిలియన్ డాలర్లు ఉన్న విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఏప్రిల్ చివరి నాటికి 10.3బి.డాలర్లకు పెరిగాయి, వాటిని జూన్ నాటికి 13.9 బిలియన్లకు పెంచాలన్నది లక్ష్యం. ఆర్‌ఎస్‌ఎఫ్ నిధులతో ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినపుడు పునరుద్ధరణ, చార్జీల వసూలుతో సహా నీటిని మరింత పొదుపుగా వాడేందుకు చర్యలు, కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం, సమాచార వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు చేపట్టాల్సి ఉంది. సవాళ్ల వాతావరణం ఉన్నప్పటికీ స్థూల ఆర్థిక స్థిరత్వం పునరుద్ధరణ జరుగుతున్నదని ఐఎంఎఫ్ పేర్కొన్నది. వ్యవసాయ ఆదాయంపై పన్ను విధింపుతో సహా అనేక సంస్కరణలను చేపట్టినట్లు తెలిపింది. సకాలంలో విద్యుత్ ఛార్జీల సవరణ ద్వారా రుణభారం తగ్గిందని, పాకిస్తాన్ రిజర్వుబాంకు గట్టి చర్యల కారణంగా రికార్డు స్థాయికి ద్రవ్యోల్బణం తగ్గిందని, వ్యవస్థాగత సంస్కరణలు చేయాలని పేర్కొన్నది. జనానికి వ్యతిరేకమైన షరతులతో పాకిస్తాన్ రుణాలు తీసుకున్నది. ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడుల నిలిపివేత, మూసివేత, తెగనమ్మటం, వినియోగదారుల నుంచి సేవలకు ఛార్జీలు, విద్యుత్ ఇతర రంగాలలో సంస్కరణల వంటివి వాటిలో ఉన్నాయి.

ఐఎంఎఫ్ నిబంధనల ప్రకారం ప్రతి దేశానికి ఓటింగ్ సంఖ్య




ఉంటుంది. ఆ మేరకు ఇతర సందర్భాలలో ఓటు వేయవచ్చు. రుణాల మంజూరు విషయంలో ఏకాభిప్రాయమేగాని ఓటింగ్ ఉండదు. అంగీకారం లేని దేశం దూరంగా ఉండటం తప్ప వ్యతిరేక ఓటు వేసేందుకు అవకాశం లేదు.

తాజాగా మనదేశం అదే చేసింది. ఐఎంఎఫ్‌లో ఓటింగ్ బలాబలాల విషయాన్ని చూద్దాం. అమెరికా 16.49, జపాన్ 6.14, చైనా 6.08. మొత్తం 25 మంది డైరెక్టర్లలో ఈ మూడు దేశాలకు ఒక్కొక్క డైరెక్టర్ నిరంతరం ఉంటారు. మిగిలిన 22 మందిని దేశాలతో కూడిన 22 బృందాలు వంతుల వారీ ఎన్నుకుంటాయి. ఉదాహరణకు బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక, భారత్ కలసి ఒక బృందం. ఈ దేశాల నుంచి ఎవరో ఒకరు మాత్రమే ఉంటారు. వీటన్నింటి ఓటింగ్ బలం 3.05 మాత్రమే. మొత్తం ఓట్లు 49,91,063 కాగా చైనాకు 3,06,281, మన బృంద దేశాలన్నింటికీ కలిపి ఉన్నది 1,53,610. కాగా వాటిలో దేశానికి 1,32,596, బంగ్లాదేశ్ 12,118, శ్రీలంక 7,240, భూటాన్ 1,656 ఉన్నాయి. వేరే గ్రూపు లో ఉన్న పాకిస్తాన్‌కు 21,762 ఉన్నాయి. ప్రస్తుతం మన దేశం నుంచి పరమేశ్వరన్ అయ్యర్ తాత్కాలిక డైరెక్టర్‌గా ఉన్నారు.

పాక్‌పై గతంలోనే ఒక అంచనాకు వచ్చిన ఐఎంఎఫ్ రుణం ఇవ్వకుండా ఉంటుందని ఎవరైనా అనుకుంటే పొరపాటే. ఉగ్రవాదులకు మద్దతు, శిక్షణ ఇవ్వటం, ఇతర దేశాల మీదకు వదలటం ఇస్లామాబాద్‌కు కొత్త కాదు. తాము శిక్షణ ఇచ్చినట్లు ఆ దేశ మంత్రే స్వయంగా చెప్పాడు. అయినప్పటికీ దశాబ్దాలుగా ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ రుణాలు, గ్రాంట్లు ఇస్తూనే ఉన్నాయి. ఉగ్రవాదానికి వాటికి లంకె పెట్టలేదు. ఒక్క పాకిస్తానే కాదు, ఏ దేశానికీ అలాంటి షరతులేదు. అలాంటి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలనే నిబంధన ఉండి ఉంటే అసలు ఏ దేశానికీ రుణం పొందే అర్హత, అవకాశం ఉండదు. ఏదో ఒక ఉల్లంఘనకు పాల్పడినట్లు ఆరోపణ లేదా విమర్శలకు గురికాని దేశం ఒక్కటంటే ఒక్కటి లేదు. పహల్గాం ఉగ్రదాడితో నిమిత్తం లేకుండానే ముందే చెప్పినట్లు నెల రోజుల ముందే అధికారుల మధ్య కుదిరిన ఒప్పందానికి లాంఛన ప్రాయంగా ఆమోద ముద్రవేయటం తప్ప మే తొమ్మిది సమావేశానికి మరొక అజెండా లేదు. ఈ విషయాలన్నీ మన విధాన నిర్ణేతలు, పరిశీలకులకు తెలుసు.

2019లో పుల్వామా దాడికి ప్రతిగా మనం బాలాకోట్‌పై మెరుపుదాడి చేశాము. అప్పటి నుంచి లేదా అంతకు ముందు జరిగి న దాడుల నాటినుంచి ఐఎంఎఫ్ లేదా ప్రపంచ బ్యాంకు, ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఇస్లామాబాద్‌కు రుణాలు ఇస్తే వాటిని ఉగ్రవాదులకు మళ్లిస్తారని మన దేశం చేసిన ప్రయత్నాలు ఏమైనా ఉన్నాయా అంటే మీడియాలో అలాంటి ఛాయలు లేవు. అంతర్గతంగా వత్తిడి తెచ్చారేమో మనకు తెలియదు కదా అని అమాయకంగా చెప్పేవారు ఉండవచ్చు. ఆ ప్రకారం చూసినా నిజమే అనుకుంటే ఒక్క దేశం కూడా మన మాటకు గౌరవమిచ్చి మనతో పాటు కలసి రాలేదు.

మన నిరసన తెలిపేందుకు బహిష్కరించామని ఇప్పుడు కొంత మంది చెబుతున్నారు. దానికి ముందు అడ్డుకుంటామని, మరేదో చేస్తామనే ప్రచార ఆర్భాటం ఎందుకు?

# యుద్ధం.. ప్రపంచానికి భారమే!


ఫిరోజ్ ఖాన్
9640466464

'యుద్ధాన్ని ప్రపంచం భరించ లేదు'. భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ డిప్యూటీ ప్రతినిధి ఫర్హాన్ హక్ ప్రకటన ఇది. ఆయ న ప్రకటన వెనక ఎంతో అంతరార్థం దాగి ఉంది. ఇప్పటికే గాజా–ఇజ్రాయెల్, ఉక్రెయిన్–రష్యా మధ్య సంవత్సరాలుగా యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్నాయి. తీవ్ర ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యంపైనా తీవ్ర ప్రభావం పడింది. అనేక వస్తువుల ధరలు తీవ్రంగా పెరిగాయి. ఇది నిరుపేదలు, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారింది. లక్షలాది కుటుంబాల ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యాయి.

ఈ నేపథ్యంలో భారత్–పాకిస్తాన్ యుద్ధం మొదలైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా అస్థిరత ఎదుర్కొనే ప్రమాదముంది. ప్రపంచ అనేక దేశాల ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలోనే అనేక దేశాల అధినేతలు యుద్ధ పరిస్థితులపై తీవ్ర ఆందోళన చెందారు.

**ప్రపంచ దేశాల్లో ఆందోళన**

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనేక అంశాలపై ప్రభావం పడింది. రెండు దేశాల్లో ఉత్పత్తి అయ్యే వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. యుద్ధం వల్ల గ్లోబల్ ద్రవ్యోల్బణం 23% పెరిగింది. రష్యా, ఉక్రెయిన్ గోధుమల సరఫరాలో 25 శాతం వాటాను కలిగి ఉన్నయి. అయితే యుద్ధం వల్ల 40–50 శాతం ధరలు పెరిగి ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఆహార సంక్షోభం సైతం ఏర్పడింది. పామాయిల్ ధరలు 40–50% పెరిగాయి, ఎరువుల ధరలు 30% పెరిగి వ్యవసాయ ఖర్చులు భారమయ్యాయి. అయితే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడంతో కొన్ని నెలల తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. కానీ అప్పటికే ప్రజలపై తీవ్ర ప్రభావం పడింది.

**ఎగుమతులు, దిగుమతులపై..**

భారతదేశం ప్రస్తుతం 4.27 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ఇండియా ఐటి, ఫార్మా, వ్యవసాయం, టెక్స్ టైల్స్, ఆటోమొబైల్ రంగా ల్లో ప్రధాన ఎగుమతిదారు. ప్రపంచంలో 40 శాతం బియ్యం సరఫరాలో ఇండియా ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతి దారు. 10శాతం సరఫరాతో పాకిస్తాన్ నాలుగో స్థానంలో ఉంది. అయితే ఒకవేళ యుద్ధం వల్ల ఓడ రేవులు, రవాణా మార్గాలకు అంతరాయం కలిగితే



మలేషియా, సింగపూర్, సౌదీ అరేబియా, యుఎఇ, బంగ్లాదేశ్, ఇండోనేషియాతోపాటు మరి కొన్ని దేశాల్లో 20 నుంచి 30 శాతం బియ్యం ధరలు పెరగవచ్చు. ఆహార ద్రవ్యోల్బణం 5–10% పెరగవచ్చు. ఆసియాలోని దేశాల్లో చమురు ధరల్లో కూడా అస్థిరత ఉండవచ్చు. ఉల్లిపాయలు, ఔషధాల సరఫరా, టెక్స్‌లైల్స్, ఐటీ సేవలపైనా ప్రభావం పడుతుంది. ఇండియా నుండి జెనెరిక్ ఔషధాలు దిగుమతి చేసుకునే నైజీరియా, కెన్యా, దక్షిణాఫ్రికా వంటి ఆఫ్రికా దేశాల్లో ఔషధ ధరలు 20– 30% పెరగడం వల్ల ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదముంది. బియ్యం కొరత ఆహార సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది. ఇండియా నుంచి ఐటి సేవలు, టెక్స్ టైల్స్, ఫార్మా ఎగుమతులు ఆగిపోతే అమెరికా, యూరప్ దేశాల్లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఖర్చులు, దుస్తులు, ఔషధ ధరలు 5–15% పెరగవచ్చు. చైనా ఇండియా నుండి రసాయనాలు, ఫార్మా మూలవస్తువుల ను దిగుమతి చేసుకుంటుంది. యుద్ధంవల్ల ఈ సరఫరా ఆగిపోతే చైనా ఔషధ ఉత్పత్తి ఖర్చులు పెరగవచ్చు.

**స్టాక్ మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం**

భారత్ పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పూర్తిస్థాయి యుద్ధంగా మారితే వివిధ దేశాల్లో స్టాక్ మార్కెట్లపైన తీవ్ర ప్రభావం పడి మదుపరుల సంపద ఆవిరి అయ్యే ప్రమాదమున్నది. పహెల్గాం దాడి తర్వాత జరిగిన పరిణామాలతో పాకిస్తాన్ కు చెందిన కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్ 13 శాతానికి పైగా పడిపోయింది. ఆ దేశంలో కొన్ని రోజుల్లోనే 80 వేల కోట్లకుపైగా నష్టం వాటిల్లింది. భారత స్టాక్ మార్కెట్లు స్థిరంగానే ఉన్నా.. శుక్రవారం నిఫ్టి 250 పాయింట్లకు పైగా, సెన్సెక్ 800 పాయింట్లకు పైగా నష్టపోయాయి. అయితే ప్రస్తుతం భారత్ దగ్గర ఆర్థిక బలం ఎక్కువ. ఈ క్షీణత తాత్కాలికమే. కాల్పుల విరమణతో సోమవారమే భారీగా మార్కెట్లు కోలుకున్నాయి. చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ లో చైనా ఇప్పటికే భారీ పెట్టుబడులు పెట్టింది. యుద్ధం జరిగితే, ఈ పెట్టుబడులపై రిస్క్ పెరుగుతుంది, ఇది చైనా స్టాక్ మార్కెట్‌లో స్వల్పకాలిక అస్థిరతను కలిగించే అవకాశముంది. ఐటి, ఫార్మా రంగాల్లో అమెరికాకు భారత్ కీలక సరఫరాదారు. యుద్ధం వల్ల ఈ సరఫరాలకు ఆటంకం ఏర్పడితే, అమెరికన్ టెక్, హెల్త్ కేర్ స్టాక్‌లపై స్వల్ప ప్రభావం పడవచ్చు. యూరప్ లోనూ దీని ప్రభావం ఉండొచ్చు. బంగ్లాదేశ్ టెక్స్ టైల్ ఎగుమతులు ఇండియాపై ఆధారపడతాయి. వాణిజ్యానికి అంతరాయం ఏర్పడితే ఆ దేశ టెక్స్ టైల్ స్టాక్‌లు దెబ్బ తినొచ్చు.

**పాకిస్తాన్ అత్యుత్సాహంతో..**

పహెల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరు తో భారతదేశం సర్జికల్ స్ట్రైక్ చేపట్టింది. ఉగ్రవాద కేంద్రాలను టార్గెట్ గా చేసుకొని దాడి చేసింది. సంయమనం పాటించాల్సిన పాకిస్తాన్ అత్యుత్సాహం చూపిం ది. రెచ్చగొట్టేలా ఇండియాలోని పలు చోట్ల డ్రోన్లతో దాడులు చేయడానికి ప్రయత్నించడంతో మళ్లీ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభం లో కూరుకుపోయి ఉన్నది. కేవలం 348 బిలియన్ డాలర్లతో అత్యంత బలహీనంగా ఉంది.

130 బిలియన్ డాలర్ల రుణంలో కూరుకుపోయి ఉంది. ఫారెక్స్ రిజర్వు నిల్వలు సైతం అతి తక్కువగా ఉన్నాయి. ఐఎంఎఫ్ బెయిలౌట్లపై ఆధారపడుతున్నది.

భారత్ తీసుకున్న చర్యలకు ప్రతిగా ఇండియా నుంచి దిగుమతులను నిషేధించింది. ఇది ఆ దేశ వైద్యరంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ప్రస్తుతం అక్కడ అత్యవసర మందులు దొరకని పరిస్థితి నెలకొన్నది. యుద్ధం వస్తే ఆ దేశ పరిస్థితి మరింత దిగజారుతుంది. పాకిస్తాన్ రూపాయి మరింత పడిపోతుంది. నీటి కొరతతో పాటు గోధుమలు, బియ్యం, కూరగాయల ధరలు పెరుగుతాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ ధరలు ఆకాశాన్నంటుతాయి. ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్న ధరలను భరించడం అక్కడి ప్రజలకు కష్టతరంగా మారింది. అంతేకాకుండా ప్రపంచ దేశాలు సైతం పాకిస్తాన్‌ను దోషిగానే చూస్తున్నా యి.

# 'రిశాట్–1బి' అంతరిక్షంలో భారత అకుంఠిత నేత్రం

ఒకప్పుడు దట్టమైన మేఘాలు కమ్మేసినా, చిమ్మచీకట్లు అలుముకున్నా భూమిని చూడలేని నిస్సహాయత. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, సరిహద్దుల వద్ద ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు స్పష్టమైన సమాచారం కోసం ఎదురుచూపులు. కానీ ఇప్పుడు కాలం మారింది.

ఒక చారిత్రక ఘట్టం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అలుపెరగని కృషితో రూపుదిద్దుకున్న ఒక అద్భుత సాంకేతిక చక్షువు మన జాతికి అండగా నిలవడానికి సిద్ధమవుతోంది. అదే 'రిశాట్1బి' – రాడార్ ఇమేజింగ్ శాటిలైట్. దీనికి ఇఒఎస్09 గా కూడా పిలుస్తారు. మే 18, 2025 ఆ రోజు కోసం ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. ఆ రోజు ఉదయం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి భారత కాలమానం ప్రకారం ఉదయం 6.59 గంటలకు జరగనుంది. ఇస్రో నమ్మకమైన వాహక నౌక పిఎస్‌ఎల్‌విసి61, రిశాట్1బిని గుండెల్లో పెట్టుకుని గగనసీమ వైపు దూసుకెళ్లనుంది. ఆ క్షణం ప్రతి భారతీయుడి గుండె గర్వంతో ఉప్పొంగుతుంది. శాస్త్ర సాంకేతిక రంగంలో మన దేశం సాధిస్తున్న ప్రగతికి అది నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత కొన్ని రోజులకే వస్తున్న ఈ ప్రయోగం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుందని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే ఇది పాకిస్తాన్, చైనా వెంట భారతదేశ సున్నితమైన సరిహద్దులను పర్యవేక్షించడంలో, దేశంలోని విస్తారమైన తీరప్రాంతాలను కాపాడటంలో రక్షణ దళాలకు కీలకమైన శక్తిని ఇస్తుంది. ఇది భవిష్యత్ పథంలో ఒక దిక్సూచి అవుతుంది. కక్ష్యలోకి చేరిన తర్వాత రిశాట్1బి సుమారు పదేళ్లపాటు మనకు సేవలందిస్తుందని అంచనా. ఇది అందించే సమాచారం, చిత్రాలు మన దేశ భవిష్యత్ ప్రణాళికలకు దిక్సూచిగా మారతాయి. ఇస్రో ఇప్పటికే నాసాతో కలిసి 'నిసార్' అనే మరో అత్యాధునిక రాడార్ ఉపగ్రహాన్ని రూపొందిస్తోంది. రిశాట్1బి విజయం ఆ భవిష్యత్ ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూరుస్తుంది.

**ఆద్యంతం ఒక అన్వేషణ:**

రిశాట్ ప్రస్థానం ఒక్క రోజులో మొదలైంది కాదు. దశాబ్దాల శాస్త్రవేత్తల మేధోమథనం, అలుపెరగని పరిశోధనల ఫలం ఇది. సాధారణ ఉపగ్రహ కెమెరాలకు కొన్ని పరిమితులున్నాయి. అవి సూర్యరశ్మి ఉన్నప్పుడు, ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు మాత్రమే భూమిని స్పష్టంగా చూడగలవు. కానీ దేశ రక్షణ, విపత్తు నిర్వహణ వంటి కీలక సమయాల్లో ప్రతి



క్షణం సమాచారం అవసరం. ఈ అవసరాన్ని గుర్తించిన ఇస్రో, రాడార్ సాంకేతికత వైపు అడుగులు వేసింది. రాడార్ తరంగాలు మేఘాలను, చీకటిని ఛేదించుకుని ప్రయాణించి భూమిని స్పష్టంగా చిత్రీకరించగలవు – ఇదే రిశాట్ శ్రేణికి పునాది. 2008 ముంబై దాడుల తర్వాత, దేశ భద్రతకు నిరంతర నిఘా ఎంత అవసరమో యావత్ జాతికి తెలిసొచ్చింది. తక్షణ అవసరాల రీత్యా, 2009లో 'రిశాట్2' (ఇజ్రాయెల్ సహకారంతో) అంతరిక్షంలోకి వెళ్లింది. అది ఎక్స్‌బ్యాండ రాడార్‌తో మన సరిహద్దులకు ఒక కవచంలా నిలిచింది. ఆ తర్వాత పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో సిబ్యాండ రాడార్‌తో 'రిశాట్1'ను 2012లో ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. ఇది ప్రధానంగా వ్యవసాయం, అటవీ సంపద, వరదల అంచనా వంటి పౌర సేవలకు అంకితమై, అన్నదాతలకు, ప్రకృతి పరిరక్షకులకు నేస్తమైంది. ఈ విజయాల స్ఫూర్తితో మరింత ఆధునిక పరిజ్ఞానంతో రిశాట్2బి, రిశాట్2బిఆర్1 వంటి ఉపగ్రహాలు మన రక్షణ, పర్యవేక్షణ సామర్థ్యాన్ని ఇనుమడింపజేశాయి.

**నవశకపు నేత్రం – రిశాట్–1బి ప్రత్యేకతలు:**

ఈ అద్భుత పరంపరలో మరో కలికితురాయిగా మునుపటి ఉపగ్రహాల అనుభవాన్ని ఆధునిక సాంకేతికతను రంగరించి 'రిశాట్1బి' రూపుదిద్దుకుంది. ఇది కేవలం ఒక ఉపగ్రహం కాదు, అంతరిక్షంలో మన జాతికి అదనపు నేత్రం. దీనిలో అమర్చిన అత్యాధునిక సిబ్యాండ సింథటిక్ అపెర్చర్ రాడార్ దీని ప్రత్యేకత. ఈ రాడార్‌కు ఒక విశిష్ట శక్తి ఉంది – అది పగలురాత్రి, ఎండావాన, మంచుపొగమంచు తేడా లేకుండా భూమిని అత్యంత స్పష్టంగా చూడగలదు. ఒకప్పుడు సైనికుడు సరిహద్దులో చిన్న కదలికను పసిగట్టాలన్నా, విపత్తు సమయంలో సహాయక బృందం మారుమూల గ్రామానికి దారి కనుక్కోవాలన్నా ఎన్నో సవాళ్లు. కానీ రిశాట్1బి తన ఐదు విభిన్న ఇమేజింగ్ మోడ్‌లతో ఈ సవాళ్లను అధిగమించనుంది. ఒకవైపు అత్యంత సూక్ష్మ మైన వస్తువులను కూడా గుర్తించగల 'సూపర్ ఫైన్' చిత్రాలను అందిస్తూనే మరోవైపు విశాలమైన ప్రాంతాలను వేగంగా స్కాన్ చేసి పరిస్థితిని అంచనా వేయగలదు. సుమారు 1710 కిలోల బరువుతో భూమికి 529 కిలోమీటర్ల ఎత్తులో తన కక్ష్యలో పరిభ్రమిస్తూ, నిరంతరాయంగా మన భూభాగాన్ని కాపలా కాయనుంది.

**అంతరిక్షంలో అకుంఠిత నేత్రం:**

రిశాట్1బి ప్రయోగం కేవలం ఒక సాంకేతిక విజయం మాత్రమే కాదు. అది స్వావలంబన దిశగా భారతదేశం వేస్తున్న మరో దృఢమైన అడుగు. మన శాస్త్రవేత్తల ప్రతిభకు, మన దేశపు ఆకాంక్షలకు అది నిదర్శనం. అంతరిక్షంలో మన అకుంఠిత నేత్రంగా మారి, ఈ దేశాన్ని సదా కాపాడుతూ, ప్రగతి పథంలో నడిపించాలని ఆశిద్దాం. ఈ ప్రస్థానం, భావి తరాలకు స్ఫూర్తినిస్తూ భారతదేశ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేయడం ఖాయం. జై భారత్ !

డిజె. మోహన రావు, 8247045230



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కాల్పుల విరమణకు ముందే... కేంద్రం సమావేశాలు నిర్వహిస్తే బాగుండేది

### విలేకరుల సమావేశంలో కర్ణాటక సిఎం సిద్ధరామయ్య

**మైసూరు :** పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ అవగాహనకు ముందే కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశం, అన్ని రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించి ఉంటే బాగుండేదని కర్ణాటక సిఎం సిద్ధరామయ్య తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. ఆయన సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఉగ్రవాదులపై చేపట్టిన సైనిక చర్యల క్రెడిట్ అంతా సాయుధ బలగాలకే చెందుతుందని సిద్ధరామయ్య చెప్పారు. దీనిని ఏ ఒక్కరూ రాజకీయ పరపతి కోసం వాడుకునే హక్కును కలిగి ఉండరని ఆయన స్పష్టంచేశారు.‘ఇరుదేశాలు (భారత్–పాక్) కాల్పుల విరమణకు ఒక అవగాహనకు వచ్చి ఒక ప్రకటన చేశారు. ఇరు దేశాలకు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్ (డిజిఎం) సమావేశమై అక్కడ ఏమి నిర్ణయిస్తారన్నది తెలుసుకునేందుకు మరికొంత సమయం నిరీక్షించాలి’ అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా సిద్ధరామయ్య చెప్పారు. కాల్పుల విరమణకు ముందే అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలన్నది తన అభిప్రాయమన్నారు.

## తిరిగి తెరుచుకున్న 32 విమానాశ్రయాలు

**న్యూఢిల్లీ :** భారత్–పాక్ మధ్య నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలను అధికారులు మూసివేసిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంతో సరిహద్దు రాష్ట్రాల్లో పరిస్థితి సాధారణ స్థితికి చేరింది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా మూసివేసిన ఎయిర్‌పోర్ట్స్‌ను అధికారులు తిరిగి తెరిచారు. 32 విమానాశ్రయాలను సోమవారం తిరిగి తెరిచినట్లు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా తాజాగా వెల్లడించింది. పహల్గామ్ ఉగ్రదాడితో భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఇరు దేశాలు దాడులు ప్రతిదాడులతో సరిహద్దుల్లోని ప్రాంతాలు దద్దరిల్లాయి. పాక్ డ్రోన్లు, క్షిపణులతో భారత్‌పై దాడులు చేస్తుండటంతో పౌర విమానాల రాకపోకలపై ఎయిర్‌పోరట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిషేధం విధించింది. దేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని మొత్తం 32 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. అధంపూర్, అంబాలా, అమృత్‌సర్, అవంతీపురా, బతిందా, బికనేర్, భూజ్, చండీగఢ్, హల్వారా, హిండన్, జమ్ము, జామ్‌నగర్, జోథ్‌పూర్, జైసల్మేర్, కండాలా, కాంగ్రా, కేషోడ్, కిషన్‌గఢ్, కులు మనాలి, లేహ్, లూథియానా, ముంద్రా, నలియా, పఠాన్‌కోట్, పటియాలా, పోర్‌బందర్, రాజ్‌కోట్, సర్సావా, శ్రీనగర్, షిమ్లా, తోయ్‌స్, ఉత్తర్‌లాయ్ ఎయిర్‌పోర్టులను మూసివేస్తున్నట్లు తెలిపింది. ఈ నెల 15 వరకు ఆయా ఎయిర్‌పోర్టుల నుంచి ఎలాంటి విమానాల రాకపోకలు ఉండవని స్పష్టం చేసింది. అయితే, తాజాగా కాల్పుల విరమణ ఒప్పందంతో పరిస్థితి సాధారణ స్థితికి చేరడంతో అధికారులు ఆయా విమానాశ్రయాలను తిరిగి తెరిచారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### 13 మంది మృత్యువాత

**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయ్‌పూర్‌లో ఒక ట్రైలర్, గూడ్స్ ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 13 మంది మరణించగా, 14 మంది గాయపడ్డారని పోలీసులు సోమవారం తెలిపారు. రాయ్‌పూర్ జిల్లా రాయ్‌పూర్–బలోదబజార్ రోడ్డులోని సారగావ్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో నలుగురు చిన్నారులు తొమ్మిది మంది మహిళలు మరణించారు. ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. పెద్ద మొత్తంలో ఒకే కుటుంబానికి చెందిన వారితో సహా మొత్తం 35 మంది బనాబన్సారీ గ్రామంలో నిర్వహించిన ఒక కుటుంబ కార్యక్రమం నుండి తిరిగి వస్తుండగా, వారు ప్రయాణిస్తున్న గూడ్స్ ట్రక్కు ఎదురుగా వస్తున్న ట్రైలర్‌ను ఢీకొట్టి, మరో భారీ వాహనాన్ని ఢీకొట్టిందని రాయ్‌పూర్ సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ లాల్ ఉమేద్ సింగ్ చెప్పారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసు బృందాన్ని ఘటనా స్థలానికి పంపామని, గాయపడిన వారిని రాయ్‌పూర్‌లోని డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి సాయి విచారం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు.

# ఉగ్రవాదం, ఉగ్రవాదులపైనే పోరు

### భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయ్
### పాక్ ఆటలు సాగనివ్వకుండా చేశాం
### అత్యాధునిక క్షిపణి రక్షక వ్యవస్థలతో పాక్ క్షిపణులు, డ్రోన్‌లను తిప్పికొట్టాం
### చైనా తయారుచేసిన పిఎల్-15 క్షిపణిని నేలకూల్చాం
### ఆపరేషన్ సిందూర్‌పై మీడియా సమావేశంలో రక్షణశాఖ అధికారులు వెల్లడి



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఈనెల 7న జరిపిన దాడుల్లో ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు రక్షణశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఉగ్రవాదం, ఉగ్రవాదులపైనే తమ పోరు అని ఆపరేషన్ సిందూర్‌పై నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పాకిస్థాన్‌పై దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయన్నారు. దాయాది ఆటలు సాగనివ్వకుండా చేశామన్నారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను అధికారులు ప్రదర్శించారు. పాకిస్థాన్ సేనలు ఉగ్రవాదులకు అండగా నిలిచాయని, ఈ పోరాటాన్ని తమ పోరాటంగా మలచుకున్నాయని పేర్కొన్నారు. దీంతో భారత సైన్యం దీటుగా జవాబు ఇచ్చిందని చెప్పారు. పాకిస్థాన్ సైన్యానికి ఏదైనా నష్టం వాటిల్లితే దానికి వారే బాధ్యులని స్పష్టం చేశారు. అనంతరం పాక్‌లోని నూర్ ఖాన్, రహీమ్‌యార్ ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను ప్రదర్శించారు.

**పిఒకెలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతం: ఎకె భారతి**

పాకిస్థాన్, పిఒకెలో ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేశాం. పిఒకెలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైంది. ఉగ్రవాదుల శిబిరాలే లక్ష్యంగా మనం యుద్ధం చేశాం. అత్యాధునిక క్షిపణి రక్షక వ్యవస్థలతో పాక్ క్షిపణులు, డ్రోన్‌లను తిప్పికొట్టాం. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశాం. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆకాశ్‌ను ఈ ఆపరేషన్‌లో సమర్థంగా వినియోగించాం. పాకిస్థాన్‌కు చెందిన సామాన్య పౌరులకూ ఎలాంటి నష్టం చేయలేదు. అదే సమయంలో పాకిస్థాన్ వైపు నుంచి దాడులను సమర్థంగా తిప్పికొట్టాం. చైనా తయారు చేసిన పిఎల్–15 క్షిపణిని నేలకూల్చాం. పాకిస్థాన్‌కు చెందిన అనేక డ్రోన్లు, క్షిపణులనను కూల్చివేశాం. ఉగ్రవాదంపై పోరాటంలో పాక్ సైన్యం జోక్యం చేసుకుంటే తిప్పికొట్టాం. కరాచీ సమీపంలోని లక్ష్యాలపైనా దాడులు చేశాం’ అని ఎయిర్ మార్షల్ ఎకె భారతి వెల్లడించారు.

**పటిష్ఠ నిఘాతో దాడులను తిప్పికొట్టాం.. వైస్ అడ్మిరల్ ప్రమోద్**

భారత్ వైపు గగనతల దాడులను తక్షణమే పసిగట్టి నిలువరించామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్లు, రాడార్లు ఉపయోగించామన్నారు. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించామని చెప్పారు. డ్రోన్లు, హైస్పీడ్ మిస్సైళ్లను వినియోగించినట్లు వెల్లడించారు. నౌకాదళ అడ్వాన్స్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించగలిగినట్లు పేర్కొన్నారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రుసేనల విమానాలను దగ్గరకు రాకుండా అడ్డుకున్నాం. త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి. మన స్వదేశీ ప్రతిస్పందన దాడి వ్యవస్థ చాలా బలమైంది. సైన్యానికి అండగా నిలిచిన 140 కోట్ల మంది ప్రజలకు ధన్యవాదాలు. ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టేందుకు సైన్యం సర్వసన్నద్ధంగా ఉంది అని వైస్ అడ్మిరల్ ప్రమోద్ స్పష్టం చేశారు.

**మా పోరాటం ఉగ్రవాదులపైనే..**

మన గగనతల రక్షణ వ్యవస్థలోని దశలను చూస్తే మీకు ఇంకా బాగా అర్థమవుతుంది. శత్రువులు ఎన్ని హద్దులు దాటి వచ్చినా.. ఈ గ్రిడ్ సిస్టమ్‌లోని ఒక లేయర్ వారిని నాశనం చేస్తుంది. మన ఎయిర్ డిఫెన్స్ అంత శక్తిమంతమైనది, విలువైనది అని ఆర్మీ డిజిఎంఒ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రుసేనల విమానాలను దగ్గరకు రాకుండా అడ్డుకున్నట్లు తెలిపారు. అయితే, తమ పోరు ఉగ్రవాదంపైనే అని, అనవసరంగా పాక్ ఆర్మీ ఇందులో జోక్యం చేసుకుందన్ని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఉగ్రవాదం తీరులో మార్పు వచ్చిందని.. ఉగ్రవాదులు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని రాజీవ్ ఘాయ్ అన్నారు.

**కిరానా హిల్స్‌ను టార్గెట్ చేయలేదు : భారతి**

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌ను లక్ష్యంగా చేసుకోలేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఎకెభారతి వెల్లడించారు. పాకిస్థాన్‌లోని అణుస్థావరాన్ని భారత్ లక్ష్యంగా చేసుకున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని తోసిపుచ్చారు. ఆపరేషన్ సిందూర్‌పై త్రివిధ దళాల అధికారులు నిర్వహించిన సమావేశంలో ఈ అసత్య ప్రచారంపై స్పష్టత ఇచ్చారు. పాకిస్థాన్ తన అణ్వాయుధాలను కిరానా హిల్స్ వద్ద నిల్వ చేస్తుందని చెప్పినందుకు థ్యాంక్స్. అక్కడ ఏమైనా ఉండనీ.. మేం మాత్రం ఆ హిల్స్‌ను టార్గెట్ చేయలేదు. మేం లక్ష్యంగా చేసుకున్నామని చెప్పిన జాబితాలో అది లేదు అని ఎయిర్ చీఫ్ మార్షల్ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ అణు స్థావరంపై దాడి గురించి అనేక వార్తలు చక్కర్లు కొట్టాయి. అణ్వాయుధాలను నిల్వచేసి ఉండొచ్చని చెప్తున్న హిల్స్. సర్గోధా వైమానిక స్థావరానికి దగ్గర ఉన్నాయని వాటి సారాంశం. ఆ వైమానిక స్థావరాన్ని భారత్ టార్గెట్ చేసినట్లు మన సైన్యం ధ్రువీకరించగానే ఆ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. పాక్‌లో ఇటీవల సంభవించిన భూకంపాలకు.. అణు నిల్వలు ఉంచిన ప్రదేశాన్ని ఢీకొట్టడానికి ముడిపెట్టిన సిద్ధాంతాలు చక్కర్లు కొట్టాయి. వీటన్నింటికి తాజాగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఏకే భారతి చెక్ పెట్టారు.

**క్రికెటర్ కోహ్లీ ప్రస్తావన**

స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రస్తావన తెచ్చారు. మన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సామర్థ్యాన్ని ఆస్ట్రేలియా దిగ్గజ ఫాస్ట్ బౌలర్లు జెఫ్ థామ్సన్, డెనిస్ లిల్లీ ద్వయంతో పోలుస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోమవారం విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఎంతోమంది అభిమానుల్లాగే నాక్కూడా ఆయన ఎంతో ఇష్టమైన క్రికెటర్. అందువల్ల క్రికెట్ గురించి మనం ఇప్పుడు మాట్లాడుకోవచ్చు. 1970ల్లో నేను స్కూల్ రోజుల్లో ఉన్నప్పుడు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా మధ్య ఓ క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఆ సమయంలో ఆసీస్ మేటి బౌలర్లు జెఫ్ థామ్సన్, డెనిస్ లిల్లీ విధ్వంసం సృష్టించారు. ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్‌ను ఊచకోత కోశారు. అప్పుడు ఆస్ట్రేలియా ఓ పద ప్రయోగం చేసింది. యాషెస్ టు యాషెస్ (బూడిదను ఉద్దేశిస్తూ).. డస్ట్ టు డస్ట్.. థామ్సన్‌కి దొరక్కపోతే.. లిల్లీకి చిక్కాల్సిందే అని పేర్కొంది. ఇప్పుడు పాకిస్థాన్‌పై పోరులో భారత్ ఆధిపత్యాన్ని అలాగే అభివర్ణించొచ్చు అని లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అన్నారు.

# పాలనలో కొనసాగింపునకు ‘బ్రహ్మోస్’ ఒక అద్భుత రుజువు



### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్
### బ్రహ్మోస్ క్షిపణిని సైన్యంలోకి చేర్చింది కాంగ్రెస్ పాలనలోనే
### దానిని అంత సులభంగా ‘తిరస్కరించలేము’... ‘తుడిచివేయలేము’ అని వ్యంగాస్త్రాలు

**న్యూఢిల్లీ :** పాలనలో కొనసాగింపునకు బ్రహ్మోస్ క్షిపణి ఒక అద్భుతమైన రుజువు అని, దీనిని ‘తిరస్కరించలేము’, ‘తుడిచివేయలేము’ అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. ఇది ప్రస్తుత పాలక సంస్థలకు ఒక అలవాటుగా మారిందని వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన ‘ఎక్స్’పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. జైరమేష్ మాట్లాడుతూ బ్రహ్మోస్ క్షిపణిని 2005లో భారత నావికాదళంలోకి, 2007లో ఇండియన్ ఆర్మీలోకి చేర్చారని చెప్పారు. గాలి నుంచి ప్రయోగించే బ్రహ్మోస్ 2012లోనే కనిపించిందని, ఇదంతా అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ హయాంలోనే జరిగిందన్నారు. ‘మన్మోహన్ నాయకత్వంలో 2005లోనే చారిత్రక ఇండోయుఎస్ న్యూక్లియర్ ఒప్పందానికి దారితీసింది. పదకొండు ఏళ్ల తర్వాత భారతదేశం మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ పాలనా వ్యవస్థలోకి చేరేందుకు మార్గం సుగమం అయ్యింది. హైదరాబాద్‌లోని బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్, బ్రహ్మోస్ ఎరోస్పేస్ తిరువనంతపురం లిమిటెడ్ అదే కాలంలో స్థాపించబడింది. బ్రహ్మోస్ ఇటీవల కాలంలో బాగా వార్తలలోకి ఎక్కింది. బ్రహ్మపుత్ర, మోస్కవా పేర్ల తర్వాత భారత్‌రష్యా సహకారానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచిందన్నారు. అంతేకాకుండా ఇది పాలనలో కొనసాగింపునకు మరొక అద్భుత అనుకూలత. దీనిని అంత సులభంగా ‘తిరస్కరించలేము’, ‘తుడిచివేయలేము’ అని జైరామ్ రమేష్ అన్నారు. కానీ ఇది న్యూఢిల్లీలోని అధికార పాలనావ్యవస్థకు ఒక నిరంతర అలవాటుగా మారిందని మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ విమర్శలు గుప్పించారు. భారతదేశం ఇంటిగ్రేటెడ్ క్షిపణి అభివృద్ధి 1983లో ప్రారంభమైందని, అది అద్భుత విజయాలు సాధించిందని అన్నారు. 1990వ దశకంలో ఒకానొక సమయంలో డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్, ఆయన సహచరులు డాక్టర్ శివథాను పిళ్లై తదితరులు సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైళ్ల కోసం రష్యన్ల సహకారం తీసుకోవడం అవసరమని భావించారని జైరామ్ రమేష్ వివరించారు. 1998లో ప్రధానమంత్రిగా ఐకె.గుజ్రాల్ ఉన్నప్పుడు ఒక అంతర్ ప్రభుత్వ ఒప్పందంపై సంతకం చేశారని, యాధృచ్ఛికంగా ఆయన 1976 నుండి 1980 వరకూ యుఎస్‌ఎస్‌ఆర్‌కు భారత రాయబారిగా ఉన్నారని తెలిపారు. అటల్‌బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మొదటి ఒప్పందంపై 199, జులై 19న సంతకం చేశారని చెప్పారు. 2001, జూన్ 12న మొట్టమొదటి ప్రయోగం విజయవంతమైందని జైరామ్ రమేష్ వివరించారు. బ్రహ్మోస్ ప్రధానకార్యాలయాన్ని 2004, డిసెంబరు 4న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రారంభించారని రమేష్ తెలిపారు.

# ప్రజా భద్రతకోసం పది ఉపగ్రహాలు పనిచేస్తున్నాయ్

### 2040 నాటికి భారత్‌కు సొంత అంతరిక్షకేంద్రం
### ఇస్రో చైర్మన్ నారాయణన్



**ఇంఫాల్ :** దేశ ప్రజల భద్రత, ప్రజల సంక్షేమానికి పూర్తి భరోసా ఇవ్వడానికి వ్యూహాత్మక ప్రయోజనాల నిమిత్తం పది ఉపగ్రహాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయని భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) చైర్మన్ డా.వి.నారాయణన్ చెప్పారు. భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య నాలుగు రోజులపాటు జరిగిన సైనిక ఘర్షణ, మే ఏడో తేదీన భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పూర్వరంగంలో ఆయన ప్రసంగం ప్రాధాన్యం సంతరించుకుంది. మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ, భారతదేశం ‘‘ఒక అంతరిక్ష మహాశక్తి’’గా రూపుదాలుస్తోందని, 2040 నాటికి భారతదేశం తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకుంటుందని చెప్పారు. ‘‘మనం దేశాన్ని భద్రంగా చూసుకోవాలంటే మన ఉపగ్రహాల ద్వారా సేవలు పొందాల్సిన అవసరం ఉంది. భారతదేశ ఉత్తరప్రాంత భూభాగాన్ని ఎంతో అప్రమత్తంగా కనిపెట్టుకుని ఉండాలి, మన దేశానికి ఏడువేల కిలోమీటర్ల విస్తారమైన సముద్ర తీర ప్రాంతం ఉంది, ఈ తీరప్రాంతాన్ని నిరంతరం కనిపెట్టుకుని ఉండాల్సి ఉంది, ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం లేకుండా, డ్రోన్ టెక్నాలజీ లేకుండా ఈ లక్ష్యాలను మనం సాధించలేమన్నారు. జి–20 దేశాల ప్రయోజనాలకోసం ఒక ఉపగ్రహాన్ని ఇస్రో అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ ఉపగ్రహం ద్వారా జి–20 దేశాలలో వాతావరణ మార్పుల అధ్యయనం, గాలి కాలుష్యం, శీతోష్ణస్థితిగతుల పర్యవేక్షణ చర్యలు చేపడతామన్నారు. ‘‘ఈరోజునాటికి భారతదేశం 34 దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించింది, ఆయా దేశాల అవసరాలకు అనుగుణంగా స్థిరకక్ష్యల్లోకి పంపింది, ఈ విషయాన్ని ఈ రోజున మీతో పంచుకోవడానికి నేనెంతో సంతోషపడుతున్నాను, పది ఉపగ్రహాలు దేశ ప్రజల భద్రత కోసం, వారి క్షేమాన్ని ఆశించి వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడేందుకు ఇరవైనాలుగు గంటలూ విరామం లేకుండా పనిచేస్తున్నాయి’’ అన్నారు. భారత్–పాకిస్థాన్ రెండు దేశాలూ శనివారంనాడు కాల్పుల విరమణ అవగాహనకు వచ్చాయి. దీంతో సైనిక ఘర్షణను తక్షణ ప్రాతిపదికపై రెండు దేశాలూ విజ్ఞతతో నిలిపివేశాయి. ఒక తరం ఉపగ్రహ ప్రయోగ వాహనాలను ఈ రోజున మన దేశం అభివృద్ధి చేసింది, 1975లో మన మొట్టమొదటి ఉపగ్రహ ప్రయోగం జరిగింది. ఈనాటి వరకూ మనం వివిధ రకాల సామర్థ్యంతో కూడి వివిధ రకాల 131 ఉపగ్రహాలను మనం నిర్మించాం, భారత్, అమెరికా దేశాలు రెండు సంయుక్తంగా అత్యంత ఖరీదైన, ముందుతరానికి కూడా ఉపయోగపడేవిధంగా భూ చిత్రాల ఉపగ్రహాలను నిర్మించబోతున్నాం, భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పటి నుండీ ఇప్పటివరకూ అసాధారణమైనరీతిలో పురోగతి సాధించింది’’ అని నారాయణన్ చెప్పారు. ‘‘మనదేశం స్వాతంత్ర్యం పొందేనాటికి దేశంలో 97.5 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన ఉన్నారు, వారి సగటు జీవన ప్రమాణాలు కూడా 32 సంవత్సరాలుగానే ఉండేది, కానీ ఈనాడు మన సగటు జీవన ప్రమాణాలు 72 సంవత్సరాలకు పెరిగింది, ప్రతిరంగంలోనూ భారతదేశం వృద్ధి సాధించింది’’ అని చెప్పారు. విద్యారంగంలో కూడా మన అక్షరాస్యత స్వాతంత్ర్యం నాటికి 12 శాతంగానే ఉండేది, ఆనాడు ప్రాథమిక పాఠశాలలు గట్టిగా చూస్తే 2,825 ఉండేవికావు, కానీ ఈనాడు మన ప్రాథమిక పాఠశాలలసంఖ్య 8.40 లక్షలకు చేరుకుంది, 1947లో మనదేశానికి ఎలాంటి అంతరిక్ష కార్యక్రమం లేద, 1962 నాటికి ప్రాథమికంగా మనం అంతరిక్షరంగ ప్రయాణానికి శ్రీకారం చుట్టాం, 1969వ సంవత్సరం భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ చరిత్రలో ఒక గొప్ప సంవత్సరం ఎందుకంటే ఆనాడు ఇస్రో ఆవిర్భవించింది, మనం మన అంతరిక్ష కార్యక్రమాలను ప్రారంభించేనాటికి పోల్చి చూసుకుంటే అభివృద్ధి చెందిన దేశాలకంటే 70 సంవత్సరాలు వెనకబడి ఉన్నాం, ఆనాడు మనకు ఎలాంటి ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం లేదు, ప్రతిరంగంలోనూ భారతదేశం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది, వ్యవసాయరంగం దేశంలో అత్యంత కీలకమైన పాత్ర నిర్వహిస్తుంది, దేశ వృద్ధిలో దానిదే కీలకపాత్ర’’ అని ఆయన చెప్పారు. ‘‘మీరు ఈరోజున తీసుకున్న డిగ్రీలు భారతదేశానికి ఎంతో ముఖ్యమైనవి, 2047 నాటికి వికసిత్ భారత్ అనే లక్ష్యాన్ని దార్శనిక ప్రయోజనాలను సాధించాలంటే మీరు కీలకపాత్ర నిర్వహించాలి, విద్యార్థులదే కీలకపాత్ర’’ అని నారాయణన్ చెప్పారు.

# కాల్పుల మోత లేదు

### ప్రశాంతంగా సరిహద్దు జిల్లాలు



**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ సరిహద్దుల్లోని నియంత్రణ (ఎల్‌ఒసి) వెంబడి, అంతర్జాతీయ సరిహద్దు (ఐబి) వెంబడి ప్రశాంతత నెలకొంది. ఆదివారం రాత్రి ఎలాంటి కాల్పుల మోత లేదు. జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్తాన్ సరిహద్దుల్లో ప్రజలు సాధారణ కార్యకలాపాలు సాగించారు. పంజాబ్‌లో ముందస్తు చర్యల్లో భాగంగా స్కూళ్లు, పాఠశాలలు మూసివేశారు. రాజస్థాన్‌లోని సరిహద్దు జిల్లాల్లో బ్లాక్ అవుట్ పాటించారు. కాగా, జమ్ముకశ్మీర్‌లో సరిహద్దు వెంట భారత్, పాకిస్థాన్ సైన్యాల మధ్య ఎటువంటి ఘర్షణలు లేవు. ఈ మేరకు భారత సైన్యం సోమవారం వెల్లడించింది. జమ్ముకశ్మీర్, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న ఇతర ప్రాంతాలలో రాత్రి చాలావరకు ప్రశాంతంగా ఉన్నట్లు ఒక సంక్షిప్త ప్రకటనలో తెలిపింది. ఇటీవలి రోజుల్లో తొలిసారి ప్రశాంత రాత్రిని చూసినట్లు తెలిపింది. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసేందుకు ఈనెల 7న ఆర్మీ ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. నాశనం చేయడానికి భారతదేశం మే 7 ప్రారంభంలో ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. అయితే భూమి, వాయు, సముద్రంలో అన్ని కాల్పులు, సైనిక చర్యలను ఆపడానికి భారత్, పాకిస్థాన్ శనివారం ఒక అవగాహనకు వచ్చాయని ప్రకటించాయి. అయినప్పటికీ శనివారం రాత్రి పాక్ సైన్యం కొన్ని ఉల్లంఘనలు చేసింది.

**పంజాబ్‌లోని కొన్ని జిల్లాల్లో స్కూళ్లు మూసివేత**

పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో సోమవారం సాధారణ పరిస్థితులు కనిపించాయి. మార్కెట్లు ప్రజలతో కిక్కిరిసిపోయాయి. అయితే ముందుజాగ్రత్త చర్యగా కొన్ని జిల్లాల్లో పాఠశాలలు మూసివేశారు. పరిస్థితి అదుపులో ఉందని, సరిహద్దు జిల్లాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయలేదని జిల్లా అధికారులు తెలిపారు. అయితే ఎటువంటి పుకార్లను నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని ప్రజలను కోరారు. పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ఫిరోజ్‌పూర్, ఫాజిల్కా, పఠాన్‌కోట్, అమృత్‌సర్, తర్న్ తరణ్, గురుదాస్‌పూర్ జిల్లాల్లోని పాఠశాలలు మూసివేశారు. పఠాన్‌కోట్, గురుదాస్‌పూర్‌లలో కళాశాలలు, విశ్వవిద్యాలయాలు కూడా మూశారు. అయితే, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించుకోవచ్చని గురుదాస్‌పూర్ అధికారులు తెలిపారు. సరిహద్దు జిల్లాల్లోని పఠాన్‌కోట్, పాకిస్థాన్ ప్రారంభించిన బహుళ డ్రోన్ దాడులను చూసింది, వాటిని భారత భద్రతా దళాలు తిప్పికొట్టాయి. ఫిరోజ్‌పూర్‌లో, సురక్షిత ప్రదేశాలకు వెళ్లిన గ్రామస్తులు తమ గ్రామాలకు తిరిగి వస్తున్నారు. సరిహద్దుకు సమీపంలోని జల్లోకె గ్రామానికి చెందిన దలేర్ సింగ్ మాట్లాడుతూ సమీప ప్రాంతాల నివాసితులు చాలా మంది తమ ఇళ్లను విడిచిపెట్టి వెళ్లిపోయారనిన్నారు. ఇప్పుడు వారిలో ఎక్కువ మంది తిరిగి వచ్చారని, అయితే జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారన్నారు. మొత్తంమీద, జీవితం సాధారణంగా మారింది, తాము తమ పొలాలకు తిరిగి వెళ్తున్నామని చెప్పారు. కాల్పుల విరమణ తర్వాత రద్దు చేయబడిన, స్వల్పకాలిక నిలిపివేసిన రైలు సర్వీసులను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. ఫిరోజ్‌పూర్, గురుదాస్‌పూర్, పఠాన్‌కోట్, మోగాలోని అధికారులు ఆదివారం సాయంత్రం ప్రజలు తమ ఇళ్ల వద్ద స్వచ్ఛందంగా లైట్లు ఆపివేయాలని, అవసరమైతే తప్ప బయటికి వెళ్లవద్దని సూచించారు.

**రాజస్థాన్ సరిహద్దు జిల్లాల్లో బ్లాక్ అవుట్**

భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం తరువాత ముందు జాగ్రత్త చర్యగా రాజస్థాన్ సరిహద్దు జిల్లాల్లో ఆదివారం రాత్రి పూర్తిగా బ్లాక్ అవుట్ విధించారు. బర్మేర్‌లో ఆకాశంలో డ్రోన్లుగా భావించిన రెడ్‌లైట్లు కనిపించాయని వార్తలు వచ్చాయి. ఇన్‌కమింగ్ డ్రోన్ కార్యకలాపాలు గుర్తించినట్లు జిల్లా యంత్రాంగం ఎక్స్‌ల ద్వారా హెచ్చరికలు జారీ చేసింది. దయచేసి అందరూ ఇళ్లలోనే ఉండి బ్లాక్ అవుట్‌ను పాటించాలని డిఎం బర్మేర్ విజ్ఞప్తి చేశారు. అయితే డ్రోన్‌ను పేల్చివేసినట్లు సోషల్ మీడియా వస్తున్నవి తప్పుడు పోస్టులు అని జిల్లా యంత్రాంగం తోసిపుచ్చింది. సోమవారం ఉదయం నాటికి, సరిహద్దు జిల్లాల్లో టీ స్టాళ్లు, దుకాణాల వద్ద ప్రజలు గుమిగూడి, సాధారణ సంభాషణల్లో పాల్గొనడంతో సాధారణ పరిస్థితి ఏర్పడినట్లు అనిపించింది. జైసల్మేర్ స్థానికుడు జలం సింగ్ మాట్లాడుతూ ఇప్పుడు పరిస్థితులు యథావిధిగా కనిపిస్తున్నాయని, రాత్రి ప్రశాంతంగా ఉందని చెప్పారు. రాత్రి జిల్లాలలో బ్లాక్‌అవుట్ సమయాలు మారుతూ ఉన్నాయి. జైసల్మేర్‌లో సాయంత్రం 7:30 నుండి ఉదయం 6 గంటల వరకు, బికనీర్‌లో సాయంత్రం 7 నుండి ఉదయం 5 గంటల వరకు, గంగానగర్‌లో సాయంత్రం 7 నుండి సూర్యోదయం వరకు, బర్మేర్‌లో రాత్రి 8 నుండి ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే, ముందు జాగ్రత్త చర్యగా సరిహద్దు ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు మూసివేశారు. భారత్–పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో భద్రతా దళాలు అప్రమత్తంగా ఉన్నా యి. ఏదైనా పరిస్థితిని ఎదుర్కొనేందుకు అన్ని జిల్లాలలో అన్ని ఏర్పాట్లు చేసిటన్లు జైపూర్‌లో హోం శాఖ అధికారి ఒకరు తెలిపారు.

## వయనాడ్ కొండచరియల బాధితులకు సకాలంలో పునరావాసం

### సిఎం పినరయ్ విజయన్ హామీ

**తిరువనంతపురం :** వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన బాధితులకు పునరావాస కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేస్తామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం హామీ ఇచ్చారు. బాధితుల వసతి కోసం నెలవారీ అద్దెను అత్యవసరంగా అందించాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. గత సంవత్సరం కొండచరియలు విరిగిపడిన వయనాడ్‌లోని ముండక్కై, చూరల్‌మల గ్రామాల నుండి ప్రాణాలతో బయటపడిన వారి కోసం ప్రతిపాదిత టౌన్‌షిప్ నిర్మాణ పనుల పురోగతిని అంచనా వేయడానికి జరిగిన సమావేశంలో ఆదేశాలు జారీ చేసిటన్లు సిఎంఒ తెలిపింది. టౌన్‌షిప్ నిర్మాణానికి పరిపాలనా, సాంకేతిక, ఆర్థిక అనుమతులు పొందేందుకు కాలపరిమితి నిర్ణయించినట్లు వెల్లడించింది. ముండక్కై, చూరల్‌మలలో కొండచరియలు విరిగిపడిన వారికి పునరావాసం సకాలంలో పూర్తవుతుందని సమావేశం తర్వాత విజయన్ చెప్పినట్లు ప్రకటనలో అధికారులు ఉటంకించారు. ముఖ్యమంత్రితో పాటు, కేబినెట్ మంత్రులు కె రాజన్, కె ఎన్ బాలగోపాల్, ప్రధాన కార్యదర్శి ఎ జయతిలక్ మరియు ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారని సిఎంఒ ప్రకటనలో తెలిపింది.


IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHUPALPALLY
O.S.No. 79 OF 2025

Between:-

1. Vakula Rammurti Vanamamula, W/o. Rammurti Vanamamula. Age: 77 yrs. Occu: Household, R/o. Ankisa, Rangadhampeth, Gadchiroli, Sironcha, Maharastra.
2. Pullakandam Indira. W/o. Rangaiah. Age: 62 yrs. Occu: Household, R/o.Nallabelli village & Mandal, Warangal Dist., Telangana - 506349.
3. Thirunahari Venkatramnarsaiah. S/o, Late. Lakshminarsaiah, Age: 57 yrs, Occu: Agril, R/o. Ghanpur(M) village & Mandal, Jayashankar Bhupalpally Dist., Telangana - 506345.
4. Thirunahari Jitender Swamy. S/o. Late. Thirunahari Laxmi Narsaiah, Age: 53 yrs. Occu: Govt. Employee, R/o. Ghanpur(M) village & Mandal, Jayashankar Bhupalpally Dist., Telangana - 506345.
5. Ramanujapuram Sumathi, W/o.Late. Anjaneyulu, Age: 50 yrs, Occu: Household. R/o. Shanthi Nagar, Balaji Nagar, Jawaharnagar, K.V. Rangareddy. Telangana - 500087.

... Plaintiffs

AND

1.The State of T.G. Represented by the District Collector. Jayashankar Bhupalpally district
2.The Tahasildar, Ghanpur (M) Mandal
3. Whom so ever it may concern

... Defendants

PUBLIC NOTICE

To.
Whom so ever it may concern

Please take notice that the above named plaintiffs filed the suit for declaring them as legal heirs of late. Kum. Thirunahari Venkataramana, D/o. Late. Thirunahari Laxmi Narsalah, R/o. H.No. 5-62, Ghanpur(m) Village & Mandal. Jayashankar Bhupalpally District, who died on 18.10.2024. If any person or persons having any objection with regard to declaring the plaintiffs as legal heirs of Late. Kum.Thirunahari Venkataramana, they may file objections either in person or through an advocate before the Hon'ble Court on **10.06.2025 at 10-30 A.M,** and if no such objections are filed or received in the above suit, the matter will be decided on merits as per law.

//By order of the court//

Sd/-
CH.VENUGOPALA CHARY,
RAJENDER CH,
ADVOCATES
#Opp: District Court Complex.
Mulugu Town & District.
Phone No. 9908983854.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు

పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులు, భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సిద్ది పేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదవుతుందన్నారు.

## లైన్‌మెన్ నుంచి సిఎండి వరకూ ఒక్కటే యూనిఫామ్

అందరికీ అందుబాటులో ఉంటా..

విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది ముఖాముఖిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అందరూ ఒకటే అనే భావనను కల్పించేందుకు డిస్కం కంపెనీలో పని చేస్తున్న లైన్‌మెన్ నుంచి సిఎండి వరకు ఒకే తరహా యూనిఫామ్ విధానాన్ని తీసుకురావాలని యోచిస్తున్నామని డిప్యూటీ సిఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నిఫ్టుతో డిజైన్ చేయించి విద్యుత్ సిబ్బందికి డ్రెస్సులను అందజేస్తామని ప్రకటించారు.విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం స్పందిస్తుందని, వాటిని పరిష్కరిస్తుందని హామీనిచ్చారు. యజమాన్యం తో పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని విద్యుత్ సిబ్బందికి భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం రాత్రి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్, మెయింటెనెన్స్ సిబ్బందితో భట్టి విక్రమార్క మల్లు సోమవారం ముఖాముఖి అయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇంధన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ,ట్రాన్స్‌కో ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ భాస్కర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినప్పటికీ క్షణం కూడా అంతరాయం లేకుండా నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేసే స్థాయికి తెలంగాణ రాష్ట్రం ఎదగడానికి కారణం, అకుంఠిత దీక్ష, నిబద్ధతతో సిబ్బంది ఒక కుటుంబం తరహా పనిచేయడం వల్లనే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కరెంటు ఉండబోదని దుష్ప్రచారం చేసిన వారి చెంపపెట్టు తరహాలో అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేశారన్నారు. ఈ ఏడాది మార్చిలో 17,162 మెగావాట్లకు పైగా పిక్ డిమాండ్ వచ్చినప్పటికీ ఒక్క నిమిషం అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేశారని గుర్తు చేశారు. ఉన్నత స్థాయిలో తాను, యజమాన్యాలు తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఉద్యోగుల సేవలను గుర్తించి, అభినందించేందుకే ముఖాముఖి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు భట్టి వివరించారు. ప్రజల కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న సిబ్బందిని ప్రజా ప్రభుత్వం ఎప్పటికీ ప్రోత్సహిస్తుందని అందులో భాగంగానే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యను అధికారులంలోకి రాగానే పరిష్కరించి వేల మందికి పదోన్నతులు కల్పించామన్నారు. తమది నాలుగు గోడల మధ్య నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం కాదని,తమ ప్రతి ఆలోచనను అందరితో పంచుకుంటామని, అందరి ఆలోచనలతోనే నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధితో త్వరితగతిన అభివృద్ధి చెందే రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం నమోదు కానుందన్నారు.

## సాగర్ అందాలు వీక్షించిన సుందరీమణులు

బుద్ధవనాన్ని సందర్శించిన 22 ఆసియా దేశాల సుందరీమణుల పోటీదారుల బృందం

ఘనంగా స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్‌పి శరత్‌చంద్ర పవార్






**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** తెలంగాణ రాజధాని హైద్రాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీమణుల పోటీలలో పాల్గొంటున్న ఆసియా దేశాలకు చెందిన 22మంది సుందరీమణుల బృందం సోమవారం నల్లగొండ జిల్లా బుద్ధవనాన్ని సందర్శించింది. ప్రపంచ సుందరీమణులకు నల్గొండ జిల్లా యంత్రాంగం ఘనంగా ఆతిథ్యమిచ్చింది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో విజయవిహార్ వద్ద వారికి ఘనంగా స్వాగతం పలికింది. ముందుగా సుందరీమణుల బృందం నాగార్జునసాగర్ తీరాన ఉన్న విజయ విహార్‌లో ఫోటోలు దిగారు. అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పూలతో పూజలు చేసి మహా స్థూపంలో జ్యోతులు వెలిగించి ధ్యానంలో పాల్గొన్నారు. మహాస్థూపం వద్ద ప్రపంచ సుందరీమణులకు లంబాడా కళాకారులు లంబాడా నృత్యంతో ఘనస్వాగతం పలికారు బుద్ధవనం ప్రాముఖ్యత, బుద్ధుడి జననం నుండి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలు ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి వివరించారు. అనంతరం జాతక వనంలో బుద్ధ చరితంపై కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు.

జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్‌పి.శరత్ చంద్రపవార్, ఎంఎల్‌ఎలు కుందూరు జయవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, ఎంఎల్‌సి శంకర్ నాయక్ తదితరులు మాట్లాడుతూ బుద్ధవనం, నాగార్జున సాగర్ ప్రాముఖ్యతను, తెలంగాణ గొప్పతనాన్ని వివరించారు. ఐఎఎస్ అధికారి లక్ష్మి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఎఎస్‌పిలు రమేష్, మౌనిక, ఆర్‌డివోలు, జిల్లా అధికారులు హాజరయ్యారు.

**నేడు చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించనున్న 109 దేశాల మిస్ వరల్ కంటెస్టెంట్స్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మిస్ వరల్డ్‌లో పాల్గొనడానికి వచ్చిన 109 దేశాల కంటెస్టెర్లు మంగళవారం నాడు ప్రపంచ ప్రఖ్యాత చార్మినార్ వద్ద హెరిటేజ్‌వాకింగ్ నిర్వహిస్తారు. చార్మినార్ వద్దకు చేరుకునే 109 దేశాల సుందరీమణులకు పాత బస్తీలో పాపులర్ అయిన మార్ఫా వాయిద్యాలతో స్వాగతం పలుకనున్నారు. చార్మినార్ వద్ద ప్రత్యేకంగా ఫోటోషూట్ నిర్వహిస్తారు. అనంతరం చార్మినార్ సమీపంలోని చుడీ బజారులో ఎంపిక చేసిన తొమ్మిది దుకాణాల్లో వివిధ రకాల గాజులు, ముత్యాల హారాలు తదితర అలంకరణ వస్తువుల షాపింగ్ నిర్వహిస్తారు.

## మెడికల్ షాపులపై డ్రగ్స్‌కంట్రోల్ దాడులు

ఆరు నకిలీ ఔషధాలను గుర్తించిన అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా పలు మెడికల్ షాపులపైన తెలంగాణ రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) బృందం సోమవారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించింది. ఔషదలపైన ఉన్న'బార్ కోడ్ / క్యూఆర్ కోడ్ 'లను పరిశీలించింది. మొత్తంగా 296 మెడికల్‌షాపులను తనిఖీ చేయగా, ఇందులో ఆరు నకిలీ ఔషదాలను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని పరిశీలించి చట్ట ప్రకారం చ ర్యలు తీసుకుంటామని డిసిఎ డైరక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం తెలిపారు. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అయితే సుమారు మూడువందలకు సంబంధించిన ఔషదాల బ్రాండ్స్‌ను డిసిఎ విడుదల చేసింది. ముఖ్యంగా ఔషాదలను కొనుగోలు చేసే ముందే ఆ ఔషదాలపైన ఉన్న బార్‌కోడ్స్‌ను పరిశీలించి తీసుకోవాలని డిసిఎ జాయింట్ డైరక్టర్ జి.రామ్‌దాన్ సూచించారు. డిసిఎ ఆకస్మిక తనిఖీలలో ఈసారి నకిలీ మందులు, కాలం చెల్లిన నిల్వలు లభించలేదని, అయినప్పటికీ తాము నిరంతరం దాడులను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇకపై క్యూఆర్ కోడ్‌డను పరిశీలిస్తామని స్పష్టం చేశారు. నాణ్యమైన ఔషదాలు అందుబాటులో ఉండేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

## దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

త్రిసభ్య కమిటీతో తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చర్చలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఖజానా పై తక్షణ భారం పడని 24 అంశాలను తొలుత పరిష్కరించి,ఆ తర్వాత ఆర్థిక భారం పడే మిగిలిన 14అంశాలను దశల వారీగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఛైర్మన్ నవీన్‌మిట్టల్‌తో సోమవారం తెలంగాణ ఉద్యోగుల జెఎసి ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కాంటిజెంట్ ఉద్యోగులు,పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఇటీవల తెలంగాణ ఎంప్లాయిస్ జెఎసి సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను,అత్యవసర, ఆర్థికేతర, ఆర్థిక సమస్యలుగా మూడు విభాగాలుగా కమిటీకి అందజేశారు.

ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, నూతన పెన్షన్ విధానం(సిపిఎస్ ) రద్దు చేసి, పాత పెన్షన్‌ను పునరిద్దంచాలని,అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, 317 జిఒ ద్వారా మరిన్ని బదిలీలకు అవకాశం కల్పించాలని ప్రతినిధి బృందం నవీన్‌మిట్టన్‌ను కోరింది. రూ.10 లక్షల లోపు బిల్లులను ఈ కుబేర్ ద్వారా క్లియరెన్స్ చేయాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇహెచ్ఎస్) ద్వారా క్యాష్‌లెస్ వైద్య చికిత్స అందించాలని, సాధారణ బదిలీలు,ఎన్నికల సమయంలో బదిలీ అయిన అధికారుల పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని జెఎసి ప్రతినిధి బృందం కోరింది. 61 సంవత్సరాలు దాటిన విఆర్ఎకు అర్హత ఆధారంగా జిపిఒ పోస్టులను ఎంచుకునే అవకాశం ఇవ్వాలని, అన్ని శాఖలల్లో క్యాడర్ వారీగా ఖాళీలను వెంటనే భర్తీ చేసి, ప్రమోషన్ లేదా నేరుగా నియామించాలని తెలిపారు.

జెఎసి నాయకులు కె.రామకృష్ణ, డాక్టర్ నిర్మల, ఎస్.రాములు, బాణాల రాంరెడ్డి, రమేష్ పాక, హన్మంతరావు, సిపిఎస్ దర్శన్ గౌడ్, సల్మాన్ నాయక్, శశిధర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, రవికుమార్, చంద్రశేఖర్ గౌడ్, హరికిషన్, వెంకట్, గోపాల్, హబీబ్ మస్తాన్, లక్ష్మ య్య పులి, హేమలత, సుగంధిని, తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ఉగ్రవాద ముఠా నాయకుడు

ఆయనతో స్నేహం భారత్‌కు మంచింది కాదు : వివిఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ఉగ్రవాద ముఠా నాయకుడని, ఆయనతో స్నేహం అత్యంత ప్రమాదకరమని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం గ్రహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు పాకిస్తాన్‌తో భారత్ యుద్ధంపై ట్రంప్ మధ్యవర్తిత్వంతో అది ముగిసినట్టుగా ట్రంప్ ప్రకటించుకోవడం భారతదేశానికి తలవంపు అన్నారు. ట్రంప్ భారతదేశంతో మరీ ప్రత్యేకంగా ప్రధాన మంత్రి మోదీతో స్నేహంగా ఉన్నట్లు నటిస్తూనే పాకిస్తాన్‌కు పూర్తి సహకారం అందిస్తున్నట్టుగా ఈ యుద్ధం ద్వారానైనా మోడీ అర్థం చేసుకుంటే మంచిదని ఆయన హితువు పలికారు. ఏ ప్రాంతంలోనైనా ఉగ్రవాదాన్ని ఎవరు ప్రోత్సహిస్తే వారే ఆ ఉగ్రవాదాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత వహించాలని ఐక్యరాజ్య సమితిలో తీర్మానం చేసేలా భారత ప్రభుత్వం కృషి చేయాలి. యుద్ధం ఎవరితో వచ్చినా 140 కోట్ల మంది భారతీయులు కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ఒకే మాట, ఒకే బాటగా ప్రభుత్వానికి అండగా నిలుస్తారని తెలియజేశారు. భారతదేశ ప్రజల మద్దతును రాజకీయ ప్రయోజనాల కోసం ఏ ప్రభుత్వం వాడుకున్నా ప్రజలు సహించరని బోస్ హెచ్చరించారు.

## 'విద్యా రంగంలో సంస్కరణలు' సబ్‌కమిటీ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'విద్యా రంగంలో సంస్కరణలు' అనే అంశంపై నియమించిన మంత్రివర్గ ఉప సంఘం సోమవారం సచివాలయంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు యోగితా రాణా, దేవ సేన, హరిత, నర్సింహా రెడ్డి, కృష్ణాదిత్య, ట్రస్మా ప్రతినిధులు ఎస్ఎన్ రెడ్డి, మధుసూదన్, హెచ్ఎస్‌పిఎ ప్రెసిడెంట్ వెంకట సాయినాథ్, ఇస్మా ప్రతినిధులు సునీల్ కుమార్, వైసీ చౌదరి, ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నుంచి అన్వర్ అహ్మద్, క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలశౌరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో పేరు, గౌరవం సంపాదించిన గొప్ప నాయకుడు నాయిని : కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాజకీయాల్లో పేరును, గౌరవాన్ని సంపాదించుకున్న గొప్ప నాయకుడు నాయిని నర్సింహ రెడ్డి అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ మంత్రి నాయిని నరసింహారెడ్డి జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయిని చిత్రపటానికి కెటిఆర్‌తో పాటు పలువురు పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ రెండు దశాబ్దాల పాటు కెసిఆర్‌కు నాయిని ఒక సోదరునిగా కలిసి పని చేశారన్నారు. ఉద్యమ కాలంలో పార్టీ నేతలందరికీ నాయిని స్ఫూర్తినిచ్చిన వ్యక్తిగా నిలిచారన్నారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో పార్టీ నిర్ణయం ప్రకారం అమెరికా నుంచే తన చేతిరాత ద్వారా మంత్రి పదవికి నాయిని రాజీనామా చేశారన్నారు. నాయిని కుటుంబానికి పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటానని కెటిఆర్ భరోసనిచ్చారు. శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్ .మధుసూదనా చారి మాట్లాడుతూ నాయిని నరసింహరెడ్డి విలువలతో కూడిన రాజకీయాలు చేశారన్నారు. హైదరాబాద్ అనగానే కొందరు నాయకులు గుర్తొస్తారని,అందులో నాయిని ఒకరని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎంఎల్ఎ ముఠాగోపాల్,నాయిని కుటుంబ సభ్యులు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు జయసింహ, ఎం.ఎన్ శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ నాయకులు నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎండిఎ పరిధిలో భూముల వేలానికి రంగం సిద్ధం


మౌలిక సౌకర్యాల ప్రాజెక్టుల నిధుల సమీకరణకు భూముల వేలం

కన్సల్టెట్‌లను ఆహ్వానించిన హెచ్‌ఎండిఎ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల విక్రయానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఏ భూమి అమ్మాలి?, ఎంతకాలం లీజుకు ఇవ్వాలి?, ఏది అభివృద్ధికి పక్కా అనుకూలం? అనే అంశాలపై కన్సల్టెంట్‌ల సహకారం తీసుకోనుంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండిఏ) తాజాగా రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ నోటిఫికేషన్‌తో కన్సల్టెట్‌లను ఆహ్వానించింది. హెచ్‌ఎండిఏ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను విక్రయం, లీజు, వ్యాపారం ద్వారా మోనిటైజ్ చేయాలని హెచ్‌ఎండిఏ యోచిస్తోంది. దీనివల్ల వివిధ ప్రాజెక్టుల పెట్టుబడి వ్యయాలు, నిర్వహణ ఖర్చులు తిరిగి పొందాలని లక్ష్యంగా నిర్ధేశించుకుంది. కన్సల్టెంట్ ప్రధానంగా ప్రభుత్వ భూముల ప్రాంతాలు, పరిమాణాలను ప్రాధాన్యంగా గుర్తించాల్సి ఉంటుంది. నగర అభివృద్ధికి నిధులు సమీకరించేందుకే ఈ ఆస్తుల మోనిటైజేషన్‌కు శ్రీకారం చుట్టినట్టు స్పష్టం చేస్తోంది. హెచ్‌ఎండిఏ, ప్రభుత్వానికి చెందిన భూములను అభివృద్ధి, లీజు, వేలం కోసం ఎంపిక చేయాలి. ఎంపికైన ఏజెన్సీ హెచ్‌ఎండిఏ భూముల వివరాలు సేకరించి, వాటి యాజమాన్య హక్కులు, జోనింగ్ నిబంధనలు, భూమి వినియోగం, ప్రస్తుత మౌలిక సదుపాయాల సమాచారాన్ని పరిశీలించి, ధృవీకరించాలి. అలాగే మాస్టర్ ప్లాన్లు, అభివృద్ధి నియంత్రణ నిబంధనలపై సమీక్ష చేసి, అభివృద్ధికి అనుమతులు, పరిమితులు గుర్తించాలి. ప్రభుత్వ భూములను అమ్మకం, లీజు, జాయింట్ డెవలప్‌మెంట్ రూపంలో వేలం వేసి నిధులు సమకుర్చుకోనుంది. ఈ నిధులతో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకుంది. ఇందుకోసం ఈనెల 27 వరకు బిడ్లు ఆహ్వానించింది. భూముల యాజమాన్య హక్కులు, జోనింగ్ నిబంధనలు, మౌలిక వసతులు అన్నింటిని ఈ కన్సల్టెంట్ అధ్యయనం చేస్తుంది.

## ఖరీఫ్‌కు అధికారులంతా సన్నద్ధం కావాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులంతా సన్నద్ధం కావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. విత్తనాలు, ఎరువులు, ఇతర అంశాలకు సంబంధించి రైతులకు ఇలాంటి ఇబ్బందులు కల్గకుండా పక్కా ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ, సహకార శాఖల ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మలనాగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వచ్చే ఖరీఫ్ సన్నాహాలు, విత్తనాల సరఫరా, ఎరువుల నిల్వలు వంటి కీలక అంశాలపై అధికారులతో చర్చించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ యూరియా, విత్తనాల సరఫరాలో రైతులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కావాల్సినంత పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి మండలంలో విత్తనాల సరఫరా స్థితిని పర్యవేక్షించాలి. ఖరీఫుకు అవసరమైన వర్షాధార పంటల మార్గదర్శకాలు రూపొందించాలి అని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, సహకార, మార్కెటింగ్ శాఖ అధికారులు, అగ్రికల్చర్, హార్టికల్చర్ యూనివర్సిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఖరీఫ్ సాగులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే తయారుచేసిన సంయుక్త కార్యచరణ ప్రణాళిక ప్రకారం ముందకు సాగాల్సిందిగా ఆదేశించారు.

**మద్దతు ధరను ప్రకటించిన ప్రతి పంటను కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి :** కేంద్ర ప్రభుత్వం అనేక పంటలకు మద్ధతు ధర ప్రకటించి, అక్కడితో తమ బాధ్యత పూరైనట్లు వ్యవహరించడం సరికాదని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. కేంద్రం కేవలం ఒకటి, రెండు పంటలు తప్పితే మిగతా అన్ని పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేయడం వల్ల, రైతుల దగ్గర పంటలను మద్ధతు ధరకు సేకరించే తెలంగాణ లాంటిరాష్ట్ర ప్రభుత్వాలపై అధికంగా భారం పడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి, మార్కెటింగ్ డైరెక్టర్ సురేంద్రమోహన్ ,సీడ్ కార్పోరేషన్ ఎండి యాస్మిన్ బాషా,వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్ లర్ అల్దాస్ జానయ్య, కొండా లక్ష్మ ణ్ బాపూజి ఉద్యానవన విశ్వవిద్యాలయ ఉపకులపతి రాజిరెడ్డి, ఇతర వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## త్వరితగతిన భూ సమస్యలు పరిష్కరించాలి : మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూభారతి చట్టాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న మద్దూర్, లింగంపేట, వెంకటాపూర్, నెలకొండపల్లి నాలుగు మండలాల్లో స్వీకరించిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి, త్వరితగతిన భూ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏదైనా దరఖాస్తులను తిరస్కరించాల్సి వస్తే వాటిని లోతుగా, క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని, దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పెట్టాలని సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోని దరఖాస్తులు, ప్రధాన సమస్యలపై చర్చించి, నెలాఖరు వరకు ఒక పరిష్కారానికి రావాలని, దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ఇతర ప్రాంతాల నుంచి అవసరమైన నైపుణ్యవంతులైన సిబ్బందిని పంపించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్‌ను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. 'భూభారతి' అమలుతీరుపైన 'ములుగు, కామారెడ్డి, ఖమ్మం, నారాయణ పేట' జిల్లా కలెక్టర్లతో మంత్రి పొంగులేటి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో తీసుకొచ్చిన భూభారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారానికి మార్గం సులువు అయిందన్నారు. ఈ సమావేశంలో సిసిఎల్ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మకరంద్ పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్ బందీని విడుదల చేసిన హమాస్


నేడు ట్రంప్ పశ్చిమాసియా పర్యటన

**దేర్ అల్‌బలాహ్ :** గాజాలో 19 నెలల పాటు బందీగా ఉన్న ఇజ్రాయెల్ –అమెరికన్ సైనికుడు ఎడాన్ అలెగ్జాండర్‌ను హమాస్ సోమవారం నాడు విడిచిపెట్టింది. ఇజ్రాయెల్‌తో నూతన కాల్పుల విరమణ ఒప్పందానికి బాటలు వేసేందుకు వీలుగా ట్రంప్ ప్రభుత్వంతో సహృద్భావానికి సూచనగా ఈ నిర్ణయం తీసుకుంది. హమాస్ ఎడాన్ అలగ్జాండర్‌ను రెడ్‌క్రాస్‌కు, ఆ సంస్థ తమకు అప్పగించినట్లు ఇజ్రాయెల్ ధృవీకరించింది. మార్చ్‌లో ఎనిమిదివారాల కాల్పుల విరమణను ఇజ్రాయెల్ ఉల్లంఘించిన తరువాత బందీని విడుదల చేయడం ఇదే తొలిసారి. కాల్పుల విరమణ ఉల్లంఘన తరువాత గాజా చుట్టూ సరిహద్దులను మూసివేసిన ఇజ్రాయెల్, పాలస్తీనకు మానవతాసాయాన్ని కూడా అడ్డుకుంది. దీంతో మానవ సంక్షోభం ఏర్పడి కరువు ప్రమాదం ఏర్పడింది. ఇజ్రాయెల్ నిబంధనల ప్రకారం కాల్పుల విరమణకు అంగీకరించాలని పాలస్తీనాను వత్తిడి చేసేందుకు ఇలా చేసినట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. హమాస్ ఆధీనంలో మొత్తం 250 మందిలో 58 మంది బందీలు మిగిలి ఉండగా, అందులో 23 మంది బతికి ఉన్నట్లు ఇజ్రాయెల్ తెలిపింది.

## సిఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తే.. కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరు

బిజెపి అధ్యక్ష పదవి దక్కలేదన్న ఆక్రోశంలో ఈటల రాజేందర్ నోటికొచ్చింది మాట్లాడుతున్నారు

టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కలేదన్న ఆక్రోశంతో ఈటల రాజేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఆయన మాటలు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని విమర్శించారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణ దివాలా తీయడానికి కారణమైన మాజీ సిఎం కెసిఆర్ అలీబాబా చోరిస్‌లో ఈటల రాజేందర్ ఒకరని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో రాజకీయ అనుభవం ఉండి సిఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడం దారుణమన్నారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఎంపి ఎం.అనిల్‌కుమార్ యాదవ్, టిపిసిసి నాయకులు కొమురయ్య, నిజాముద్దీన్, ఇందిరా శోభన్, భాస్కర్ యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ హైడ్రా గురించి మాట్లాడే ఈటల దేవాదాయ శాఖ భూములను కబ్జా చేశారని కేసు ఉన్న విషయం మర్చిపోయారా అని నిలదీశారు. బిఆర్ఎస్ హయంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల ఉండగానే రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందన్నారు. బిసి బిడ్డవై కెసిఆర్‌కు అడుగులకు మడుగులు వత్తి, చివరకు మోసపోయి గత్యంతరం లేని పరిస్థితుల్లో బిజెపిలో చేరారని ఎద్దేవా చేశారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో చేతగాని, దద్దమ్మ మంత్రులుగా ఉన్నటువంటి ఈటల.. సీఎం రేవంత్ గురుంచి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రైతు రుణ మాఫీ, 60 వేలకు పైగా ఉద్యోగాలు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్న బియ్యం పంపిణీతో పాటు విద్య, వైద్యం, పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పడిపోతుందని ఈటల రాజేందర్ ప్రభుత్వంపై విషప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి బిజెపి నేతలు అడుగడుగునా అడ్డ పడుతున్నారని మహేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపిలో ఆధిపత్యం కోసం ఈటల రాజేందర్, బండి సంజయ్ ఏం మాట్లాడుతున్నారో వారికే అర్థం కావడంలేదన్నారు. బిసి బిడ్డలుగా ఉండి బిసి బిల్లు పట్ల కక్షపూరిత వైఖరిని అవలంబిస్తున్న బిజెపి నేతల తీరు జీర్ణించుకోలేని విధంగా ఉందన్నారు. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపుతూ సద్విమర్శలు చేయలేగానీ స్వార్థంతో నోటికొచ్చింది మాట్లాడితే సహించే ప్రసక్తే లేదని మహేష్‌కుమార్ స్పష్టం చేశారు.

## ఘనంగా అనంతపద్మనాభ స్వామి కల్యాణం



**ప్రజాపక్షం/కొత్తూరు :** భక్తిశ్రద్ధలతో అనంతపద్మనాభ స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో ఉన్న శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్ పర్సన్ బెజవాడ అనితారెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, మామిడి సిద్దార్థరెడ్డిలతోపాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధి అవకాశాలు అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** యువత స్వయం ఉపాధి అవకాశాలు అలవర్చుకోవాలని హస్తినాపురం డివిజన్ మాజీ వార్డు మెంబర్ సయ్యద్ పాష అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ జడ్పీ రోడ్‌లోని భవిష్య స్కూల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ బజార్ సూపర్ మార్కెట్‌ను ఆయన నిర్వహకులు ఎండి నజీర్, చాంద్ బాషాలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సయ్యద్ పాష మాట్లాడుతూ నాణ్యతతో కూడిన వస్తువులను ప్రజలకు అందించాలని, సరసమైన ధరలకు వినియోగదారులకు అందించి వారి నుంచి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అల్తాఫ్, రమేష్, మోయిన్, హకీం తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి, బాధ్యతతో పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులకు సూచించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగరంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కమిషనర్ వినతులు స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపించి, తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు బాధ్యతగా పరిశీలించి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వేణుగోపాల్, చంద్రకాంత్‌రెడ్డి, ఎస్.పంకజ, వేణుగోపాల్ రెడ్డి, రఘు ప్రసాద్, అశోక్ సామ్రాట్, నళిని పద్మావతి, టౌన్‌ప్లానింగ్ అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్ కుమార్, గంగాధర్, వెంకన్న, ఉమాదేవి, శైలజ తదిరులు పాల్గొన్నారు.

### సికింద్రాబాద్ జోన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

సికింద్రాబాద్ జోన్‌లో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ పరిశీలించారు. తార్నాక, చిలకలగూడ, పాటిగడ్డ, రసూల్ పుర, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించారు. తార్నాక జంక్షన్ ఐల్యాండ్ నిర్మాణ పనులతో పాటు పచ్చదనం అభివృద్ధి పనులు, చిలకలగూడలో హెచ్‌సిటీ ద్వారా నిర్మించ తలపెట్టిన ఆర్‌యుబి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణ వ్యర్థాలను రోడ్లు, బహిరంగ ప్రదేశాలలో వేసే వారిపై జరిమానాలు విధించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఏఓసి, హెచ్ సిటీ ప్రతిపాదిత రోడ్డును తనిఖీ చేశారు. రసూల్‌పుర హెచ్ సిటీ ఫ్లైఓవర్ ప్రతిపాదిత స్థలాన్ని, అలైన్‌మెంట్ పనులను, పాటిగడ్డ ఆర్‌ఓబి, హెచ్ సిటీ ఫ్లైఓవర్ రోడ్డు విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. ప్రకాష్ నగర్ ఐఓసి బంక్, హెచ్‌పిఎస్ సమీపంలోని వాటర్ లాగింగ్ పాయింట్‌లను పరిశీలించి, తక్షణమే పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఆస్తి పన్నుకు సంబంధించి ఫీల్డ్ డేటా, జిఐఎస్ డేటా, స్కెచ్ ఆధారంగా పూర్తి స్థాయి నివేదికను ఒక వారంలోగా అందించాలని జోనల్, డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. పర్యటనలో కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ ఎన్.రవి కిరణ్, సికింద్రాబాద్ సర్కిల్ ఏసిపి శ్రీనివాస్‌రావుతో పాటు జిహెచ్‌ఎంసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశరక్షణలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్లకు నివాళి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** దేశరక్షణలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ సిపిఐ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో వీరమరణం పొందిన మురళి నాయక్, దినేష్ కుమార్, సునీల్ కుమార్, సురేందర్, పవన్, సూరజ్ వారి చిత్రాపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించి, హయత్ నగర్‌లో విజయవాడ జాతీయ రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్‌బి నగర్ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణలో సైనికుల పాత్రను కొనియాడుతూ, వారి నిస్వార్థ సేవకు యావత్ దేశం రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శి మర్రి శోభన్, బొంగు అరుణ్ కుమార్ గౌడ్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి రమావత్ సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 14 నుంచి సాహెబ్‌నగర్‌లో త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సాహెబ్ నగర్‌లో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగే త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని సోమవారం ఒక ప్రకటనలో గ్రామస్తులు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం కూడా జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. జాతర మహోత్సవాన్ని గ్రమస్తులు, భక్తులు, ప్రతి ఒక్కరూ జాతర ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారి కృపకుపాత్రులు కాగలరని వారు కోరారు. భక్తులకు, ప్రజలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని వారు తెలిపారు.

## కాలనీలలో మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాలి : బిఆర్‌ఎస్




**ప్రజాపక్షం/గండిపేట :** కాలనీలలో మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాలని మణికొండ బిఆర్‌ఎస్ నాయకులు కోరారు. సోమవారం నెక్నంపూర్ పరిధి అల్కాపూర్ రోడ్డు 2 ,3 పరిసర ప్రాంత ప్రజలతో మమేకమై వారు ఎదుర్కుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ్ల మాట్లాడుతూ జలమండలి అధికారులు సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, బొమ్ము ఉపేందర్నాథ్ రెడ్డి, ఏర్పుల శ్రీకాంత్, యాలాల కిరణ్, భానుచందర్, సుమ నళిని,బొడ్డు శ్రీధర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి



**ప్రజాపక్షం/షాబాద్:** గ్రామ ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని మాజీ జడ్పీటిసి పట్నం అవినాష్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో నాన్‌దార్‌ఖాన్ పేట్ గ్రామస్తులు కలిసి ఈ నెల 19 బొడ్రాయి పండగకు రావాలని ఆహ్వానించారు. అనంతరం ఆయన స్పందిస్తు గ్రామంలో బొడ్రాయి పండగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. నా వంతు సహాయంగా లక్ష రూపాయాలు నగదు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నాన్‌దార్‌ఖాన్‌పేట్ గ్రామస్తులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ పొన్న నరసింహ్మారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.95లక్షల విలువైన సెల్‌ఫోన్ల రికవరీ : డిసిపి క్రైమ్స్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మొబైల్ ఫోన్‌లను రికవరీ చేయడంలో సైబారాబాద్ కమిషనరేట్ పరిధిలోని సిసిఎస్ అధికారుల పని తీరు అద్భుతమని సైబారాబాద్ డిసిపి క్రైమ్స్ ఎలోసి నాయక్ తెలిపారు. సైబారాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎక నెలలో జరిగిన సెల్‌ఫోన్ల చోరిలలో రూ.95 లక్షల విలువ చేసే మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని ఆయన తెలిపారు. సోమవారం కమీషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సైబారాబాద్ కమిషనరేట్ పరిధీలోని శంషాబాద్ సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ పవన్, బాలానగర్ సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ రాజు, మాదాపూర్ ఐటి సేల్ ఇన్స్‌పెక్టర్ అంజనేయులు, మేడ్చల్ సిసిఎస్ ఇన్స్‌పెక్టర దాలినాయుడు, రాజేందర్ నగర్, శంషాబాద్ జోన్‌ల పరిధిలలో 310 కేసులు అన్‌లైన్ ద్వార తమ మొబైల్ ఫోన్లు దొంగిలించబడ్డాయని ఫిర్యాదులు అందించారన్నారు. సిసి కెమెరాల ద్వారా ఇతర ప్రయత్నాలతో దొంగలను అరెస్ట్ చేసి రూ.95 లక్షల విలువ గల మొబైల్ పోన్లను రికవరీ చేసి ఫోన్లను సొంతవారికి అందించామని తెలిపారు. మాదాపూర్ సిసిఎస్ పరిధీలో 80 ఫోన్‌లను, బాలనగర్ సిసిఎస్ పరిధలో 65 ఫోన్‌లను, మేడ్చల్ పరిధీలో 56, రాజేందర్‌నగర్ పరిధీలో 55, శంషాబాద్ పరిధిలో 55 ఫోన్‌లను చకచక్యంగా వ్యవహరించి దొంగలను అరెస్ట్ చేసి ఫోన్‌లను మొత్తం 95 లక్షల విలువ చేసే 310 ఫోన్‌లను స్వాధీన పరుచుకొని కేసులను పరిష్కారించిన అధికారులను డిసిపి క్రైమ్స్ డిసిపి ఎలోసి నాయక్ సత్కరించారు.

## పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఏవీ?



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ నాయకుల సిఫారసు మేరకే కేటాయిస్తున్నారని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల విషయంలో చెబుతున్న విషయానికి, వాస్తవ పరిస్థితి మరోలా ఉందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడానికి అవకాశం వచ్చినప్పటికీ నిధులు లేవని ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. ప్రభుత్వం ప్రచారాలతో కడుపు నింపు కోవాలని ఆలోచనలో ఉందన్నారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో కూడా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను గులాబీ కార్యకర్తలకే ఇచ్చారని ఆరోపంచారు. బిఆర్‌ఎస్ పంథానే కాంగ్రెస్ సర్కార్ అవలంభిస్తుందని విమర్శించారు. సమావేశంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజు గౌడ్, ఎస్.ప్రకాష్, కృష్ణస్వామి పాల్గొన్నారు.

## రూ.56 లక్షల గంజాయి పట్టివేత : ఇద్దరి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కారులో తీసుకువచ్చిన రూ.56 విలువైన 106 కిలోల గంజాయిని అధికారులు పట్టుకున్నారు. ఈక్రమంలో ఇద్దరిని అరెస్టు చేయగా మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలను నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ వెల్లడించారు. ఒరిస్సాలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన రాంబాబు, హన్మకొండకు చెందిన వివేక్ రెడ్డి, దగ్గుమల్లి మధు కిరణ్‌లు కొంత కాలంగా ఒడిశా నుంచి కారులో గంజాయిని హైదరాబాద్‌కు తరలించి విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం పై ముగ్గురు నిందితులు కారులో 106 కిలోల గంజాయిని ఒడిశా నుంచి తీసుకువచ్చి ఉప్పల్ మల్లాపూర్‌లోని హెచ్‌సిఎల్ ప్రాంతంలోని ఓ గోదాంలో దాచిపెట్టారు. ఈ గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేందుకు నిందితులు సిద్ధమయ్యారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్, ఏఇఎస్ ముకుందరెడ్డిలు ఉప్పల్ ఎస్‌హెచ్‌ఓ బి.ఓంకార్, డిటిఎఫ్ సిఐ భరత్ భూషన్, ఎస్‌ఐలు నరేశ్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలను అప్రమత్తం చేశారు. గంజాయి నిల్వ చేసిన హెచ్‌సిఎల్‌లోని గోదామ్ వద్దకు చేరుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన రాంబాబు, వివేక్‌రెడ్డిలను అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి రవాణ గుట్టు రట్టు అయ్యింది. గోదామ్‌లో దాచిపెట్టిన రూ.56 లక్షల విలువైన 106 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వీరిద్దరిని అరెస్టు చేశారు. మరో నిందితుడు మధు కిరణ్ పరారీలో ఉన్నాడు.



**మరో కేసులో డిసిఎం వ్యాన్‌తో పాటు ముగ్గురి అరెస్టు..** చర్లపల్లి, రాంపల్లి ప్రాంతాల్లో డిటిఎఫ్ సిఐ భరత్‌భూషన్ టీం చేసిన దాడుల్లో రూ.6.50 లక్షల విలువైన 10 కిలోల గంజాయితో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఒడిశాకు చెందిన బైనాథ్‌బిశ్వాల్, మధ్యప్రదేశ్‌కు చెందిన హరికుశ్వాహతో పాటు మరో నిందితుడిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

# అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి డిఆర్‌ఓ సంగీతతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు ఇందిరమ్మ ఇళ్లు

దళిత హక్కుల పోరాట సమితి వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరంలో మురికివాడల్లో నివసిస్తున్న పేద దళితులకు ఇందిరమ్మ ఇళ్లు, డబల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జేరుపోతుల కుమార్ కోరారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఆరుట్ల రాజ్ కుమార్, జేరుపోతుల కుమార్ వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజ్‌కుమార్, కుమార్ మాట్లాడుతూ అద్దెల భారం మోయలేక చాలామంది నిరుపేద దళితులు నోటిఫైడ్ మురికివాడల్లో నివసిస్తున్నారన్నారు. కొంతమంది గుడిసెలు, తాత్కాలిక షెడ్లులు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా దళిత యువకులకు రుణాలు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఆధునిక వ్యవసాయంతో లాభాలు



**ప్రజాపక్షం/యాచారం :** వ్యవసాయరంగంలో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే లాభాలు వస్తాయని ఫ్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ రజినికాంత్, డాక్టర్ అరుణ అన్నారు సోమవారం యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలోని రైతు వేధికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి వారు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా రైతులు వ్యవసాయంలో కొత్తకొత్త మేలకువలు పాటించాలని తెలిపారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. కార్యక్రమంలో మేడిపల్లి సహకార సంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప, వ్యవసాయాధికారి అర్ రవినాథ్, వ్యవసాయ విస్తరణ అధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలు, హక్కుల రక్షణకు సమ్మె

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్న కార్మిక చట్టాలు, హక్కుల రక్షణకు జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాల ని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు కోరారు. సోమవారం షాద్‌నగర్ బస్టాండ్ ఆవరణలో సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు 29 కార్మిక చట్టాలను పునరుద్దరించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 44కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లోకి మార్చి కార్మికులకు హక్కులు లేకుండా చేస్తుందని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి లింగం, నందిగామ మండల కార్యదర్శి గడ్డం జంగయ్య, కేశంపేట మండల కార్యదర్శి ఎం.గోవిందు, ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పట్టాభూముల్లో ఐటి పార్క్ వద్దు

గిరిజన సంఘాల నేతలు హెచ్చరిక



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేదల పట్టాదారు భూముల్లో కొత్తగా ఐటి పార్క్ ఏర్పాటు చేయొద్దని, వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆలిండియా బంజారా సేవా సంఘ్ (ఎఐబిఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షులు సభావత్ రాజు నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో ఆయనతో పాటు లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాంబాల్ నాయక్, ఆలిండియా ట్రైబల్ జెఎసి చైర్మన్ రవీందర్ నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. ధర్మనాయక్, హైకోర్టు న్యాయవాది కె.శ్రీనివాస్‌రావు మీడియాతో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి తండా పరిసరాల్లోని 440 ఎకరాల్లో ఎస్‌సి, బిసిలతో పాటు అత్యధికంగా లంబాడీ గిరిజనులు తమ పూర్వీకుల నుంచి వరి, కూరగాయలు పంటలు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం వీరి పేరిట పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా జారీ చేసిందన్నారు. అయితే, ఇటీవల ఐటి పార్క్ ఏర్పాటు కోసం ఈ భూముల్లో సర్వేకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. గిరిజనుల పొట్టకొడుతూ ఐటి పార్క్ ఏర్పాటు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఐటి పార్క్‌కు వందల ఎకరాల ప్రభుత్వ భూములను చూపిస్తామని చెప్పారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కితీసుకోకపోతే అన్ని గిరిజన సంఘాలు, రాజకీయ పార్టీల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని, పేదల భూముల జోలికి రావొద్దని ఆయన హెచ్చరించారు. సమావేశంలో గిరిజన సంఘాల నేతలు కిషన్, గోడి నాయక్, ఎస్.హనుమంతు ఎన్.పాండు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నానక్‌నగర్ గ్రామంలో అండర్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఇన్‌చార్జి ఎంపిడిఒ శైలాజా అన్నారు. సోమవారం నానక్‌నగర్ గ్రామాలన్ని అధికారులతో కలిసి సందర్శించారు. గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం ఎర్పాటు చేశారు. ఈ సంధర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్న పరిష్కరించడానికి తమ వంతుగా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిఒ శ్రీలత, గ్రామ మాజీ సర్పంచ్ పెద్దయ్య, గ్రామ పెద్దలు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు..

**అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ...** అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ శైలజా అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హౌజింగ్ ఎఈ రామచంద్రయ్య,ఎంపిఒ శ్రీలత పాల్గొన్నారు.



## క్రీడల్లో రాణించాలి : కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** క్రీడా పోటీల్లో రాణించటానికి సరైన శిక్షణ బాల్యదశ నుండే తీసుకొని దేశానికి వన్నె తేవాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని సీఫెల్ కాలనీ గ్రౌండ్‌లో సోమవారం క్రికెట్ సెటిల్ గేమ్స్‌ను ప్రారంభించారు. విద్యతో పాటు పిల్లల ఆసక్తికి అనుగుణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కిషోర్, ఓమ్‌రాజ్, చంద్రకాంత్, జగన్మోహన్, సోమయ్య, చంద్రకళ, హరిప్రసాద వాణి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## అపరిష్కృత సమస్యలు పరిష్కరించే దిశగా కృషి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, డిఆర్‌డిఓ శ్రీనివాస్, ఆర్‌డిఓ వాసుచంద్రతో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు సమాచారం ఇవ్వకుండా ప్రజావాణికి గైర్హాజర్ కాకూడదని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 68 అర్జీలు రాగా ఎక్కువశాతం భూ సమస్యలు,పెన్షన్లు, వ్యవసాయ రంగానికి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు



## అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు వినతి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గౌతంనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు గాను నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన ముగిసే ఏర్పాట్లు చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి, గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునతలు కోరారు. సోమవారం జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కల్సి వారు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. గత కొద్ది రోజులుగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను అనుమతించటంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, దీని వల్ల ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.



## ఘనంగా కట్టమైసమ్మ జాతర మహోత్సవం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండలం పెద్ద చెరువు వద్ద ఉన్న కట్ట మైసమ్మ జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం జాతరను పురస్కరించుకుని అమ్మవారిని మండల కేంద్రంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు దర్శించుకుని తరించారు. అమ్మవారి ఆలయంలో సర్వ గంప, పోతురాజు గావు, భవిష్యవాణిని భక్తులకు వినిపించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మాజి ఎంఎల్‌ఏ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, డిసిసి అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌లు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అతిథులను ఘనంగా శాలువాలతో, పూలమాలలతో సత్కరించారు. అన్నదానం ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నాయకులు పాల్గొన్నారు.



## అంతర్గత అహంకారాన్ని జయించడం గొప్ప విజయం

### ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** బాహ్య శత్రువుల కంటే మనలోని అంతర్గత అహంకారాన్ని జయించడం గొప్ప విజయమని బిఆర్‌ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్‌లోని నక్షిణ్ బుద్ధ విహార్ ఆలయంలో బుద్ధ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద విచ్చేసి బుద్ధ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కోపంతో కాకుండా శాంతి, సహనంతో ప్రపంచాన్ని జయించవచ్చని, బాహ్య శత్రువుల కంటే మనలోని అంతర్గత అహంకారాన్ని జయించడం గొప్ప విజయమని పేర్కొన్నారు. బుద్ధుడు చూపిన బాటలో ప్రతిఒక్కరు నడవాలని, మానవాళికి ఆయన దిశానిర్దేశం చొసిన గొప్ప మార్గదర్శకులు గౌతమ బుద్ధుడని అన్నారు. ఆయన అడుగుజాడలో పయనిస్తే విజయాలు చేకూరుతాయని సూచించారు. కార్యక్రమంలో మన్నెరాజు, యశ్వంత్ జోనేల్డ్, భీమ్‌రావు, దిలీప్, గౌతమ్, దమ్మానం, బాలాజీ, వెంకటస్వామి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పూడూర్ :**పరిగి నియోజకవర్గంలోని చన్‌గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలలో చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పూడూర్ మండల పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన సత్తయ్య వయస్సు 40సంవత్సరాలు. అతని భార్య మరణించి సంవత్సరం అయిపోయింది. అప్పటినుండి తాగుడుకు బానిస అయినా సత్తయ్య చెట్టుకు ఉరి వేసుకొని మరణించినట్లు అని తల్లి బుచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు.



## కలెక్టరేట్ ప్రజావాణిలో 60 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చే అర్జీలను ప్రాధాన్యతాపరంగా పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ ఆదేశించారు. తమ స్థాయిలో పరిష్కరించలేని వాటి గురించి ధరఖాస్తుదారులతో పాటు సవివరంగా ఉన్నతాధికారులకు తెలియ పరుస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లా లా అధికారిణి చంద్రావతి, ఇతర జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులతో కల్సి ప్రజావాణిలో 60 అర్జీలను స్వీకరించారు. కింది స్థాయిలో పరిష్కారం కాక పోతేనే సుదూర ప్రాంతాల నుండి గంపెడాశతో ప్రజావాణిలో పాల్గొనే జిల్లా ఉన్నతాధికారుల ద్వారా పరిష్కృతమవుతాయని దూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసలకోర్చి వస్తుంటారన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం కనపరచకుండా తక్షణమే పరిష్కరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అర్జీలను ఎక్కడా పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరశీలించి పరిష్కరించాలన్నారు.

# వైద్యాధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:**వైద్యాధికారులు బాధ్యతాయుతంగా, సేవా దృక్పథంతో పని చేయాలని వైద్య ఆరోగ్య శాఖ పనిచేయాలని,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ అన్నారు. సోమవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో 30కోట్ల నిధుల వ్యయంతో నిర్మించిన 300 పడకల సౌకర్యంతో కూడిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ , ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు కొండవిశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కలిసి ప్రారంభోత్సవం చేశారు. నర్సులు దినోత్సవం సందర్భంగా సీనియర్ నర్సులను పూలమాల శాలువతో మంత్రి సన్మానించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో స్పీకర్ ప్రజా ప్రతినిధులతో, ఉన్నతాధికారులతో కలసి ప్రభుత్వ ఆసుపత్రుల, వైద్యకళాశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, బ్లడ్ బ్యాంక్, వైద్య అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జనాభాప్రాదికన, ప్రజలకు దూరాన్ని, దృష్టిలో పెట్టుకొని ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. అధికంగా రోడ్డు భద్రతా సమావేశాలను నిర్వహించి బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. ప్రమాదాలు సంభవించిన క్రమంలో సత్వర వైద్య సేవలు అందించేందుకు ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు 505 కోట్ల నిధులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డిఎంహెచ్ఒ, సూపరింటెండ్ంట్‌లు జవాబుదారీతనంలో ఉండాలని మంత్రి తెలిపారు. ఆసుపత్రుల్లో సంబంధిత అధికారులు అందుబాటులో లేకుంటే ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని మంత్రి తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని జిల్లా వైద్యాఆరోగ్య అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రైవైట్ ఆసుపత్రులు వైద్యపరమైన నిబంధనలకు అనుగుణంగా నడపాలని మంత్రి తెలిపారు. వైద్యకళాశాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఇబ్బంది పడకుండా ప్రాధాన్యత క్రమంలో వసతి గృహలు, సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణాలు చేపట్టాలని అధికారులను అదేశించారు. వైద్యకళాశాల, వసతి గృహాలకు సంబంధించి అత్యవసర మరమ్మత్తుల పనులు వెంటనే చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంఇ డాక్టర్ నరేంద్రకుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ అజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డిఓ వాసుచంద్ర, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

**పరిగి:**ప్రతి పేదవాడికి ఆత్మస్థైర్యాన్ని కల్పించే విధంగా వైద్యసేవలు ఉండాలి. రాష్ట వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, పరిగి పట్టణ కేంద్రంలో 27కోట్ల నిధుల వ్యయంతో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిని నిర్మించే పనులకు స్పీకర్ ప్రసాద్ కుమార్ , స్థానిక ఎమ్మెల్యే రామ్మోహరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎంపి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సుజాతలతో కలిపి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండేండ్లలో కొత్త హాస్పటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి పరిగి ప్రజలకు వైద్య సేవలు విస్తరిస్తామన్నారు. అన్ని రకాల స్పెషాలిటీ వైద్యసేవలు ఇక్కడ



అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. అంబులెన్స్‌ల సంఖ్యను పంచుతామని అన్నారు. పరిగిలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు మంత్రి దృష్టికి తీసుకురాగా పరిశీలిస్తామని అన్నారు. త్వరలో 2300 ల పైచిలు కు పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తామని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ బిపి ,షుగర్, క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతున్నదని వీరికి వైద్యం అందించేందుకు అన్ని జిల్లాల్లోను ఎన్‌సిడి క్లినిక్స్ ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక, ఆర్థికంగా, విద్యాపరంగా ఎదిగినప్పుడే అభివృద్ధి చెందినవని మంత్రి అన్నారు. కులగణన సర్వే నిర్వహించి 75అంశాలతో కూడిన సమాచారం సేకరించడం జరిగింది అన్నారు. వర్గీకరణకు అసెంబ్లీలో అమోదించడం జరిగింది అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి, ఆర్‌డిఓ వాసుచంద్ర, డిఎంఎచ్ఓ వెంకటరమణ, డిసిహెచ్ఓ అనంద్, మున్సిపల్ కమిషనర్, వెంకటయ్య, పిఎసిఎస్ చైర్మన్ పరుశరాంరెడ్డి, యాదవ రెడ్డి, తహసీల్దార్ అనంద్, ఎంపిడిఓ ఖరీం, తదితరులు పాల్గోన్నారు.

**జిల్లా ఆసుపత్రి సమస్యలు మంత్రి దృష్టికిః తాండూరు ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి**

తాండూరులోని జిల్లా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి తీసుకవెళ్ళారు. సోమవారం వికారాబాద్ జిల్లా పర్యటించిన మంత్రి దామోదర రాజనర్సింహతో ఎంఎల్ఏ మాట్లాడుతూ తాండూరులో జిల్లా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వివరించారు. జిల్లా ఆసుపత్రికి ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో వైద్య సేవలకు వస్తుండటంతో ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని రెండు నూతన అంబులెన్స్‌లు మంజూరు కోరారు. అదే విధంగా అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో పెద్ద ఆసుపత్రి అయిన తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసియు ఏర్పాటు చేయడంతో పాటు అదనంగా నాలుగు డయాలసిస్ బెడ్స్, అధునాతన పరికరాలు ఏర్పాటుచేసే విధంగా కృషి చేయాలని మంత్రిని ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి కోరారు. అదే విధంగా పెద్దేముల్ మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 24గంటల వైద్య సేవలు అందించే విధంగా చూడాలని మంత్రికి దృష్టికి తీసుకువెళ్ళారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని ప్రైమరి హెల్త్ సెంటర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ అవ్వడం అక్కడ ఉన్న పిహెచ్‌సి సెంటర్‌ను బషీరాబాద్ మండలంలోని నవాల్గ గ్రామంలో ఏర్పాటు చేసే విధంగా చూడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డికి తీసుక వెళ్ళారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### సిహెచ్ దశరథ్ పిలుపు




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సిపిఐ పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలందరూ ప్రతినబూని కృషి చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్ పిలుపిచ్చారు. సోమవారం వినాయకనగర్ లోని నిర్మల్‌నగర్ పార్టీ కార్యాలయంలో పి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రాంతంలో ప్రజా సమస్యలను ఎజెండాగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు.

జిల్లా ఉపాధ్యక్షురాలు రొయ్యల గిరిజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నగరంలో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించటం సిగ్గు చేటని, మహిళలను అడ్డుగా పెట్టుకొని వ్యాపారం చేయటం అంటూ ఎద్దేవా చేసారు. సిపిఐ నేరేడ్‌మెట్ కార్యదర్శిగా జె.వెంకటరమణ, వినాయకనగర్ కార్యదర్శిగా ఎండి యూసూఫ్, సహ కార్యదర్శిగా బండారి కలమ్మ, భరత్‌నగర్ శాఖ కార్యదర్శిగా ఎస్.కె. అజీజ్, నిర్మల్‌నగర్ కార్యదర్శిగా డి.రమణయ్యలు ఎన్నికయ్యారు. ఈ సభలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కె.అశోక్ కుమార్, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు అబ్దుల్ గని, కొంగ ప్రభాకర్, కె.కవిత, టి.వెంకటేష్, బి. పద్మావతి, మధు, కె.రమాదేశి, జె. నిర్మల, లక్ష్మి , పవన్ తదితరులు పాల్గొన్నా రు.

## మే 20న ఆల్ ట్రేడ్ యూనియన్స్...

## దేశవ్యాప్త సమ్మె గోడపత్రిక విడుదల

**ప్రజాపక్షం/దుండిగల్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బాచుపల్లి మరియు అలీఫ్ ఇండస్ట్రియల్ ఏరియా లలో 20 మే 2025 కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు నిర్ణయించిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బాచుపల్లి ఏరియాలోని సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి యూనియన్ల సమావేశం ప్రగతి నగర్ లోని సుందరయ్య భవన్లో జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ యేసు రత్నం ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి విజయ్ చంద్ర తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు పి.పెంటయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని కోరారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 78 సంవత్సరాలు తర్వాత కూడా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేడు కేంద్ర ప్రభుత్వం హాని తలపెట్టిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వారి దోపిడీని తీవ్రతరం చేసే దాని కోసం పనిచేస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ ను తిప్పికొట్టి కార్మిక చట్టాలను కాపాడుకోవడం కార్మికుల ముందున్న తక్షణ కర్తవ్యం గా భావించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలుగా నిర్ణయించాలని, ఈ సమ్మె పోరాటంలో కార్మికులందరూ ఐక్యంగా పాల్గొని కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేదానికి కృషి చేయాలన్నారు. తదనంతరం 2025 మే 20 జరిగే సార్వత్రిక దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముఖలింగం, ఏఐటీయూసీ నాయకులు తిరుమల రావు తదితర స్థానిక నాయకులు కార్మికులు పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణి



**ప్రజాపక్షం/అల్వాల్:** లయన్స్ క్లబ్ మేడ్చల్ విజయ గణపతి దేవాలయం అల్వాల్ లోతుకుంట ఆధ్వర్యంలో బాటసారులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, మానవసేవే మాధవ సేవ అని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందని అందులో భాగంగా అల్పాహారం పంపిణీ చేయడం పేదవారికి చేదోడువాదోడుగా ఉంటామని క్లబ్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బాలసుధన్, లయన్ శ్రీనివాస్ రెడ్డి, లయన్ అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో టిజిసిఎస్‌బి భారీ ఆపరేషన్

- ✻ 10రోజుల దాడుల్లో 20 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు
- ✻ తెలంగాణలో వీరిపై 60 కేసులు, దేశవ్యాప్తంగా 512 కేసులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:**గుజరాత్‌లోని సూరత్‌ను కేంద్రంగా చేసుకుని తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు తెబడుతున్న ముఠాపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు పంజా విసిరారు. పది రోజుల పాటు గుజరాత్‌లో ఆపరేషన్ నిర్వహించిన టిజిసిఎస్‌బి అధికారులు 20 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరిపై తెలంగాణలో 60కి పైగా కేసులు నమోదు కాగా దేశవ్యాప్తంగా 512 సైబర్ నేరాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ సోమవారం మీడియాకు వెల్లడించారు.

టిజిసిఎస్‌బి ఎస్‌పి దేవేందర్‌సింగ్ ఆదేశాల మేరకు డిఎస్‌పిలు ఫణిందర్, రంగారెడ్డి, కెవి సూర్యప్రకాష్, హరికృష్ణ, ఇన్‌స్పెక్టర్లు మహేందర్, రవికుమార్‌లు రెండు బృందాలుగా ఏర్పడ్డారు.

మే 1 నుంచి 10వ తేదీ వరకు గుజరాత్‌లోని సూరత్‌లో పది రోజుల పాటు అంతరాష్ట్ర ఆపరేషన్‌ను నిర్వహించారు. ఈ ఆపరేషన్లో తెలంగాణలో 60 కి పైగా సైబర్ క్రైమ్ కేసులు మరియు భారతదేశం అంతటా 515 కేసులలో పాల్గొన్న 20 మంది సైబర్ మోసగాళ్లను అరెస్టు చేశారు.ఈ రెండు ప్రత్యేక బృందాలు 10 రోజుల పాటు సూరత్‌లో మకాం వేసి సైబర్ నేరాలకు వ్యతిరేకంగా ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. ఈ ముఠా రూ.4.37 కోట్లను జరిపింది. అరెస్టు అయిన వారిలో ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, బ్యాంక్ ఉద్యోగి ఉన్నారు. వారు వివిధ సైబర్ మోసాలలో నిందితులుగా ఉన్నారు, వాటిలో ట్రేడింగ్ మరియు పార్ట్‌టైమ్ ఉద్యోగ మోసాలు వంటి వ్యాపారం, పెట్టుబడి మోసాలు ఉన్నాయి.

అరెస్టు అయిన నిందితుల్లో గుజరాత్‌కు చెందిన గుర్జర్ జయదీప్ దినేష్ భాయ్ (30), వాఘ్ అజయ్ భగవాన్భాయ్ (20), సనేపర భావదీప్ విత్తళ్భాయ్ (40), ఖండాలా సంజయ్ భాయ్ మన్సుఖ్ భాయ్ (33), లక్ష్మ్రణ్రామ్ థోరి (41), భీమానీ రుత్విక్ ముఖేష్ భాయ్ (22), మాటీవీ ప్రదీప్ కుమార్ (24), సయీద్ అహ్మద్ షబ్బీర్ అహ్మద్ (32), పటేట్ జేతత్భాయ్ రాముభాయ్( 32), పటేట్ సాద్ మొహమ్మద్ (20), రదాడియా జగదీష్ వినుభాయ్ (33), పరదేశి నరేంద్ర భాయ్ రాజుభాయ్(30), వరియా కల్పేష్ కేశుభాయ్ (29), సిద్ధికిల్టేకర్ అహ్మద్ (47), పాండవ్ భార్గవ్ అశోక్ భాయ్ (28), లఖ్తరియా మీట్ ధీరుభాయ్ (22),. అంకిత్ కుమార్ సింగ్ (26), యష్రాజ్ రాజేష్ చౌదరి(32), మాతంకియా తుషార్ హస్ముక్ భాయ్ (25), షేక్ మొహమ్మద్ అఫ్షాన్ (21).

ఏదైనా మోసపూరిత కార్యకలాపాలను అనుమానించినట్లయితే, గోల్డెన్ అవర్లోపు (రెండు గంటల వ్యవధి) లోపు 1930కి సమాచారం అందించాలని శిఖాగోయల్ తెలిపారు.

# యువతరంగం

ఫోకస్




## ఆత్మవిశ్వాసమే బలమైన ఆయుధం

ఎవరికైనా ఆత్మవిశ్వాసాన్ని మించిన ఆయుధం లేదు. ధైర్యంతో ప్రయత్నిస్తే సాధించలేని లక్ష్యాలు లేవు. యువత శక్తికి మారుపేరు. మార్పు, ఆశ, ఆశయాల చిహ్నం. కానీ, సమాజానికి ఉపయోగపడే యువత ఎలా ఉండాలి అన్నదానిపై చాలా మందిలో స్పష్టత లోపిస్తున్నది. యువత ఆత్మవిశ్వాసంతో ఉండాలన్నది ప్రాథమిక సూత్రం. యువత తమ సామర్థ్యాన్ని నమ్మాలి. ఓడిపోతే నెగ్గే శక్తి తమలో ఉందని తెలుసుకోవాలి. తమ లక్ష్యాలను స్పష్టంగా పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో జీవించాలి. యువతీయువకుల్లో ఈ లక్షణం మరింత దృఢంగా ఉండాలి. నిరంతర సాధన, సమయపాలన, నియమ నిష్ఠలు అవసరం. క్రమశిక్షణతో ఉన్న యువత ఎలాంటి రంగంలోనైనా గొప్ప విజయాలను సాధించగలరు. దేశభక్తి కలిగిన వారై ఉండాలన్నది సామాజిక అవసరం. తమకు లభించిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుంటూ, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే తపన యువతలో ఉండాలి. దేశం కోసం ఏదైనా చేయాలన్న చిత్తశుద్ధి ఉండాలి. 'ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్' అని గురజాడ ప్రశ్నించిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఎముకులు క్రుళ్ళిన, వయస్సు మళ్ళిన సోమరులను చావమన్నాడు మహాకవి శ్రీశ్రీ. నెత్తురు మండే, శక్తులు నిండే వారికై పరితపించాడు. శారీరక, మానసిక శక్తికి ప్రతిరూపం యువత. అందుకే, యువతీయువకులు ఆరోగ్యంగా ఉండాలి. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటం వల్లే వారి శక్తి, సామర్థ్యం వినియోగంలోకి వస్తుంది. వ్యాయామం, సమతుల్యాహారం, నిద్ర వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అవసరం. మానవత్వం యువత నైజం కావాలి. ఇతరుల బాధలు అర్థం చేసుకోగలగాలి. సహానుభూతి, సేవాభావం కలిగి ఉండాలి. మనుషుల మధ్య గోడలు కట్టే కాక, వారిని దగ్గర చేస్తూ జీవించాలి. సాంకేతికతను ఉపయోగించగల సామర్థ్యం యువతకు అత్యవసరం. నేటిడిజిటల్ ప్రపంచంలో యువత టెక్నాలజీని చెడ్డకు కాదు, మంచికి ఉపయోగించాలి. జ్ఞానం పెంచుకోవడానికీ, సమస్యలు పరిష్కరించడానికీ టెక్నాలజీ సహాయం కావాలి. సాధ్యమైనంత వరకూ పొరపాట్లు చేయకూడదు. తప్పులు చేయకుండా ఉండడం ఎవరికైనా అసాధ్యం. తెలిసో, తెలియకో పొరపాట్లు జరుగుతుంటాయి. అయితే, వాటి నుంచి నేర్చుకోవాలి. ప్రతి తప్పు ఒక పాఠం. భయపడకుండా ఎదురు చూడాలి. తిరిగి లేచే ధైర్యం కలిగి ఉండాలి. యువత ఎప్పుడూ సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉండాలి. తమ ప్రవర్తన, మాటలు, ఆచరణలతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. చుట్టూ ఉన్నవారిని ప్రోత్సహించగలగాలి. యువత అనేది ఓ శక్తివంతమైన దశ. ఇది భవిష్యత్తుని నిర్మించే సమయం. యువత నిజాయితీగా, శ్రమతో, విలువలతో కూడిన జీవితాన్ని గడిపితే అది ఒక వ్యక్తి జీవితమే కాదు, దేశం ముందుకు సాగే మార్గమవుతుంది

## వృద్ధాప్యంలో జీవన సరళి 'మారాలి..

వృద్ధాప్యం అనేది జీవన యాత్రలో ఒక దశ. ఇది సాధారణంగా 60 లేదా 65 ఏళ్ల వయస్సు నుంచి ప్రారంభమవుతుంది. ఈ దశలో శరీర శక్తులు తగ్గుతూ, జీవన శైలి, అవసరాలు మారుతూ ఉంటాయి. శారీరక శక్తితోపాటు జ్ఞాపకశక్తి కూడా తగ్గుతుంది. పలు ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. మానసిక ఒత్తిళ్లు తలెత్తుతాయి. నడక, వినికిడి, చూపు లోపాలు తప్పవు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణవృద్ధుల ఆరోగ్యం అనేది ముఖ్యమైన అంశం.



రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. వయసు పెరుగుతున్న కొద్దీ జీవన సరళి మారాలి. వృద్ధాప్యం వచ్చిందనే విషయాన్ని జీర్ణించుకోక తప్పదు. వయస్సు దాటి, సేకరించిన అనుభవాలను ముందు తరాలవారికి అందించడం లక్ష్యం కావాలి. జీవితం అనేక మలుపులు తీసుకొని, అనుభవాల సముద్రంగా మారుతుంది. అందుకే సమాజానికి వృద్ధులు శిరోమణులు. అయితే వయస్సు పెరిగేకొద్దీ శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా వారి జీవన సరళిలో మార్పులు చోటు చేసుకుంటాయి. ముందుగా వృద్ధాప్యం అనేది ఏమిటి? ప్రశ్న తలెత్తుతుంది. వృద్ధాప్యం అనేది జీవన యాత్రలో ఒక దశ. ఇది సాధారణంగా 60 లేదా 65 ఏళ్ల వయస్సు నుంచి ప్రారంభమవుతుంది. ఈ దశలో శరీర శక్తులు తగ్గుతూ, జీవన శైలి, అవసరాలు మారుతూ ఉంటాయి. శారీరక శక్తితోపాటు జ్ఞాపకశక్తి కూడా తగ్గుతుంది. పలు ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. మానసిక ఒత్తిళ్లు తలెత్తుతాయి. నడక, వినికిడి, చూపు లోపాలు తప్పవు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణవృద్ధుల ఆరోగ్యం అనేది ముఖ్యమైన అంశం. డయాబెటిస్, హై బీపీ, ఆర్థరైటిస్, హృద్రోగాలు అల్జైమర్స్, డిమెన్షియా తదితర ఆరోగ్య సమస్యలు సర్వసాధారణం. ఆరోగ్యవంతమైన ఆహారం, మితమైన వ్యాయామం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, ధ్యానం, యోగా, వైద్యులు సూచించిన మందులు సేవించడం వంటి చర్యలు అవసరం. ఆహారపరమైన జీవన శైలివృద్ధులు తీసుకునే ఆహారం ఎంతో ముఖ్యమైనది. సరైన ఆహారం శరీర శక్తిని నిలిపి ఉంచుతుంది. శ్రేష్ఠమైన ఆహారాలు: పచ్చి కూరగాయలు, పండ్లు తక్కువ ఉప్పు, చక్కెర శరీరానికి తేలికైన ఆహార పదార్థాలు తీసుకోవాలి. తీపి పదార్థాలు పరిమితంగా తినాలి. సాధారణంగా వృద్ధులు ఒంటరితనం, నిరాశ, నిరుద్యోగం వంటి భావాలతో బాధపడతారు. మానసిక ఆరోగ్య మెరుగుదల కోసం, కుటుంబ సభ్యుల మద్దతు స్నేహితుల సాంగత్యం చర్చా వేదికలు, కళా కార్యక్రమాలు ధ్యానం, ప్రార్థన వంటి మార్గాలు ఉన్నాయి. వృద్ధులు ఉద్యోగ విరమణ తర్వాత ఆదాయ వనరులు కోల్పోతారు. ఇది వారి స్వాతంత్ర్యాన్ని ప్రభావితం చేస్తుంది. పెన్షన్ పథకాలు, సేవింగ్ స్కీములు, ఇన్సూరెన్స్, కుటుంబ సహకారంతో ఆర్థిక సమస్యలను అధిగమించవచ్చు. వృద్ధులకు సామాజికంగా మద్దతు ఎంతో అవసరం. వారిని సమాజంలో అంగీకరించడం, గౌరవించడం సమాజ బాధ్యత. వృద్ధాశ్రమాలు (పాజిటివ్ వైపు) వృద్ధ సంఘాలు గౌరవోత్సవాలు వారిని సేవలలో భాగస్వాములుగా చేయడం అవసరం. ఈ డిజిటల్ యుగంలో వృద్ధులు కూడా టెక్నాలజీ నేర్చుకొని, తమ జీవన ప్రమాణాన్ని మెరుగుపర్చుకోవచ్చు. హెల్త్ మానిటరింగ్ యాప్‌లు, వీడియో కాల్స్ ద్వారా కుటుంబ సభ్యులతో సంభాషణ, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ ఎడ్యుకేషన్ తదితర విధానాలు వృద్ధులకు మానసిక ఆరోగ్య సంతులనానికి ఉపయోగపడతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటాయి. జాతీయ వృద్ధుల పాలసీ వృద్ధాప్య పెన్షన్ పథకం, ఆరోగ్య బీమా పథకాలు ఉన్నాయి. కుటుంబ వ్యవస్థలో వృద్ధుల స్థానంపురాతన భారతీయ సంస్కృతిలో వృద్ధులకు విశేష స్థానం ఉంది. వారు కుటుంబానికి మార్గదర్శకులు. న్యూక్లియస్ కుటుంబాల పెరుగుదల కారణంగా వృద్ధులను విస్మరించడం సాధారణమైంది వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వృద్ధులు ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించక తప్పదు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోడం వాటిలో ప్రధానమైనది. ప్రతిరోజూ తప్పనిసరిగా ఎంతోకొంత వ్యాయామం చేయాలి. మానసికంగా ఉత్సాహంగా ఉండే ప్రయత్నం చేయాలి. కుటుంబ సభ్యులతో సమయం గడపాలి. హాబీలు అభివృద్ధి చేసుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవాలి. సాధ్యమైనంతవరకు స్వతంత్రంగా జీవించాలి. వృద్ధాప్యం అనేది జీవితంలో ఒక దశ మాత్రమే కాదు, అనుభవాలతో నిండిన ఓ పర్వం కూడా. ఈ దశలో కూడా జీవితం అందంగా, ఉత్సాహంగా ఉండాలి. కుటుంబం, సమాజం, ప్రభుత్వం... ఇలా ప్రతి ఒక్కరు వృద్ధులకు గౌరవంగా, ఆదరణగా ఉంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుంది. మనం నేడు గౌరవించాలంటే, రేపు మనం కూడా గౌరవించబడతాం.




## యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## పర్యావరణ కార్యకర్త దిశ

భారత దేశానికి చెందిన ప్రముఖ పర్యావరణ కార్యకర్త దిశా రవి. బెంగళూరులో, 1998లో జన్మిం దిశ మౌంట్ కార్మెల్ కాలేజీ, బెంగళూరులో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బిబిఎ) పట్టభద్రులుగా చదువుకుంది. దిశ 19 ఏళ్ల వయస్సులో పర్యావరణ కార్యకలాపాల్లో పాల్గొనడం ప్రారంభించింది. ఆమె 'ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఇండియా' (భారత భవిష్యత్తు కోసం శుక్రవారాలు) అనే గ్లోబల్ క్లైమేట్ స్ట్రైక్ ఉద్యమం భారత విభాగాన్ని స్థాపించింది. ఆమె పర్యావరణ న్యాయం కోసం పోరాడుతూ, పర్యావరణంపై ప్రభావితమయ్యే సముదాయాల కోసం వాదిస్తున్నది. ఢిల్లీ పోలీసులు 2021 ఫిబ్రవరి 13న, దిశను అరెస్టు చేశారు. 'టూల్‌కిట్' అనే డాక్యుమెంట్‌ను సృష్టించిందని ఆమెపై ఆరోపణలు మోపింది. వాటిని పంచడం ద్వారా రైతుల నిరసనలకు మద్దతు ఇవ్వడమేగాక, వారు హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడేలా రెచ్చగొట్టిందని ఢిల్లీ పోలీసులు దిశపై ఆరోపణలు చేశారు. అంతేగాక చార్జిషీట్‌లో ఆమెపై దేశద్రోహం, కుట్ర వంటి నేరాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ అరెస్టు అంతర్జాతీయంగా తీవ్ర




విమర్శలకు గురైంది. అరెస్టు తర్వాత కూడా, దిశా రవి పర్యావరణ న్యాయం కోసం తన కార్యకలాపాలను కొనసాగిస్తునే ఉంది. ఆమె 'ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఇండియా'లో 'మోస్ట్ ఎఫెక్టెడ్ పీపుల్ అండ్ ఏరియాస్' (ఎక్కువగా ప్రభావితమైన ప్రజలు.. ప్రాంతాలు) విభాగాన్ని నెలకొల్పింది. పర్యావరణ న్యాయం కోసం గ్లోబల్ స్థాయిలో ఆమె కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. దిశ తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా పర్యావరణ న్యాయం కోసం తన అభిప్రాయాలను పంచుకుంటున్నది. ఎన్ని సమస్యలు ఎదురైనప్పటికీ భయపడకుండా ముందుకు వెళ్లడం, అనుకున్నది సాధించే దిశగా దూసుకెళ్లడం దిశ వంటి అతి కొద్ది మందికి మాత్రమే సాధ్యం. అందుకే, ఆమె జీవితం యువతకు స్ఫూర్తిదాయకం.

# ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు

పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

త్యాగాలు, ఉద్యమాలు సిపిఐ సొంతం : ఎమ్మెల్సీ సత్యం







**ప్రజాపక్షం/చండూరు :** ప్రజల పక్షాన నిలబడి దోపిడి రహిత సమాజ నిర్మాణం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం సిపిఐ చండూరు మండల 15వ మహాసభలు మండల పరిధిలోని దోనిపాముల గ్రామంలో జరిగాయి. ఈ మహాసభలకు పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరయ్యారు. దోనిపాముల గ్రామశాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని చౌరస్తాలో ఏర్పాటు చేసిన పార్టీ అరుణ పతాకాన్ని పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం ఆవిష్కరించారు. మందడి నర్సింహ్మారెడ్డి మహాసభ ప్రాంగణంలో అరుణ పతాకాన్ని ఎగురవేసి, అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కశ్మీర్ పహల్గాం లో పర్యటకులపై ఉగ్రవాదులు దాడిచేసి చంపేయడం దారుణమన్నారు. టెర్రరిజాన్ని అంతమొందించేందుకు కేంద్రప్రభుత్వానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతవిద్వేషాలను రెచ్చగొడుతూ కులా లు, మతాల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ పబ్బం గడుపుతుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పోరేట్ శక్తులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతున్నారన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ఉద్యమాలతోనే పార్టీకి గుర్తింపు వస్తుందన్నారు. అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల పక్షాన ఉండి పోరాటాలు నిర్వహిస్తు ప్రజాసమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం సిపిఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. భూసంస్కరణలు, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు ఉద్యమాలు నిర్వహించిన పార్టీ సిపిఐ అన్నారు. నల్లగొండ జిల్లాలో శాశ్వత కరువు నివారణ కోసం ఎస్ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకం పాజెక్టు పూర్తిచేసి చర్లగూడెం రిజర్వాయర్‌తో మునుగోడు, దేవరకొండ నియోజవర్గాలకు సాగుఅందించాలనే లక్ష్యంతో సిపిఐ ఉద్యమాలు నిర్వహించిందన్నారు. చండూరు మండలంలో సిపిఐకి పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలు చేసిన పార్టీగా గుర్తింపు ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్దంగా ఉండాలన్నారు. మండల పార్టీ సహాయకార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , మాజీ జడ్పిటిసి మాదగోని విజయలక్ష్మి , బరిగెల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, కార్యవర్గ సభ్యులు తిప్పర్తి రాములు, దోటి వెంకన్న, బండమీది వెంకటేశం, సిహెచ్ ఊషయ్య, గంట రమేష్, ఇరిగి సంజీవ , బోయపల్లి బిక్షమయ్య, జంగయ్య, పాలకూరి సత్తయ్య, పల్లె నర్సింహ్మా, శివర్ల లింగ స్వామి, జోగు రమేష్, గడ్డం నవీన్, ఎండి కరీం, దశరథ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి

సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

**ప్రజాపక్షం/రామడుగు :** గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం ప్రతికార్యకర్త కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. సోమవారం రామడుగు మండల మహాసభ గోపాలరావుపేట గ్రామంలో మచ్చరమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సంధర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ సిపిఐ ఆవిర్బవించి వంద సంవత్సరాలు అవుతుందని, సమసమాజ స్థాపనే లక్ష్యంగా, దోపిడీ లేని సమాజం కోసం అంతరాలు లేని వ్యవస్థ కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి, కార్పోరేట్ బహుళజాతి సంస్థలకు సంపన్నవర్గాలకు అనుకూల నిర్ణయాలు చేస్తూ దేశ సంపదను కొల్లగొడుత్తున్నారని, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఆలస్యం చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, నిరుద్యోగభృతి, ఉద్యోగాల కల్పన, పెన్షన్స్ పెంపు, రైతుల రుణ మాఫీ తదితర హామీలను నెరవేర్చాలని, లేకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గొడిశాల తిరుపతి గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, ఉమ్మెంతుల రవీందర్‌రెడ్డి, నాయకులు ఎగుర్ల మల్లేశం, శంకరయ్య, లక్ష్మి , నర్సయ్య, ఐలయ్య, రాజేష్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.




## ఉక్కు పరిశ్రమ స్థాపించేవరకూ కేంద్రంపై పోరాటం ఆగదు



సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్‌ప్రతినిధి :** బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిందేనని, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేవరకూ కేంద్ర ప్రభుత్వంపై పోరాటం ఆగదని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. ఉక్కు పరిశ్రమ ఉద్యమం కేసులో భాగంగా సోమవారం కోర్టుకు హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ళు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 2014 విభజన చట్టంలో ఉన్న బయ్యారం ఉక్కు పరిశ్రమ నేటికీ ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. పదేళ్ళు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫమమైందన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల మానుకోట జిల్లాలో ఎక్కువ మంది గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుచేయడానికి కృషి చేయాలని, తక్షణమే అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శంతన్‌రామరాజు, తెలంగాణ ఉద్యమకారుడు గుంజె హన్మంతు, మిరియాల మల్లికార్జున్‌లు కోర్టుకు హాజరయ్యారు.

# 44 కార్మిక చట్టాల అమలుకు సార్వత్రిక సమ్మె

సమ్మె సన్నాహక సమావేశాల్లో ఎఐటియుసి నాయకులు




నిజామాబాద్ అర్బన్

**ప్రజాపక్షం/తాండూరు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా కార్మిక లోకం సమరశంఖం పూరించిందని, తమ హక్కుల పరిరక్షణ కోసం కార్మికులు ఏకం కానున్నారని, ఈ పోరాటంలో భాగంగా ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునివ్వడం జరిగిందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో సోమవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 44 కార్మిక చట్టాల అమలుకు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, హమాలీ సంఘం నాయకులు శ్రీనివాస్, మహేందర్, చందు, లక్ష్మ ణ్, వెంకటేష్, గణేష్, అంకేష్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** మధ్యాహ్న భోజన కార్మికులకు స్కీం వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి అన్నారు. సోమవారం ఎఐటియుసి కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల జిల్లా కౌన్సిల్ సమావేశంను ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించి 20న జరిగే సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు స్రవంతి, ఎఐటియుసి నాయకులు హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి లో కొత్త గనులు రావడం కోసం, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్‌లపై ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె సింగరేణిలో విజయవంతం చేయాలని సింగరేణి జేఏసీ సంఘాల నాయకులు ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఐఎన్టీయుసి నాయకులు గడ్డం క్రిష్ణ, సిఐటియు నాయకులు నాగరాజు గోపాల్, టిబిజికేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, ఐఎఫ్టీయు నాయకులు కే.విశ్వనాథ్ లు పేర్కొన్నారు. సోమవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె ఓసిపి 5లో జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులు కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, మాదన మహేష్, రంగు శ్రీను, గండి ప్రసాద్, బోగ సతీష్ బాబు, గుర్రం ప్రభుదాస్,ఉదయ భాను, చంద తిరుపతి, గంద్ర దామోదర్ రావు, కే.శంకర్, మెండె శ్రీనివాస్, రాజ మౌళి, గౌస్, వడ్డెపెల్లి శంకర్, నూనె కొంరయ్య, పర్లపెల్లి రవి పాల్గొన్నారు.

**జగిత్యాల :** ఈ నెల 20న దేశవ్యాప్తసార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐయుటిసీ రాష్ట్ర నాయకులు సమ్మయ్య కోరారు. సోమవారం జగిత్యాలలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి.ముక్రమ్, సాయిశ్వరి, వెన్న మహేష్, ఎం.కిరణ్, సుమలత, వనిత, మమత, ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల...




పెద్దపల్లి..




మంచిర్యాల జిల్లా తాండూర్



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం తగదు



**ప్రజాపక్షం/చివ్వెంల:** త్వరగా కాంటాలు, వేసి కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం చివ్వెంల మండలంలోని కుడకుడ మోప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 9725.06 క్వింటాళ్ల ధాన్యం కుడుకుడ కొనుగోలు కేంద్రం నుండి తరలించడం జరిగిందని తెలిపారు. రైతులు తాలు లేకుండా తూర్పాలపోసి శుభ్రమైన ధాన్యంను తీసుకరావాలని, తేమ శాతం17 రాగానే సీరియల్ ప్రకారం కాంటావేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఆకాల వర్షాలు పడుతున్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌ఛార్జి చిట్టెమ్మ, సభ్యురాలు గీత, రైతులు పాల్గొన్నారు.



## వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం

స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలోని స్వయంభు వెంకటగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో సోమవారం రోజున స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నలు పాల్గొని స్వామివారికి యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వారు సమర్పించిన తలంబ్రాలు, పట్టు వస్త్రాలు అందచేశారు. ఈ కళ్యాణ మహోత్సవంలో సీఎం సీపీఆర్వో బోరెడ్డి అయోధ్యరెడ్డి పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వంశ పారంపర్య పూజారి రమాకాంత్ శర్మ, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూద గాని హరిష్ శంకర్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీ బాయి, దేవాలయ కమిటీ సభ్యులు కల్లూరి వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

## భావిభారత పౌరులు ధృడంగా ఉండాలి

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహ




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పిల్లలు భావిభారత పౌరులుగా ధృడంగా ఉండాలని, తల్లిదండ్రులు, గురువులు చెప్పేది బుద్దిగా నేర్చుకోవాలని, మంచి పౌరులుగా అందరికి మంచిపేరు తెస్తూ ఉన్నతస్థాయికి ఎదగాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నర్సింహా అన్నారు. వేసవి సెలవులు సందర్భంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట పట్టణంలోగల జిల్లా పరిషత్ పాఠశాలలో పిల్లలకు వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో పిల్లలకు మేధస్సు, జ్ఞాపక శక్తి, ప్రయోగాత్మక విధానం పెంపొందించే విధంగా ప్రయోగాత్మక ఇంటలిజెన్స్, యోగా, క్రాఫ్ట్ మ్యూజియం, కర్రసాము, సంప్రదాయ నృత్యం, సంగీత పరికరాలు, ఇండోర్ ఆటలపై శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసులకు, డయల్ 100 తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట డిఎస్పీ పార్ధ సారధి, జిల్లా భాల భవన్ సూపరింటెండెంట్ రాధాకృష్ణారెడ్డి, బాలభవన్ సభ్యులు, రిటైర్డ్ అధ్యాపకులు అమీద్‌ఖానఖ్,యోగా గురువు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యులందర్నీ అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం : వీరారెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరా రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలో మహిళల అక్షరాస్యత కూడా పెరగాలన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక పరంగా కృషి చేయాలన్నారు. ముందుగా ట్యూటర్లను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. తద్వారా జిల్లా స్థాయిలోనూ మండల స్థాయిలోనూ గ్రామస్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేసి ట్యూటర్ల చే శిక్షణ ఇప్పించాలని అంచలంచలుగా నిరక్షరాస్యతను రూపుమాపాలని తెలియజేశారు. జిల్లాలో సుమారు 99 వేల మంది నిరక్షరాస్యులు ఉన్నట్టు నివేదిక ఉన్నందున 21 వేల మంది అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలన్నారు. ఉల్లాస్ యాప్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని ఎన్ఐసిపి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, వయోజన విద్య ఉపసంచాలకులు మమత, విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ఉల్లాస్ జిల్లా సభ్యులు కృష్ణారెడ్డి, రెడ్ క్రాస్ సభ్యులు బాలాజీ, డిపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని సుద్దాల గ్రామంలో సోమవారం రుక్మిణి సమేత శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుండే ఆలయంలో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యకు స్వామి వార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. విగ్రహ దాత శివరాత్రి యాదగిరి వారి కుటుంబ సభ్యులు, వారి కుమార్తె అల్లుడు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, సోమన్న, యాదయ్య, కృష్ణమూర్తి, యాదగిరి, ఉప్పలయ్య, వీరస్వామి, శ్రీశైలం, నర్సింహాచారి, నర్సయ్య, ఎల్లయ్య, పాండరి, మల్లయ్య, రాజబోస్, మల్లయ్య, ఐలయ్య, కృష్ణారెడ్డి,గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

జిల్లా వెబ్ పోర్టల్‌లో శాఖల వారీగా వార్షిక కార్యాచరణ ప్రణాళికలు అప్‌డేట్ చేయాలి

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రజావాణిలో దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వెబ్ పోర్టల్ నందు శాఖల వారిగా డిపార్ట్‌మెంట్ ప్రొఫైల్, జిల్లా స్థాయి నుండి క్షేత్రస్థాయి వరకు సిబ్బంది వివరాలు, జాబ్‌చార్ట్, వార్షిక నివేదిక, శాఖల వారిగా అమలు చేసిన పథకాలు, లబ్ధిదారులు వివరాలు అప్డేట్ చేయాలని తెలిపారు. ప్రతి శాఖఖ కార్యాలయంలో ఒక్క అధికారిని నోడల్ అధికారిగా నియమించి శాఖపరంగా స్కీమ్స్ ప్రొగ్రామ్, సమస్యలు ఏమైనా ఉన్న తమకు తెలియజేయాలన్నారు. ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేయాలని, జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు సమన్వయం చేసుకుంటూ త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని కోరారు. ఈనెల 25వ లోపు సంక్షేమ అధికారులు, రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులని పరిశీలించి బ్యాంకు క్లియరెన్స ఇప్పించి లబ్ధిదారులని ఎంపిక చేయాలని, జూన్ 2 న ఎంపికైన లబ్ధిదారులకు ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజావాణిలో భూ సమస్యలకి సంబంధించి 21 దరఖాస్తులు, వివిధ ఎంపీడీవోలకు 18 దరఖాస్తులు, మున్సిపల్ కమిషనర్లకి 8, పంచాయతీ రాజ్ శాఖ 4, మిగిలిన 15 వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయని మొత్తం 66 దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులకు పంపడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి అప్పారావు, డిపివో యాదయ్య, డిడబ్ల్యూవో నర్సింహారావు, సిపివో కిషన్, డిఇవో అశోక్, డిఎంహెచ్‌వో కోటచలం, డిఎవో శ్రీధర్‌రెడ్డి, వేల్ఫేర్ అధికారులు శంకర్, దయానందరాణి, జగదీష్‌రెడ్డి, శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.




## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

**ప్రజాపక్షం/దేవరకొండ:** మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, నూనె రామస్వామిలు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి 44 ఉన్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి పెట్టుబడిదారులు, పారిశ్రామికవెత్తలకు అనుకూలంగా కార్మిక చట్టాలను కోడ్ రూపంలో తీసుకువచ్చి కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కు లేకుండా చేసిందన్నారు. భారత దేశానికి స్వాతంత్రానికి పూర్వ మే 1926లో కార్మిక చట్టాలు పెట్టుకునే చట్టం పోరాడి సాదించుకోవడం జరరిగిందని అటువంటి చట్టాలను కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో కరోనా కాలంలో మెజార్టీ పార్లమెంట్ సభ్యుల అభిప్రాయాలు తీసుకోకుండానే ఏకపక్షంగా కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి తీసుకువచ్చిందని దీనికి వ్యతిరేకంగా యావత్తు కార్మిక వర్గం మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, డివిజన్ కోశాధికారి వెంకటరాములు, నీల వెంకటయ్య, మల్లయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, ధనయ్య, సీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల విజ్ఞప్తులకు సత్వరమే పరిష్కారం



యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తు లను 56 స్వీకరించారు. అందులో కొన్ని ఇలా ఉన్నాయి. గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన కందాల శాంతమ్మ దరఖాస్తు అందిస్తూ భర్త కృష్ణా రెడ్డి మృతి చెందారని, వికలాంగురాలు అయినందున 4 ఎకరాల 32 కుంటల భూమి తనకు తెలియకుండా ఇద్దరు కొడుకులు వాళ్ళ పేర్లపై మార్చుకున్నారని, ఇల్లు కూడా విక్రయించుకున్నారని, తనను చూడడం లేదని తన భూమి తనకు ఇప్పించాలని కోరారు. భువనగిరి మండలం గౌస్ నగర్‌కు చెందిన సిహెచ్ మల్లారెడ్డి తన దరఖాస్తును అందిస్తూ సర్వే నెంబరు 144, 147లలో 17 ఎకరాల 26 గుంటల భూమి ఉందని ప్రక్కనే 148 సర్వేనెంబర్ లోని పల్లెర్ల మైసయ్య, యాదమ్మ, జంగం వెంకమ్మ, కందుకూరి జయమ్మ, వెల్వర్తి పోచమ్మ, నల్లెర్ల చంద్రయ్యలు తన భూమిని ఆక్రమిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భువనగిరి మండలం ఎల్బీ నగర్‌కు చెందిన బాలమణి తన భర్త చనిపోయాడని రేషన్ కార్డులో తన కొడుకు పేరు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హనుమపురంకు చెందిన ఎర్రబోయిన ఆండాలు భర్త పెద్ద నరసింహ పింఛన్ రావడంలేదని కూలి పనులపై ఆధారపడి జీవిస్తున్నామని దరఖాస్తు అందించారు. మోత్కూరు మండలం పొడిచెడు గ్రామానికి చెందిన మార్వాక స్వామి తనకు వారసత్వంగా వచ్చిన ఎకరం పావు భూమి ధరణిలో ఇతరుల పేరుపై నమోదయిందని తన పేరుపై చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ, జిల్లా పంచాయతీ శాఖ, సర్వే ల్యాండ్స్, హౌసింగ్, ఆర్‌టిసి, లేబర్, విద్య శాఖ, ఇంటర్మీడియట్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలకు దరఖాస్తులు వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, జడ్పీ సీఈఓ శోభా రాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం అభివృద్దే ధ్యేయం

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మండలంలోని తూర్పుపల్లి గ్రామంలో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ సోమవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం తూర్పుపల్లినుండి కొమ్మేపల్లి వరకు 2.70కోట్ల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మహబూబ్‌నగర్ జాతీయ రహదారి నుండి దౌరాజ్‌తండా వరకు 1.60 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ జమున మాధవరెడ్డి, పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, దేవేందర్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణయ్య, ధనలక్ష్మి , రాంసింగ్, ఎంపిడివో డానియల్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ మునుగోడు:** విత్తనాలు ఎరువులు పురుగు మందులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించాలని అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి పద్మజ మండల ఎరువుల దుకాణాల డీలర్లకు సూచించారు.సోమవారం మునుగోడు మండలం లోని ఎరువుల దుకాణాల డీలర్లకు మునుగోడు రైతువేదిక లో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందుబాటులో ఉంచాలని విత్తనాలు,ఎరువుల అమ్మకపు వివరాలను రికార్డుల్లో ప్రతి రోజు పొందుపరచాలని సూచించారు. రైతులకు బిల్లు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు మరియు లూజ్ విత్తనాలు ఎవరైనావా విక్రయం చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని మరియు నకిలీ విత్తనాలు కొని రైతులను మోసపోవద్దని లైసెన్స్ వున్న దుకాణాల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి బిల్లుల ను పంట కాలం పూర్తి అయ్యేవరకు జాగ్రత్త చేసుకో వాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మునుగోడు మండల డీలర్లు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ నిర్వీర్యం చేయడానికి కుట్ర




**ప్రజాపక్షం/మర్రిగూడ:** : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మర్రిగూడ మండలం మహాసభ మర్రిగూడ మండల కేంద్రంలో సిపిఐ కార్యాలయంలో జిల్లా బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి బొల్లుగిరి నరసింహ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని దానిలో భాగంగానే గత బడ్జెట్లో మాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి 80 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు ఈ పథకానికి అవసరమైన 2.50 లక్షల కోట్ల రూపాయలు కేటాయించి ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగాబందిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఉపాధి హామీ కార్మికులకు పని చేసే దగ్గర కనీస అవసరాలు అయినా మంచినీళ్లు , టెంటు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్టు పని ప్రదేశాల్లో అందుబాటు ఉంచాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన 6 గ్యారంటీలని అమలు చేయాలని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించాలని ఇంటి స్థలాలు ఉండి ఇల్లు లేని వారికి ఎలాంటి నిబంధనలు లేకుండా ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులు ఎండి జానీ మియా సిపిఐ మండల కార్యదర్శి బిక్షం రెడ్డ బాలకృష్ణ అంజయ్య రామలింగయ్య లింగస్వామి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక :** అధ్యక్షులుగా జిల్లా బాలకృష్ణ కార్యదర్శిగా జక్కలి అంజయ్య సహాయ కార్యదర్శిగా శిరసాల రామలింగం ఉపాధ్యక్షులుగా బుర్ర నరసింహ కోశాధికారిగా లింగస్వామి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.

# పోలీస్ కుటుంబానికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పోలీస్ కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడు పోలీస్‌శాఖ కృషి చేస్తుందని , రాంబాబు కుటుంబాన్ని పోలీస్‌శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నర్సింహా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో కోదాడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టుబుల్ రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. దివంగత పోలీస్ సిబ్బంది కుటుంబాల అవసరాల తీర్చడంలో భాగంగా రాంబాబు కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల చెక్కును ఎస్పీ అందజేశారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీస్ సిబ్బంది నుండి నెల జీతం నుండి విరాళం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ నాగభూషణరావు, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్‌గౌడ్, వేల్ఫేర్ ఆర్ ఎస్ఐ సాయిరాం, రాంబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**ఫిర్యాదుదారులతో మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ**

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కె.నర్సింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా వివిధ ప్రాంతల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి అర్జీలను పరిశీలించారు. ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను అదేశించారు.

## సిపిఐ అభ్యర్ధులను గెలిపించుకోవాలి




**ప్రజాపక్షం/మర్రిగూడ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి అన్నారు. సోమవారం తిరుగండ్లపల్లి గ్రామ శాఖ సమావేశం లో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని సత్తా చాటాలని ఈ సభ్యులకు సూచనలు ఇచ్చారు. అనంతరము జరిగిన సమావేశంలో నూతన కార్యదర్శిగా శిరసవాడ నరసింహను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు అల్వాల నరసింహ, రామిడి లింగారెడ్డి, అయితే పాక హరికృష్ణ, కాగు ముత్యాలు, కాగు సత్తయ్య, లింగం, బత్తుల నరసింహ తదితరులు పాల్గొన్నారు. బట్లపల్లి నూతన శాఖ సమావేశం సోమవారం జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మాధగోని నరసింహ, సహాయ కార్యదర్శిగా ఆవుల భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా బడేటి రామస్వామి. ఎన్నుకోవడం జరిగింది.

# దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**ప్రజాపక్షం/ మునుగోడు :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు గోస్కొండ లింగయ్య డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మునుగోడు ఇంచార్జ్ తహసిల్దార్ నరేష్ కు వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించడంలో దళితులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని నియోజకవర్గానికి 3500 కేటాయించితే ప్రతి గ్రామానికి ఒక బూతుకు ఎనిమిది ఇండ్లను కేటాయించారు. ఫలితంగా గ్రామస్థాయిలో దళితులకు సరైన ప్రాధాన్యత లేక ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో తీవ్రమైనటువంటి అన్యాయం జరుగుతుందని దళితులకు ఇందిరమ్మ ఇండ్లలో 50శాతం కేటాయించాలన్నారు.దళిత యువతకు రాజీవ్ యువ వికాస్ పథకంలో సిబిల్ సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలకు ప్రాధాన్యత ఇస్తామని అంటున్నారు. రోజ కూలి పని చేసుకుని బతికే వారికి బ్యాంకు సిబిల్ స్కోర్ ఏ విధంగా పెరుగుతుందని ఈఅంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ఇంటి స్థలాలు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్ పి ఎస్ నాయకులు దుబ్బ వెంకన్న, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఈదులకంటి కైలాస్, దుబ్బ ముత్యాలు, ఏర్పుల నరేష్ ఉన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## అంగరంగ వైభవంగా ఆదిదంపతుల కళ్యాణం



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజీ దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ఆదిదంపతులైన శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి చేరుకొని భక్తి శ్రద్ధలతో ఆదిదంపతుల కళ్యాణం తిలకించి స్వహస్తాలతో స్వామి అమ్మవార్లకు తలంబ్రాలు వేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేశారు.

## యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/అచ్చంపేట :** గంజాయి మత్తులోపడి యువత చిత్తవుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో యువత మేలుకో గంజాయి మానుకో కరపత్రం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగపరిరక్షణసంస్థ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. గతంలో యువకులు మాదకద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను నష్టం చేసుకున్నారని అన్నారు. యువత గంజాయి, గుట్కాలాంటివాడి క్యాన్సర్ బారిన పడ్డారన్నారు. యువత మత్తులో చిత్తై ఎన్నో కుటుంబాలు చిద్రమయ్యాయని అన్నారు. ఎంతోమంది చిన్నవయసులో మరణించడం బాధాకరమన్నారు. ఇటీవలికాలంలో యువత సారా, విస్కీలాంటి మర్చిపోయి మాదకద్రవ్యాలకు అలవాటుపడ్డారని వీటిని ప్రభుత్వం కట్టడం చేయడంలో పట్టణప్రాంతంలో ఓష్‌అయిల్‌కు అలవాటుపడ్డారని అన్నారు. గ్రామీణప్రాంతంలో గంజాయికి బానిసలయ్యారని అన్నారు. కార్యక్రమంలో నల్లమల రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యులు, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత



**ప్రజాపక్షం/మద్దూర్ :** మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను టాస్క్‌ఫోర్స్ మద్దూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఎక్కమేడు గ్రామ శివారులో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ వీరప్ప, ఓనర్ ఎం.జయరామ కోయిల్‌కొండ మండలానికి చెందిన వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను భూనీడు గ్రామ శివారులో మద్దూర్ పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బూనీడుకు చెందిన ట్రాక్టర్ ఓనర్ హన్మీరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. మద్దూరు పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

## సిఎం సహాయనిధి చెక్కుల అందజేత



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ కేంద్రం ఎమ్మెల్యే నివాసంలో మక్తల్ పట్టణానికి చెందిన పసుల సుకన్య (20000) కొల్వూర్ మహేశ్వరి (29000) వాణిశ్రీ (22000), షేక్ జహంగీర్ (32000) లకు సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మక్తల్ పట్టణ అధ్యక్షులు పలుకూరి రవికుమార్, డైరెక్టర్స్ ఫయాజ్ శాలం బీన్ ఉమర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గొల్లపల్లి నారాయణ బోయ నరసింహ బిస్కెట్ నాగరాజు శంషోద్దీన్ పాల్గొన్నారు.

## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె




**ప్రజాపక్షం/పాన్‌గల్ :** మే 20న నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి. జబ్బార్ అన్నారు. పాన్‌గల్ మండల కేంద్రంలో సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో రౌండ్ టేండ్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మిక , ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించాలని మే 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామని ఈ సమ్మెను బీజేపీ అనుబంధ సంఘం బిఎంఎస్ తప్ప మిగతా అన్ని కార్మిక సంఘాలు కేంద్ర కార్మిక సంఘాలు, రాష్ట్ర కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయని విజయవంతం చేసేందుకు అన్ని కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్య నాయక్, కెవిపిఎస్ జిల్లా నాయకులు భీమయ్య, సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశ రాము, ఐకేపి విఓఎల్ జిల్లా నాయకులు రాజయ్యగౌడ్, రైతు సంఘం మండల కన్వీనర్ భాస్కర్, బాలరాజు, ధర్మయ్య, భాస్కర్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు రేణుక, అలివేలు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపతయ్య, హరిజనయ, చంద్రశేఖర్, కురుమయ్య, పెంటయ్య, డివైఎఫ్ఐ నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

## నర్సింగ్ డే దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ దినోత్సవ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్లు ఊర్మిళ, చరిత, బాలమణి, కేతవత కృష్ణ, సిబ్బందికి మండల వైద్యాధికారి డా.ప్రవళిక ఆధ్వర్యంలో వారికి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. వారి సేవలు ప్రజలకు ఎంతో అవసరం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ పార్వతి మేడమ్, హెల్త్ అసిస్టెంట్‌లు రాజశేఖర్, తిరుపతయ్య, ఏఎన్ఎం వెంకటమ్మ, ఫార్మసి ఆఫీసర్ కుమారి, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, ల్యాబ్ టెక్నిషియల్, విక్టర్ రాజు, అటెండర్ సూర్య బాబు, గౌరీ, 108 సిబ్బంది ఖాజా పాల్గొన్నారు.

# అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎలాంటి అవకతవకలకు చోటు ఇవ్వకుండా అర్హులకు ఇందిరమ్మ ఇల్లువచ్చే విధంగా చూడాలని పేర్కొన్నారు. నిజమైన పేదప్రజలకు లబ్ధిచేకూరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలుచేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ నిజమైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లువచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పారదర్శకత పాటిస్తామని అర్హులకు పక్కా ఇండ్లు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీసింగ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్‌కుమార్, అశోక్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహ్మా, మోతిలాల్‌నాయక్, వెంకటేశ్వర్లుగౌడ్, సంజీవ్‌యాదవ్, రాహుల్, చంద్రకాంత్‌రెడ్డి, రేష్మ బేగం, రమాకాంత్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల న్యాయానికి పోలీస్ శాఖ పట్టు

గ్రీవెన్స్ డేలో 14 ఫిర్యాదులు
స్వీకరణ: ఎస్పి డి.జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి మొత్తం 14 ఫిర్యాదులు స్వీకరించబడినట్టు ఆమె పేర్కొన్నారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసి, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదుదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వారి వినతులను గౌరవంతో స్వీకరించాలని సూచించారు. అవసరమైతే, క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్టపరంగా న్యాయం జరిగేలా చూడాలని ఆమె తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతుందని చెప్పారు. ఇలా చేయడం వల్ల ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా, తక్షణమే స్పందన లభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ డి.జానకి అన్నారు.

# ప్రజావాణితో ఫిర్యాదుల పరిష్కారం

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లో పెండింగ్లో ఉన్న ఫిర్యాదులను ప్రజావాణి ద్వారా పరిష్కరించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా సోమవారం ఉదయం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 11 మంది ఫిర్యాదుదారుల యొక్క ఫిర్యాదులను జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడి వెంటనే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తదుపరి కేసు విచారించి పరిష్కరించాలని తెలిపారు. భూ తగదాలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేస్తే తప్పకుండా రసీదు, ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలని పోలీస్ అధికారులకు తెలిపారు. ఫిర్యాదులు పెండింగ్లో ఉంటే అందుకు సంబంధించిన సమాచారాన్ని ఫిర్యాదుదారులకు తెలియజేయాలని తెలిపారు. జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా భద్రత కల్పించాలని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్ విడుదల




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సోమవారం ఎఐటియూసి జిల్లా కార్యాలయంలో గోడపత్రికలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎఐటియూసి జిల్లాకార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. దేశంలో కార్మికులతోపాటు అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. 2017–2018 సంవత్సరం , 2023–2024 అధికారిక లెక్కలప్రకారం కార్మికుల వేతనాలు తగ్గాయని నివేదిక వెల్లడిస్తుందన్నారు. దేశంలో ఒకపక్క నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతుంటే ఉపాధి పెరుగుదల 1.5శాతంమాత్రమే అంటే దేశంలో నిరుద్యోగితభూతం ఎంత దారుణంగా ఉందో చెప్పనవసరం లేదన్నారు. మరొపక్క కార్పొరేట్ రంగం తన లాభాలు 22.3 శాతం పెరిగాయని చెబుతూ ఆర్థిక నివేదిక ప్రతిబింబిస్తుంటే ప్రభుత్వం మోసపూరితమాటలతో దేశం వెలిగిపోతుందని, అచ్చేదిన్ ఆయేగా అని కేంద్రప్రభుత్వం చెబుతుంటే కార్మికులు సచ్చేదినం వస్తుందని వాపోతున్నారని అన్నారు. కావున నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా అన్ని తాలుకా స్థాయిల్లో దేశవ్యాప్త సమ్మెను అన్ని సంఘాలను కలుపుకొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియూసి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటస్వామి, ఎఐటియూసి జిల్లానాయకులు సత్యం, శ్రీను, రాములు, సింగోటం పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికీ ఇవ్వాలి : బాల్‌నర్సింహ డిమాండ్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఇందిరమ్మ ఇండ్లు అర్హులైనవారందరికి ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు బాల్‌నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో టిఎన్‌జిఓస్‌భవన్ సిపిఐ పార్టీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు గ్రామంలో ఎంతమందికి మంజూరయ్యాయో గ్రామపంచాయతీ నోటీసు బోర్డుపై లిస్టు వేయాలని తెలిపారు. రాజీవ్ యువవికాస్ పథకంలో దరఖాస్తు పెట్టుకున్న ప్రతి నిరుపేద యువకులకు సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రుణాలు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఆగస్టు మొదటివారంలో సిపిఐ జిల్లా 3వ మహాసభలు కల్వకుర్తి పట్టణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసమావేశంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు ఎండి. ఫయాజ్, కేశవులుగౌడ్, వార్లవెంకటయ్య, ఈర్లచంద్రమౌళి, విజేయుడు, నర్సింహ, శంకర్‌గౌడ్, డాక్టర్ శ్రీనివాస్, పులిజాల పరుషరాం, బాలమురళి, తుమ్మలశివుడు, శివశంకర్, గద్దం శ్రీను, లక్ష్మి పతి, బిజ్జ శ్రీనివాస్, కిరణ్, బొల్లెద్దుల శ్రీనివాస్, మర్యాదవెంకటయ్య, మధు, ప్రేమ్ పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ టౌన్ నందు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ భగవంతు రెడ్డి ఇతర సిబ్బంది కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురు వ్యక్తులపై 2వ జెఎఫ్‌సిఎం కోర్టు జడ్జి ఆర్.శశిధర్ విచారించి, ఒక వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష విధించగా, ఇంకొకరికి రూ.2000 జరిమానా మిగతా ఇద్దరికి తలసరి రూ.1000 చొప్పున నగదు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ భగవంతురెడ్డి మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ప్రజల ప్రాణాలను రక్షించడం మా ప్రధాన లక్ష్యం మద్యం సేవించి వాహనం నడిపే వారు తమకే కాకుండా ఇతరుల జీవితాలను కూడా ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఇలాంటి చెక్‌లు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ కఠిన చర్యలు తీసుకుంటాము. మద్యం సేవించి వాహనం నడిపే వారు తగిన శిక్షలకు గురవుతారని హెచ్చరిస్తున్నామని తెలిపారు.

## పేదలకు ఆపన్న హస్తం సిఎంఆర్‌ఎఫ్



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** పేద, మధ్య తరగతి ప్రజలకు సిఎంఆర్‌ఎఫ్ పథకం ఆపద్భాంధవులాంటిదని జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, గోపాల్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వీపనగండ్ల, కల్వరాల, కొర్లకుంట గ్రామాలలో వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొంది సిఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహకారం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రాష్ట ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరైన సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను కల్వరాల నర్సింహతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితులకు సీఎంఆర్ చెక్కులను అందజేశారు. వీపనగండ్లలో కమలమ్మకు 13,500, గడ్డమీది భాగ్యమ్మకు రూ.5,500, దేశమోని బస్వరాజ్ గౌడ్‌కు 16వేలు, దయ్యపు సంధ్యారాణికి 25వేలు, మద్దిలేటికి 12,500, చిన్నమ్మకు 25వేలు, కల్వరాలలో బండారు భార్గవికి 37,500, కొర్లకుంటలో మూడవత్ శంకర్ కు 47,500, బాణావంత్ నానుకు రూ.20,500ల సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, వీపనగండ్ల, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నక్క విష్ణు, నాయకులు మహేష్, గోపి, బత్తుల అదయ్య, వెంకట్ రెడ్డి, రామానందరావు, పూర్ శేఖర్, బండారు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిఎం పర్యటనకు సభాస్థలి పరిశీలన



**ప్రజాపక్షం/అచ్చంపేట :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న నల్లమల అడవిలోని అమ్రాబాద్ మండలానికి రానున్నందున సభాస్థలాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పరిశీలించారు. అచ్చంపేట నియోజకవర్గానికి మొదటిసారి వస్తున్నందున తగు ఏర్పాట్లు చేయాలని అన్నిశాఖల అధికారులతో మాట్లాడారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు అటవీశాఖ గెస్ట్‌హౌజ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరా సౌర గిరిజలవికాసం ప్రారంభిస్తున్నారని ఆయ న తెలిపారు. ఈ పథకం ద్వారా పోడు భూములకు నీరు అందించడంతోపాటు విద్యుత్ సౌకర్యం లేకుండా సౌర విద్యుత్‌ద్వారా పంటలు పండించుకోవచ్చని తెలిపారు. 18న ఉదయం 10గంటలకు మాచారం గ్రామంలో బహిరంగసభ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తోపాటు జిల్లా డిఎఫ్ఓ, ఐటిడిఏపిఓ రోహిత్ గోపిడి, డిఎస్‌పి శ్రీనివాసులు, ఐకెపి జిల్లా అధికారులు , మహిళా సంఘాలు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఐటిడిఎ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అనూషప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్‌చైర్మన్ జలేంధర్‌రెడ్డి, నామినేషన్ చైర్మన్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నర్స్ వృత్తి ఎంతో పవిత్రమైంది

ప్రభుత్వ ఆసుపత్రి
సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ కిషన్



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా :** అంతర్జాతీయ నర్సింగ్ ఆఫీసర్స్ దినోత్సవ సందర్భంగా నారాయణపేట గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో సోమవారం నర్సింగ్ ఆఫీసర్ నర్సింగ్‌డేని ఘనంగా జరుపుకున్నారు. దీనికి ముఖ్య అతిథి హాస్పిటల్ సూపరింటెండెంట్ ప్రిన్సిపల్ డా.రామ్ కిషన్ నర్సులను ఉద్దేశించి మాట్లాడుతూ నర్సు వృత్తి గౌరవానికి ప్రతీకైనా ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు 1820 మే 12వ తేది 1854లో క్రిమియన్ యుద్ధం సందర్భంగా 38 నర్సుల బృందంగా గాయపడిన సైనికులకు విశిష్ట సేవలు తమ ప్రాణాలు లెక్కచేయక అందించారు. అందుకు ఆ బృంద నాయకురాలు నైటింగేల్ మార్గదర్శకురాలు నిరంతరం రాత్రి అంతా సేవలు అందించేందుకు దీపం పట్టుకుని తిరిగేది దీంతో ఆమెను లేడీ విత్ ద లాంప్ అని పిలిచేవారు. నర్సులు, లేకపోతే హాస్పిటల్ ఉండదు, వైద్యులతో పాటు నర్సులు అందించే సేవలు వెలకట్టలేనిది అందుకే రోగుల పాలిట ప్రత్యక్ష దైవాలు నర్సులు అని పేర్కొన్నారు.

## విద్యుత్‌షాక్‌కు గురై మరణించిన కుటుంబాలకు పరామర్శ

కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** విద్యుత్ షాక్‌తో ఆదివారం మరణించిన జడ్చర్ల మున్సిపాలిటీ చెందిన కౌరంపేట గుమ్మకొండ ఆంజనేయులు, బండమీదపల్లి గ్రామానికి చెందిన మౌనికుమార్ వారి కుటుంబాల దగ్గరికి వెళ్లి వారి పూర్తి వివరాలు తెలుసుకొని వారి కుటుంబానికి ప్రగఢ సానుభూతి తెలియజేశారు. చనిపోయిన ఇద్దరు కూడా యువకులు కాబట్టి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఒక్కొక్క కుటుంబానికి 20 లక్షల చొప్పున పరిహారం అందించాలన్నారు. పరామర్శించిన వారిలో చర్లపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ వార్డ్ మెంబర్ చెన్నయ్య, బూరుగుపల్లి శేఖర్, లీడర్ శ్రీను పరామర్శించారు.

## శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ పున:నిర్మాణానికి భూమిపూజ



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలకేంద్రంలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ పునర్‌నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీచౌడేశ్వరిదేవి శక్తిపీఠాలలో ఒకరన్నారు. ప్రస్తుతమున్న శ్రీచౌడేశ్వరిదేవి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతనంగా అమ్మవారి ఆలయాన్ని నిర్మించడానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో యాదవుల వేదపండితులు, కులస్తులు, మాజీ ఎంపిటిసి బాలమాసయ్య, కొండా నగేష్, ఈశ్వర్, బిజినేపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షులు మిద్దెరాములు, జిల్లాకాంగ్రెస్ ఉపాధ్యక్షులు ముక్తార్, మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నజీర్, మాజీసర్పంచ్ తిరుపతయ్య, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

# క్రీడ


## టెస్టులకు విరాట్ కోహ్లీ గుడ్ బై..

ఇంగ్లాడ్ పర్యటనకు ముందు క్రికెట్ అభిమానులకు బ్యాడ్ న్యూస్. స్టార్ క్రికెటర్, మాజీ సారథి విరాట్ కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలికాడు. కెప్టెన్ రోహిత్ శర్మ బాటలోనే అతడు కూడా సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగభరిత పోస్ట్ పెట్టాడు. తాను కూడా టెస్టుల నుంచి రిటైరవ్వాలనుకుంటున్నట్లు ఇటీవల బీసీసీఐకి చెప్పిన కోహ్లీ.. తాజాగా దీనిపై అధికారిక ప్రకటన చేశాడు. ''14 ఏళ్ల క్రితం తొలిసారిగా టెస్టు క్రికెట్ జెర్సీ ధరించా. ఈ ఫార్మాట్ నన్ను ఇంత దూరం తీసుకెళ్తుందని నేనెప్పుడూ ఊహించలేదు. ఇది నన్ను పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితానికి సరిపడా పాఠాలు నేర్పించింది. తెల్ల జెర్సీలో ఆడటం వ్యక్తిగతంగా నా మనసుకు చాలా ప్రత్యేకమైనది. నిశ్శబ్దమైన ఆనందం.. సుదీర్ఘమైన రోజులు.. ఎవరికీ కన్పించని చిన్న చిన్న క్షణాలు నాతో ఎప్పటికీ ఉంటాయి'' ''అలాంటి ఈ ఫార్మాట్ నుంచి దూరం జరగడం అంత తేలిక కాదు. కానీ, నా నిర్ణయం సరైనదే అనిపిస్తోంది. ఈ ఫార్మాట్ కోసం నేను ఎంతో ఇచ్చా. నేను ఆశించిన దానికంటే ఎక్కువే ఇది నాకు తిరిగిచ్చింది. మనసు నిండా సంతృప్తితో, కృతజ్ఞతాభావంతో దీని నుంచి వైదొలుగుతున్నా. వెనక్కి తిరిగి నా టెస్టు కెరీర్‌ను చూసుకుంటే నా ముఖంలో చిరునవ్వు కన్పిస్తుంది. ప్రేమతో ఇక సైనింగ్ ఆఫ్..'' అని కోహ్లీ తన పోస్టులో రాసుకొచ్చాడు.కాగా.. గతేడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం రోహిత్ శర్మ, కోహ్లీ ఒకేసారి పొట్టి క్రికెట్‌కు టాటా చెప్పారు. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం రోహిత్ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అభిమానులకు షాకిచ్చాడు. అతడు వైదొలగడంతో ఇంగ్లాండ్ పర్యటనకు కోహ్లీ అత్యంత కీలకమవుతాడని అంతా భావించారు. అంతలోనే తాను కూడా రిటైర్ అవ్వాలనుకుంటున్నానని విరాట్ బీసీసీఐకి సమాచారమిచ్చాడు. దీంతో అతడికి సర్దిచెప్పేందుకు బోర్డు ప్రయత్నించింది. కానీ, కోహ్లీ మాత్రం తన టెస్టు కెరీర్‌ను ముగించేందుకే సుముఖత చూపించాడు. 2011 మధ్యలో టెస్టు క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కోహ్లీ.. ఇప్పటివరకు 123 టెస్టులు ఆడి 9,230 పరుగులు సాధించాడు. ఇందులో 30 శతకాలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ ఫార్మాట్‌లో విరాట్ వ్యక్తిగత అత్యధిక స్కోరు 254 పరుగులు. 2025 జనవరి 3న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడాడు. టెస్టుల్లో ఎన్నో గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడిన విరాట్.. పది వేల పరుగుల మైలు రాయికి కొద్ది దూరంలోనే నిలిచి.. ఈ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు.

కోహ్లీ.. గుండె ధైర్యం, పరుగుల దాహం, పట్టువదలని క్రీడా స్ఫూర్తి .. కోహ్లీకి ప్రత్యేకమైనవి. కోహ్లీ నిజంగా కింగే. హుందాగా ఆడుతూనే అతను ఆ ఫార్మాట్‌ను డామినేట్ చేసిన తీరు.. క్రికెట్ హిస్టరీలోనే ఓ కొత్త అధ్యాయంగా నిలిచి పో-

అతనికి అతనే సాటి. టెస్టుల్లో అతనో మైటీ వారియర్. ఆ యోధుడు ఇప్పుడు టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై ప్రకటించాడు. అద్భుతమైన కెరీర్‌కు ఫుల్ స్టాప్ పెట్టేశాడు. ఎందరో క్రికెటర్లకు ఇన్‌స్పిరేషన్‌గా నిలిచాడు ఆ స్టార్ బ్యాటర్.

### కోహ్లీ రిటైర్మెంట్‌పై అనుష్క శర్మ ఎమోషనల్ పోస్టు




కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించడాన్ని స్వాగతిస్తూ అతని సతీమణి అనుష్క శర్మ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్టు పెట్టింది. 'అందరూ రికార్డులు, మైలురాళ్ల గురించే మాట్లాడవచ్చు.. నాకు మాత్రం నువ్వు దాచుకున్న కన్నీళ్లు.. బయటకు తెలియకుండా నీతో నువ్వు చేసిన యుద్ధాలు గుర్తుండిపోతాయి. టెస్టు ఫార్మాట్‌పై నీవు చూపిన ప్రేమను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. ప్రతి టెస్టు సిరీస్ తర్వాత నువ్వు ఎంతో గొప్పగా తిరిగి వచ్చేవాడివి. నువ్వు ఎదిగిన విధానాన్ని పక్కన ఉండి చూడటం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. ఏదో ఒక రోజు టెస్టుల నుంచి రిటైర్ అవుతావని తెలుసు. కానీ, నువ్వు ఎల్లప్పుడూ నీ మనసు చెప్పిన ప్రకారమే నిర్ణయం తీసుకుంటావు. ఆటలో ప్రతిదీ సాధించావు. గుడ్ బై చెప్పడానికి అర్హుడివని భావిస్తున్నా' అని అనుష్క శర్మ భావోద్వేగానికి గురైంది.

### థ్యాంక్యూ విరాట్ కోహ్లీ.. బిసిసిఐ వీడియో రిలీజ్

టెస్టు బ్యాటింగ్ యావరేజ్‌తో అందర్నీ స్టన్ చేసిన విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌పై సోమవారం బీసీసీఐ ఓ వీడియోను రిలీజ్ చేసింది. తెలుపు దుస్తుల్లో కోహ్లీ చాటిన ఘనతను ఆ వీడియోలో ప్రజెంట్ చేసింది బిసిసిఐ. టెస్టు క్రికెట్‌లో తనను ఉత్తేజపరిచింది ఆ గేమ్‌లో ఉన్న ఛాలెంజ్ అని కోహ్లీ వీడియోలో పేర్కొన్నాడు. బీసీసీఐ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసిన వీడియోను మీరూ తిలకించండి.

## తారక రామారావు సినీ రంగ ప్రవేశం..



నందమూరి హరికృష్ణ మనవడు, జానకీరామ్ కుమారుడు నందమూరి తారక రామారావు హీరోగా పరిచయమవుతున్న విషయం తెలిసిందే. నందమూరి వంశం నాలుగో తరం వారసుడిగా తారక్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నేడు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ వేడుకకు నారా భువనేశ్వరి, దగ్గుబాటి పురందేశ్వరి, గారపాటి లోకేశ్వరి తదితరులు హాజరయ్యారు. నారా భువనేశ్వరి హీరో హీరోయిన్లపై క్లాప్ కొట్టి వారిని అభినందించారు. అయితే ఈ మూవీ ప్రారంభమైన సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా తారక రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు. తారక రామారావు ఇండస్ట్రీలో అడుగుపెడుతున్న సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఎన్టీఆర్ గొప్ప విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నాను అని సీఎం చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మూవీ ప్రారంభోత్సవం అనంతరం హీరో తారక రామారావు మాట్లాడుతూ, మా ముత్తాత ఎన్టీఆర్, మా తాత హరికృష్ణ, మా నాన్న జానకీరామ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయని నమ్ముతున్నాను. ఈ రోజు నా కుటుంబ సభ్యులందరూ నన్ను ప్రోత్సహించడానికి ఇక్కడికి రావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ప్రేక్షకుల ప్రేమాభిమానాలే నన్ను ముందుకు నడిపిస్తాయని నమ్ముతున్నాను. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచి మీడియా ఎంతో సహకరించింది. వారందరికీ కృతజ్ఞతలు అని అన్నారు.

## సూర్య కుమార్‌గా ఉపేంద్ర ఎంట్రీ!




ఉస్తాద్ రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రం ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. దర్శకుడు పి.మహేష్ బాబు డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో సాగర్ అనే పాత్రలో సరికొత్త మేకోవర్‌తో రామ్ నటిస్తున్నాడు. ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను రామ్ బర్త్‌డే కానుకగా మే 15న రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ వెల్లడించారు. అయితే, తాజాగా ఈ మూవీ నుంచి మరో సాలిడ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో కన్నడ స్టార్ ఉపేంద్ర సూర్య కుమార్ అనే పాత్రలో నటిస్తున్నాడు. ఈ మేరకు ఆయన ఫస్ట్ లుక్‌ను రివీల్ చేశారు. ఈ సినిమాకు వివేక్‌మెర్విన్ ద్వయం సంగీతాన్ని అందిస్తున్నాడు. మరి ఈ సినిమాకు ఎలాంటి టైటిల్ పెడతారా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# రీల్

## 'విద్యా బాలన్' కోసం పాత్ర రెడీ! పూరి జగన్నాథ్



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా ఓ సినిమా రాబోతుంది. నేటి రాజకీయాల పై ఈ చిత్రం ఉండబోతుందని.. పైగా సినిమాలో పొలిటికల్ సెటైర్లు చాలా ఉంటాయని.. నేటి సమాజానికి తగ్గట్టు పూరి స్క్రిప్ట్ రెడీ చేశాడని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ విద్యా బాలన్ ఓ కీలక పాత్రలో నటిస్తోందని, పైగా రాజకీయ నాయకురాలి పాత్రలో ఆమె కనిపిస్తారని తెలుస్తోంది. సహజంగా పూరి క్యారెక్టర్స్‌లో డెప్త్ ఉంటుంది. మరి రాజకీయాల పై ఎలాంటి పాత్రలు రాశాడో చూడాలి. ఐతే, పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా వచ్చిన డబుల్ ఇస్మార్ట్ ఆశించిన స్థాయిలో పాజిటివ్ టాక్ ను తెచ్చుకోలేక పోయింది. ముఖ్యంగా పూరి గత సినిమాలతో పోల్చుకుంటే.. ఈ సినిమాలో బలమైన కంటెంట్ మిస్ అయ్యింది అంటూ కామెంట్స్ వినిపించాయి. ఈ నేపథ్యంలో పూరి, విజయ్ సేతుపతి కోసం బలమైన కథను రాశాడట. మరి ఈ సినిమాతో పూరి ఏ రేంజ్ హిట్ ను అందుకుంటాడో చూడాలి.

## రైతులకు పూర్తిస్థాయి రుణ మాఫీకి చర్యలు తీసుకోవాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సిపిఐ నేతలు చాడ వెంకటరెడ్డి, టి నరసింహ్మ విజ్ఞప్తి..



ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతులకు పూర్తిస్థాయి రుణ మాఫీ చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును చాడ వెంకటరెడ్డి, ఈటి నరసింహా కలిసి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామి ఇచ్చిన రైతు రుణమాఫీకి సంబంధించి రూ.2లక్షల లోపు ఉన్న రుణాలు కూడా చాల మంది రైతులకు ఇప్పటికి మాఫీ కాలేదని, వాటిని తక్షణమే మాఫీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. గతంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక లక్ష రూపాయల రుణమాఫీ చేపట్టి విడుతల వారిగా అమలు చేయడంతో రైతులపై వడ్డీ భారం పడిందని, ప్రస్తుతం ప్రభుత్వం విధించిన షరతుల ప్రకారం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఏర్పడిందన్నారు. కుటుంబంలో యజమాని, ఆయన భార్య, కుమారుడు, కోడలు ఇలా భూమి పేరు మీద ఉన్నవారందరూ రుణాలు తీసుకున్నారని, దీంతో అవి మొత్తం కల్పితే రూ.2 లక్షలకుపైబడి ఉంటాయి. కుటుంబాన్ని యూనిట్‌గా తీకోవడంతో దాదాపు 40 శాతం పైబడి రైతులకు రుణమాఫీ కాలేదు .ఉదాహరణకు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో 2 లక్షల రుణమాఫీకి అర్హులైనవారు 9588 ఉండగా అందులో 5864 మందికి రుణమాఫీ కాగా, ఇంకా మిగిలిన రైతులు 3724 మందివి రుణమాఫీ పెండింగ్‌లో ఉండటంతో రైతులు బ్యాంకర్లు, వ్యవసాయ అధికారి కార్యాలయాల చుట్టు తిరిగి విసిగి వేసారి పోతున్నారని తెలిపారు. మరోవైపు ప్రభుత్వం రూ.2 లక్షల వరకు ప్రభుత్వం అప్పును మాఫీ చేయనుంది, రెండు లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని రైతులు బ్యాంకులకు చెల్లించాలనే స్పష్టమైన హామీ ఉంటే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. రైతులకు అసలు, వడ్డీ కలిపి రెండులక్షలకు పైబడి బాకి ఉన్నట్లు చూపించడంతో వారికి కూడా మాఫీ కావడం లేదని తెలిపారు. మరోవైపు జూన్‌లోపు పంట రుణం రెన్యూవల్ చేసుకోకపోతే ప్రభుత్వ నిబంధనలు అనుసరించి వడ్డీ మాఫీ కాదని, రుణం రెనివ్వల్ చేసుకుంటే రుణమాఫీ అయ్యే అవకాశ ముండదేమో అనే మీమాంసంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే దీనిపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించి ఈ సమస్యలకు పరిష్కార మార్గం చూపాల్సిందిగా తుమ్మల నాగేశ్వరరావుకు చాడ వెంకటరెడ్డి, ఈటి నరసింహా కోరారు.

## కమిషనర్ల నియామకం

(మొదటి పేజీ తరువాయి)

బోరెడ్డి అయోధ్యరెడ్డి ఉన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలువురి పేర్లను ప్రతిపాదిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫైల్‌ను పంపింది. తాజాగా ఆయన ఆమోదం తెలపడంతో ప్రభుత్వం వారి నియామకంపై ఉత్తర్వులు జారీ చేసింది.కాగా ఇటీవలనే రాష్ట్ర ప్రధాన సమాచార చీఫ్ కమిషనర్‌గా జి.చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో నలుగురు ఆర్‌టిఐ కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.పౌరులకు సమాచారం అందించడంలో ఆర్‌టిఐ చట్టం కీలక పాత్ర పోషిస్తున్న విషయం విదితమే. కొత్తగా నియమితులైన కమిషనర్లు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంలో సమాచార కమిషన్ పాత్ర అత్యంత ముఖ్యమైనది.








## టెర్రరిస్టులను మట్టుబెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

సభ జరిగింది. ముఖ్య అతిధులుగా నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కశ్మీర్‌లో అమాయకులను చంపి అందులో కొత్తగా పెళ్లయిన జంటలోని నేవి ఆఫీసర్‌ను చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. టెర్రరిస్టులు ఇప్పటి వరకు ఎక్కడైన ఆకస్మికంగా కాల్పులు జరపడం వెళ్లిపోవడమే చూశామని, మొదటిసారి మత ప్రాతిపదికన చంపడం జరిగిందన్నారు. దేశంలో జరుగుతున్న టెర్రరిస్టు దాడులపై ప్రజలకు అనేక అనుమానాలు వస్తున్నాయన్నారు. దేశంలో ఎన్నికలు జరిగినప్పుడే టెర్రరిస్టులు దాడులు జరపడం అమాయకులు బలికావడం దానిని బిజెపి పార్టీ వాడుకోవడం, అనుమానాలకు తావిస్తుందన్నారు. అమెరికా ఒకవైపు, పాకిస్తాన్‌లో ఆర్థిక సంభంధాలు కొనసాగిస్తునే టెర్రరిస్టు కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించడం జరుగుతుందన్నారు. టెర్రరిస్టులను అంతమొదించడం ప్రపంచ దేశాలన్ని కలిసి శాశ్వత పరిష్కారం వెతకాలన్నారు. పాకిస్తాన్‌లో ఉన్న ముస్లీంలందరూ టెర్రరిస్టులు కాదని, అక్కడ కూడా టెర్రరిజాన్ని వ్యతిరేకించే సామాన్య ప్రజలు ఉన్నారని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. పాకిస్తాన్‌లోని టెర్రరిస్టులను అంతమొందించాలి కాని, సామాన్య ప్రజలను కాదన్నారు. తీవ్రవాద సమస్యకు కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చేయడం బిజెపి ప్రభుత్వానికి ఇష్టం లేనట్లుందని విమర్శించారు. మతాన్ని, టెర్రరిజాన్ని ఎన్నికల లబ్ధి కోసం ఉపయోగించుకోవడం అటవీక సాంప్రదాయమని, అది కొంతమంది నాయకుల శాడిస్టు మెంటాలిటీని తెలియజేస్తుందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ, ఆర్ఎస్ఎస్ రెండు ఒకే సంవత్సరం ఆవిర్భవించిన దేశం కోసం పోరాడిన చరిత్ర నిజమైన దేశభక్తి కమ్యూనిస్టులదే అన్నారు. దేశ రక్షణ, ప్రజా ప్రయోజనాల రక్షణకు సిపిఐ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

### నిజాన్ని, నిక్కచ్చిగా ధైర్యంగా చెప్పే సత్తా కమ్యూనిస్టులకే ఉంది : కూనంనేని సాంబశివరావు

నిజాన్ని నిక్కచ్చిగా ధైర్యంగా చెప్పే సత్తా కమ్యూనిస్టులకే ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అసలైన కమ్యూనిస్టులు తప్పును తప్పుగా, ఒప్పును ఒప్పుగా చెప్తారన్నారు. కమ్యూనిస్టుల భావజాలం ప్రకారం ఎక్కడ వెనుకబడి లేరని నిర్ణయక పాత్రలో ఉన్న విషయం ఆర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులు మద్దతు ఉన్న పక్షమే అధికారం చేజిక్కించుకోవడం దీనికి నిదర్శనమన్నారు. ఎన్నికలలో డబ్బులు ఖర్చు పెట్టడంలో కమ్యూనిస్టులు వెనుకబడి ఉన్న మాట వాస్తవమేనని, డబ్బులే ఖర్చు పెడితే కమ్యూనిస్టులే గెలుస్తారన్నారు. దేశంలో ప్రజల భావోద్వేగాలను రాజకీయాలకు వాడుతున్నారన్నారు. మనిషికి ఆకలి ఉన్నంత కాలం ఉద్యమాలు ఉంటాయని, ఉద్యమాలు ఉన్నంత కాలం కమ్యూనిస్టులుంటారని, ప్రజల పట్ల సమాజం పట్ల అంకిత భావం ఎర్రజెండాకే సాధ్యమన్నారు.

### వ్యాపారం కోసమే యుద్ధం : శ్రీనివాస్‌రెడ్డి

ప్రజలు ఏం కోరుకుంటున్నారో ప్రజల ప్రయోజనాలకు ఏమీ కావాలో దేశ ప్రయోజనాలకు ఏం కావాలో కమ్యూనిస్టులు గ్రహించి వివరించడంలో వెనుకబడ వద్దని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీలో ఉన్న నాయకులకైనా భావజాలన్ని అందించింది కమ్యూనిస్టులేనన్న విషయం మరువరాదన్నారు. కమ్యూనిస్టులు ప్రమాదకర పరిస్థితులను ప్రజలకు చెప్పడంలో ముందుండాలని అన్నారు. ప్రపంచ చరిత్రలో అమెరికా ఏ యుద్ధంలో ఇప్పటి వరకు గెలవలేదని కేవలం వ్యాపారం కోసమే యుద్ధాలు చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, అక్కినేని వనజ, జాతీయ మహిళ సమాఖ్య కార్యదర్శి రజిని, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, రైతాంగ పోరాట నాయకుడు దొడ్డా నారాయణరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు హేమంత రావు, రాష్ట్ర రైతుసంఘం కార్యదర్శి ప్రసాద్, రాష్ట్రమహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన, రంగారెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, గంగాభవాని, యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, ప్రేమ్, పావని, అమీనా, సదాలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6/75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com